శనివారం
23-03-2024
విజయవాడ ప్రచురణ
సంపుటి : 72, సంచిక : 271
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

బైడెన్ విధానాలపై కోర్టుకెళ్లిన 16 అమెరికా రాష్ట్రాలు

వాషింగ్టన్: బైడెన్ ప్రభుత్వం అనుసరించే కొన్ని విధానాలను సవాల్ చేస్తూ అమెరికాలోని 16 రాష్ట్రాలు కోర్టును ఆశ్రయించాయి. టెక్సాస్, లూసియానా, మిసిసిప్పీ, అలబామా, అలస్కా, అర్కాంసస్, ఫ్లోరిడా, జార్జియా, కాంకస్, మోంటానా, నెబ్రాస్కా, ఓక్లాహోమా, సౌత్ కరోలినా, ఉటా, వెస్ట్ వర్జీనియా, వ్యోమింగ్ రాష్ట్రాలు కలిసి బైడెన్ ప్రభుత్వంపై ఫిర్యాదు చేశాయి. లిక్విఫైడ్ నేచురల్ గ్యాస్ (ఎల్ఎన్జీ) ఎగుమతులను బైడెన్ ప్రభుత్వం నిషేధించడాన్ని తప్పుపట్టాయి.

కస్టడీకి కేజ్రీవాల్

28వ తేదీ మధ్యాహ్నం అప్పగించాలన్న కోర్టు

- ప్రధాన సూత్రధారి... విచారణకు సహకరించలేదన్న ఈడీ
- పది రోజుల కస్టడీ కోరిన దర్యాప్తు సంస్థ
- వారం రోజులకు అనుమతిచ్చిన కోర్టు
- ఆధారాలుంటే కోడ్ వచ్చే వరకు ఎందుకు అరెస్టు చేయలేదని వ్యాఖ్య
- ఢిల్లీ సీఎం తరపు న్యాయవాదుల ప్రశ్న
- దేశవ్యాప్తంగా ఆందోళనలు
- 26న ప్రధాని నివాసం ముట్టడిస్తాం: ఆప్

న్యూఢిల్లీ: మద్యం కేసులో ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌కు ఈనెల 28 వరకు ఈడీ కస్టడీకి అప్పగిస్తూ రౌస్ అవెన్యూ కోర్టు తీర్పునిచ్చింది. ఈ వ్యవహారంలో కేజ్రీవాల్‌ను కీలక నిందితుడిగా ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ (ఈడీ) ఆరోపించింది. పది రోజుల కస్టడీని కోరింది. కేసును విచారించిన ప్రత్యేక న్యాయమూర్తి కావేరి బవేజా ఈనెల 28 వరకు కేజ్రీవాల్ కస్టడీకి ఆదేశాలిచ్చారు. ఆరోజు

- మిగతా 2 లో

'నా జీవితం దేశానికి అంకితం'

- అరెస్టు తర్వాత కేజ్రీవాల్ తొలి స్పందన
- మోదీది అధికార దురహంకారం: సునీతా కేజ్రీవాల్

న్యూఢిల్లీ: మద్యం కేసులో అరెస్టుకు గురైన ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ తన జీవితం దేశానికి అంకితమని అన్నారు. జైల్లో ఉన్నానా... బయట ఉన్నానా అన్నది ముఖ్యం కాదని.... తానెక్కడ ఉన్నా తన జీవితం దేశానికే అంకితమంటూ అరెస్టు తర్వాత మొదటిసారి స్పందించారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ఆయనను శుక్రవారం రౌస్ అవెన్యూ కోర్టులో హాజరుపరిచ్చారు. కేసు విచారణ తర్వాత తీర్పును న్యాయస్థానం రిజర్వులో పెట్టింది. కోర్టుకు తీసుకెళ్లే సమయంలో కేజ్రీవాల్ పై వ్యాఖ్యలు చేశారు. కేజ్రీవాల్ అరెస్టుతో ప్రధాని మోదీపై ఆయన భార్య సునీతా కేజ్రీవాల్ తీవ్ర విమర్శలు చేశారు. మోదీ అధికార దురహంకారంతో కేజ్రీవాల్‌ను అరెస్టు చేయించారని, అందరినీ తొక్కేయాలని అనుకుంటున్నారన్నారు. 'మూడు సార్లు సీఎంగా ఎన్నికైన కేజ్రీవాల్‌ను కేవలం అధికార దురహంకారంతోనే మోదీ అరెస్టు చేయించారు.అందరినీ తొక్కేయాలని చూస్తున్నారు. తద్వారా ఢిల్లీ ప్రజలను మోసగించారు' ఆమె వ్యాఖ్యానించారు. కేజ్రీవాల్ సాధారణ పౌరుడిగానూ, ముఖ్యమంత్రిగానూ ఢిల్లీ ప్రజలకు సేవ చేశారని తెలిపారు. 'మీ సీఎం ఎప్పుడు మీ కోసమే ఆలోచించారు. శ్రమించారు. మీ వెంట నిలిచారు. జైల్లో ఉన్నా, బయట ఉన్నా ఆయన జీవితం దేశానికే అంకితం. ప్రజలకు అంతా తెలుసు. జైహింద్' అని ఎక్స్‌లో పేర్కొన్నారు.

మోదీజీ... రాజకీయంగా ప్రత్యర్థుల్ని ఎదుర్కోగలరా!

- ప్రధానికి సీపీఐ సవాల్
- కేజ్రీవాల్ అరెస్టుకు ఖండన
- విపక్షాలను బలహీనపర్చే కుట్ర
- బీజేపీకి ప్రజలే బుద్ధి చెబుతారు: డి.రాజా

2 లో

కేజ్రీవాల్ అరెస్టు అప్రజాస్వామికం

- దేశవ్యాప్తంగా ఆప్ ఆందోళనలు
- ఢిల్లీలో అతిశి, భరద్వాజ్ సహ అనేకమంది అరెస్టు
- మంత్రులను ఈడ్చుకెళ్లి బస్సులెక్కించిన వైనం
- హర్యానా సీఎం ఇంటి ముట్టడి - ఉద్రిక్తత
- నిరసనకారులపై విరిగిన లాఠీలు
- జలఫిరంగుల దాడుల్లో కొందరికి గాయాలు

8 లో

ఇస్రో మరో ఘనత... 'పుష్పక్' ప్రయోగం విజయవంతం

బెంగళూరు: భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) మరో ఘనత సాధించింది. రోదసి ప్రయాణాలు అత్యంత సులభతరం చేసేందుకు చేపట్టిన అత్యంత కీలకమైన ప్రయోగం విజయవంతమైంది. దేశీయ పరిజ్ఞానంతో అభివృద్ధి చేస్తున్న భారతదేశపు మొట్టమొదటి పునర్వినియోగ లాంచ్ వెహికల్ 'పుష్పక్ విమాన్'ను ఇస్రో శుక్రవారం విజయవంతంగా పరీక్షించింది. దీన్ని కర్ణాటకలోని రక్షణశాఖకు చెందిన 'చాలకెరె రన్‌వే' నుంచి ఉదయం ఏడు గంటలకు ప్రయోగించారు. ఇందులో భాగంగా పుష్పక్ తనంతట తానుగా రన్‌వేపై ల్యాండైంది. అత్యంత సంక్లిష్టమైన 'రొబోటిక్ ల్యాండింగ్' సామర్థ్యాన్ని సాధించేందుకు ఈ ప్రయోగాన్ని ఇస్రో చేపట్టింది. ఈ ప్రయోగం విజయవంతమైనట్లు ఇస్రో ఎక్స్ వేదికగా వెల్లడించింది. కాగా, ఆర్ఎల్‌వీ ప్రయోగాల్లో ఇస్రోకు ఇది మూడోది. 6.5 మీటర్ల పొడవు, 1.75 టన్నుల బరువుండే 'పుష్పక్'ను ఆకాశంలో ఓ ఐఏఎఫ్ హెలికాప్టర్ నుంచి భూమిపై నిర్దేశిత లక్ష్యం వైపు ప్రయోగిస్తారు.

డ్రగ్స్ అడ్డా విశాఖ

- మత్తులో యువత భవిత
- కొనసాగుతున్న సీబీఐ దర్యాప్తు

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం: ఆసియాలోనే అందాల నగరంగా పేరున్న విశాఖ ఇప్పుడు అంతర్జాతీయ మత్తు పదార్థాలకు కేంద్రంగా మారింది. ఇప్పటివరకు గంజాయికి పుట్టినిల్లుగా ఉన్న విశాఖ ఇప్పుడు డ్రగ్స్ కు కేంద్రంగా మారుతోంది. అనేక ప్రాంతాల నుంచి ఉన్నత చదువుల కోసం వచ్చే యువత డ్రగ్స్ బారిన పడి కొట్టుమిట్టాడుతున్నారు. నగర శివారు ప్రాంతాలు డ్రగ్స్ కేంద్రాలుగా మారిపోయాయి. చీకటి పడితే... రోడ్ల పక్కనే మత్తు పదార్థాలు తీసుకుంటూ యువత మత్తులో మునిగి తేలిపోతున్న సంఘటనలు అనేకం విశాఖలో నిత్యం కనిపిస్తూనే ఉన్నాయి. డ్రగ్స్ మత్తులో నిర్లక్ష్యంగా వాహనాలు నడుపుతుండటంతో అనేక రోడ్డు ప్రమాదాలు సంభవిస్తూనే ఉన్నాయి. తమ పిల్లల భవిష్యత్తు అంధకారంగా మారిపోతోందని అనేక మంది తల్లిదండ్రులు తీవ్ర ఆవేదనకు గురవుతున్నారు. డ్రగ్స్ మాఫియా కోట్లాది రూపాయలు వ్యాపారాలు చేసుకుంటూ యువత జీవితాలను విచ్ఛిన్నం చేస్తున్నారు. నియంత్రించాల్సిన పాలకులే డ్రగ్స్ వ్యాపార సంధాన కర్తలుగా మారడం సమాజానికి తీరని అన్యాయమే. విశాఖ రవాణా కు అనువైన ప్రదేశం కావడంతో వాయు మార్గం, జలమార్గం, రోడ్డు మార్గాల గుండా తరలిస్తున్న డ్రగ్స్

- మిగతా 2 లో

సీపీఐ బెగుసరాయి అభ్యర్థి అవదేశ్ కుమార్

పాట్నా: బీహార్, బెగుసరాయి లోక్‌సభ స్థానానికి అభ్యర్థిని భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) శుక్రవారం ప్రకటించింది. మూడుసార్లు బచ్చావరా అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా గెలిచిన అవదేశ్ కుమార్ రాయ్‌కు బెగుసరాయి అభ్యర్థిత్వాన్ని ఖరారు చేసింది. మహాకూటమితో కలిసి పయనిస్తున్న క్రమంలో సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా గురువారం ఆర్జేడీ అధినేత లాలూ ప్రసాద్ యాదవ్‌తో భేటీ అయ్యారు. ఇద్దరు చర్చించిన తర్వాత ఈ మేరకు నిర్ణయించారు. కాగా 2019లో ఈ స్థానం నుంచి బీజేపీ అభ్యర్థి గిరిరాజ్ సింగ్‌పై సీపీఐ తరపున పోటీ చేసిన జేఎన్‌యూ విద్యార్థి సంఘం మాజీ అధ్యక్షుడు కన్హయ కుమార్ ఓడిపోయారు. ఆయన ప్రస్తుతం కాంగ్రెస్‌లో ఉన్నారు. సీపీఐకు కుంచుకోటగా భావించే ఈ స్థానం అభ్యర్థిగా రాయ్‌ను ప్రకటించడంతో కన్హయకు అవకాశం లేకుండా పోయింది.

రండి దర్శించండి తరించండి

శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి వారి దేవస్థానము
శింగరకొండ, అద్దంకి మండలం, బాపట్ల జిల్లా

69వ వార్షిక తిరునాళ్ళ మహోత్సవముల ఆహ్వానము
తేది : 23-03-2024 నుండి 25-03-2024 సోమవరం వరకు

స్వామియే స్వయముగా ఆవిర్భవించి క్షేత్ర మహిమలు కలిగిన దివ్య క్షేత్రము శింగరకొండ నందు
తేది : 23-03-2024 ఉ. 9.00 గం॥లకు ధ్వజారోహణ, సాయంత్రం గం. 6.00 లకు గజవాహన సేవ
తేది : 24-03-2024 ఉ॥ 6.30 గంటలకు విశేష అభిషేకములు, సాయంత్రం గం. 6.00 లకు ఉష్ణవాహన సేవ
తేది : 25-03-2024 సోమవారం ఉదయం 5.00 గం. నుండి స్వామి వారి దివ్య దర్శనము.
సాయంత్రం గం. 6.00 లకు రథోత్సవము.

ప్రతిరోజు సాయంత్రము గం. 6.00 నుండి సాంస్కృతిక కార్యక్రమములు కలవు. భక్తులు విరివిగా ఈ మహోత్సవములో పాల్గొని స్వామి వారి తీర్థ ప్రసాదములు స్వీకరించి స్వామివారి కృపకు పాత్రులు కావలసినదిగా కోరుచున్నాము.

పార్కింగ్ స్థలములు :
1. అద్దంకి వైపు నుండి వచ్చు వాహనములకు కూకట్ల కన్వెన్షన్ హాల్ ప్రక్క నుండి 99 అడుగుల విగ్రహము వరకు
2. నరసరావుపేట వైపు నుంచి వచ్చు వాహనములకు చక్రాయపాలెం వైపు గల ఆర్చ్ గేట్ వద్ద.
3. శింగరకొండ పాలెం వైపు వచ్చు వాహనదారులు శింగరకొండ పాలెం యం.పి.హెచ్. స్కూల్ వద్ద.

వాహనాల మళ్ళింపు :
1) ఒంగోలు నుంచి హైదరాబాద్ వెళ్ళు వాహనాలు వయా మార్టూరు, చిలకలూరిపేట, నర్సరావుపేట మీదుగా.
2) వినుకొండ నుంచు వాహనాలు సంతమాగులూరు అడ్డరోడ్డు నుంచి చిలకలూరిపేట మీదుగా ఒంగోలు.
3) నంద్యాల, కడప నుంచి వచ్చు వాహనాలు పొదిలి, చీమకుర్తి, ఒంగోలు మీదుగా గుంటూరు, చెన్నైకు
ట్రాఫిక్ మళ్ళింపు : మేదరమెట్ల పైలాన్ నుంచి మార్టూరు మీదుగా



దేవస్థానములో జరుగు రాతి ముఖమండపము పున:నిర్మాణమునకు మరియు వివిధ అభివృద్ధి పనులకు భక్తులు సహకరించి విరివిగా విరాళములు ఇచ్చి స్వామి వారి కృపకు పాత్రులు కాగలరు. పరోక్షముగా aptemples.ap.gov.in వెబ్‌సైట్ ద్వారా E-Hundi, E- Donations మరియు అన్ని స్వామివారి సేవలలో పాల్గొనవచ్చును.

తిల్లాప్రగడ సుభద్ర
సహాయ కమిషనర్ మరియు కార్యనిర్వహణాధికారి

శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి దేవస్థానము / శింగరకొండ, అద్దంకి (మం), బాపట్ల జిల్లా.

ఇదీ లోకం!

ఆహా... మీరెంత తెలివైనవారు.. అద్భుతమంతుబు!

సీనియర్లకు మళ్లీ చుక్కెదురు

- టీడీపీ మూడో జాబితాలోనూ దేవినేని, కళా, గంటా, బండారుకు దక్కని చోటు
- వరుసగా నాలుగుసార్లు ఓడిన సోమిరెడ్డికి టికెట్!

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: తెలుగుదేశం పార్టీలో కొందరు సీనియర్ నేతలకు మళ్లీ చుక్కెదురైంది. మూడో విడతగా 11 మంది అసెంబ్లీ అభ్యర్థులతో ఆ పార్టీ అధ్యక్షుడు చంద్రబాబు శుక్రవారం విడుదల చేసిన జాబితాలో వారికి అవకాశం దక్కలేదు. తొలి జాబితాలోనే తమ పేర్లు ఉంటాయని ఆశించిన ఈ సీనియర్ నేతలకు, దాదాపు చివరిదిగా భావిస్తున్న మూడో జాబితాలో కూడా చోటు దక్కకపోవడంతో వారి పరిస్థితి ప్రశ్నార్థకంగా మారింది. బీజేపీ, జనసేన పార్టీలతో ఎన్నికల పొత్తులో భాగంగా వారికి కేటాయించిన సీట్లను మినహాయిస్తే రాష్ట్రవ్యాప్తంగా 144 అసెంబ్లీ, 17 పార్లమెంటు నియోజకవర్గాల నుంచి టీడీపీ పోటీ చేయనుంది. ఇందుకుగాను 94 మందితో తొలి, 34 మంది అసెంబ్లీ అభ్యర్థులతో మలి జాబితా విడుదల చేయగా, 11 మందితో మూడో జాబితా తాజాగా విడుదలైంది. 1999 నుంచి నాలుగుసార్లు వరుసగా శాసనసభకు ఎన్నికైన సీనియర్ నేత దేవినేని ఉమామహేశ్వరరావు 2019 ఎన్నికల్లో మైలవరం నియోజకవర్గం నుంచి పోటీ చేసి ఓటమి చెందారు. ఆయనపై గెలుపొందిన వైసీపీ అభ్యర్థి వసంత కృష్ణప్రసాద్ ఇటీవలే టీడీపీలో చేరగా... ఆయనకు చంద్రబాబు అభ్యర్థిత్వం ఖరారు చేశారు. దేవినేని ఉమాను పెనమలూరు నియోజకవర్గం నుంచి పోటీ చేయిస్తారన్న ప్రచారం జరిగింది. అయితే అందుకు ఆయన సుముఖత వ్యక్తం చేయకపోవడం, పెనమలూరు సిట్టింగ్ ఇన్‌చార్జి బోడే ప్రసాద్‌కే టికెట్ ఇవ్వడంతో

- మిగతా 2 లో

క్యూబాపై అమెరికా విధ్వంసకర చర్యలు ఆక్షేపణీయం

- క్యూబా కమ్యూనిస్టు పార్టీ
- అంతర్జాతీయ సంఘీభావానికి పిలుపు

హవానా: తమ దేశ అంతర్గత వ్యవహారాల్లో అమెరికా ప్రభుత్వం జోక్యం, విప్లవాన్ని అస్థిరపర్చే ప్రయత్నాలను తిప్పికొట్టాలని క్యూబా కమ్యూనిస్టు పార్టీ (పీసీసీ) పిలుపునిచ్చింది. ఇందుకోసం కలిసిరావాలని అంతర్జాతీయ సమాజాన్ని కోరింది. సోదర కమ్యూనిస్టు పార్టీలు, సామాజిక, రాజకీయ సంఘాల సంఘీభావాన్ని కోరింది. 'మా దేశ ప్రజలను పీడించే సమస్యలలో ఆహార సరఫరా, విద్యుత్ ఉత్పత్తిలో లోటు ప్రధానం. ప్రశాంత దేశాన్ని అస్థిరపర్చేందుకు అమెరికా యత్నిస్తోంది. ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు, వారి గోడు వినేందుకు క్యూబా కమ్యూనిస్టు పార్టీ, ప్రభుత్వ ఉన్నతస్థాయి ప్రతినిధులు చేస్తున్న ప్రయత్నాలను నీరుగార్చేందుకు ప్రయత్నిస్తోంది. అమెరికా ప్రభుత్వం, హవానాలోని దాని దౌత్యకార్యాలయం జోక్యం... వాస్తవాలను వక్రీకరించే ప్రయత్నాలు ఆక్షేపణీయం. దేశ ప్రజలు ఎదుర్కొంటున్న తీవ్ర ఆర్థిక సంక్షోభానికి క్యూబా ప్రభుత్వమే కారణమని ప్రచారాన్ని అమెరికా చేస్తోంది. ఆంక్షలు, నిర్బంధాలతో రెచ్చిపోతోంది. ఉగ్రవాదాన్ని పెంపొందించే దేశమంటూ ఇష్టారీత్యా ఆంక్షలు విధిస్తూ క్యూబా విప్లవ చరిత్రను, అమరవీరుల ప్రతిష్ఠను దిగజార్చాలని చూస్తోంది. ప్రజల జీవనాన్ని మెరుగుపర్చేందుకు క్యూబా ప్రభుత్వం చేసే ప్రతి పనిని అడ్డుకునేందుకు అక్రమ పద్ధతులతో అవరోధాలు సృష్టించడం ఆమోదయోగ్యం కాదు. ఈ పరిస్థితుల్లో క్యూబాకు రాజకీయ మిత్రపక్షాలు, సామాజిక ఉద్యమ సంఘాలు, ప్రపంచ సంఘీభావం ఎంతో అవసరం. క్యూబా విప్లవ చరిత్రను వక్రీకరించేందుకు... యోధులను అతిక్రమపాల్జేసేందుకు జరుగుతున్న ప్రయత్నాలను తిప్పికొట్టేందుకు అంతర్జాతీయ సంఘాల మద్దతు అత్యవసరం. క్యూబా న్యాయబద్ధ హక్కుల పంరిరక్షణ, సార్వభౌమత్వం, స్వతంత్ర సమాజాన్ని రక్షించుకోవడం కోసం వాస్తవాలను కాపాడుకోవడానికి అంతర్జాతీయ సంఘీభావాన్ని కోరుతున్నాం' అని క్యూబా కమ్యూనిస్టు పార్టీ ఒక ప్రకటన వెలువరించింది.

ప్రపంచమంతా అరుణ పతాకం ఎగరాలి...

కేకేఈ ఆకాంక్ష: లెనిన్‌కు ఘన నివాళి

గ్రీస్: సోవియట్ యూనియన్ విప్లవయోధుడు వ్లాదిమిర్ లెనిన్ శతవర్ధంతిని పురస్క రించుకొని ఆయనకు గ్రీస్ కమ్యూనిస్టు పార్టీ (కేకేఈ) ఘనంగా నివాళు లర్పించింది. ఈ సందర్భంగా కేకేఈ కేంద్ర కార్యాలయంలోని హాల్‌లో నిర్వహించిన సభకు అన్ని వయ స్సుల వారు హాజరయ్యారు. కార్మికులు, యువతీ యువకులతో హాలు కిక్కిరిసింది. సభనుద్దేశించి కేకేఈ కేంద్ర కమిటీ ప్రధాన కార్యదర్శి దిమిత్రిస్ కౌట్సంబస్ ప్రసం గించారు. లెనిన్ విప్లవ వారసత్వాన్ని కొనసాగించాలని పిలుపునిచ్చారు. ఎర్ర జెండా మరోమారు అంతటా రెపరెపలాడుతుందని ఆకాంక్షించారు. లెనిన్‌గ్రాడ్, మాస్కో, బెర్లిన్‌లోనే కాదు యూరప్ వ్యాప్తంగా, ఆసియా, అమెరికా, ఆఫ్రికా, ఓషియానాతో పాటు ప్రపంచమంతటా అరుణపతాకం ఎగురుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఎర్రజెండాతోనే ప్రజలకు మంచి జీవితం లభించగలదని అన్నారు. లెనిన్ ఆశయాల సాధనకు కృషి చేయాలని ఆయన అన్నారు. దిమిత్రిస్ ప్రసంగం ముగిసిన తర్వాత సోవియట్ కంపోజర్లు... ఇతర కళాకారుల కాన్సర్ట్ జరిగింది. అది ప్రేక్షకులను అమితంగా ఆకట్టుకుంది.

టీడీపీ మూడో జాబితా

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: తెలుగుదేశం పార్టీ అభ్యర్థుల మూడో జాబితా విడుదలైంది. 11 శాసనసభ స్థానాలతో పాటు 13 ఎంపీ అభ్యర్థులను ఆ పార్టీ ప్రకటించింది. బీజేపీ, జనసేన పార్టీలతో పొత్తులో భాగంగా 144 అసెంబ్లీ, 17 పార్లమెంట్ స్థానాల్లో టీడీపీ పోటీ చేయనున్న విషయం తెల్సిందే. గతంలో రెండు విడతలుగా 128 శాసనసభ స్థానాలకు అభ్యర్థులను ప్రకటించగా... తాజాగా మరో 11 మందికి అభ్యర్థిత్వాలను ఖరారు చేసింది. అలాగే లోక్‌సభ నియోజక వర్గాలకు తొలివిడతగా ఒకేసారి 13 నియోజకవర్గాలకు అభ్యర్థులను ప్రకటించింది. ఇక ఎన్నికల పొత్తులో భాగంగా కేవలం 5 అసెంబ్లీ, 4 ఎంపీ స్థానాలకు మాత్రమే అభ్యర్థులను ప్రకటించాల్సి ఉంది.

అసెంబ్లీ అభ్యర్థులు

పలాస-గౌతు శిరీష, పాతపట్నం- మామిడి గోవిందరావు, శ్రీకాకుళం-గొండు శంకర్, శృంగవరపుకోట- కోళ్ల లలిత కుమారి, కాకినాడ సిటీ- వనమాడి వెంకటేశ్వరరావు (కొండబాబు), అమలా పురం (ఎస్సీ)- అయితాబత్తుల ఆనందరావు, పెనమలూరు-బోడె ప్రసాద్, మైలవరం- వసంత వెంకట కృష్ణప్రసాద్, నరసరావుపేట- చదలవాడ అరవిందబాబు, చీరాల- మద్దులూరి మాలకొండయ్య యాదవ్, సర్వేపల్లి- సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి.

లోక్‌సభ స్థానాల అభ్యర్థులు

శ్రీకాకుళం- కింజరాపు రామ్మోహన్ నాయుడు, విశాఖపట్నం- మతుకుమిల్లి భరత్, అమలాపురం- గంటి హరీశ్, ఏలూరు - పుట్టా మహేశ్ యాదవ్, విజయవాడ- కేశినేని శివనాథ్ (చిన్ని), గుంటూరు- పెమ్మసాని చంద్రశేఖర్, నరసరావుపేట- లావు శ్రీకృష్ణ దేవరాయలు, బాపట్ల- టీ కృష్ణ ప్రసాద్, నెల్లూరు- వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, చిత్తూరు- దగ్గుమళ్ల ప్రసాదరావు, కర్నూలు- బస్తిపాటి నాగరాజు (పంచలింగాల నాగరాజు), నంద్యాల- బైరెడ్డి శబరి, హిందూపురం- బీకే పార్థసారథి.

ప్రజలు ఆశీర్వదించాలి: చంద్రబాబు

టీడీపీ మూడో జాబితా విడుదల చేసిన సందర్భంగా పార్టీ అధినేత చంద్రబాబు 'ఎక్స్' వేదికగా పోస్టు చేశారు. రాష్ట్ర ప్రయోజ నాలే ఏకైక ఎజెండాగా ఎన్డీఏలో చేరినట్లు తెలిపారు. పార్లమెంటులో బలమైన గళం వినిపించి రాష్ట్రం కోసం పోరాడగల నాయకులనే అభ్యర్థులుగా నిలబెడుతున్నట్లు చెప్పారు. ప్రజాభిప్రాయం మేరకు అభ్యర్థుల ఎంపిక జరిగిందని...ప్రజలంతా ఆశీర్వదించాలని కోరారు.

మోదీజీ... రాజకీయంగా ప్రత్యర్థుల్ని ఎదుర్కోగలరా!

పాట్నా: రాజకీయంగా ప్రత్యర్థుల్ని ఎదుర్కొనే దమ్ముందా అంటూ ప్రధాని మోదీకి సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా సవాల్ విసిరారు. అధిక ధరలు, నిరుద్యోగం, పేదరికం వంటి సమస్యలు వెంటాడుతుండటంతో ప్రజాగ్రహం, అసమ్మతి అంటే మోదీకి భయం పట్టుకున్నదని వ్యాఖ్యానించారు. ప్రతిపక్ష పార్టీలను భయపెట్టేందుకు, బలహీనపర్చేందుకు అన్ని ప్రయత్నాలు చేస్తున్నారని విమర్శించారు. ఇదే క్రమంలో దిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ అరెస్టు జరిందని, దీనిని సీపీఐ తీవ్రంగా ఖండిస్తోందని రాజా తెలిపారు. ఆయన శుక్రవారం పీటీఐతో మాట్లాడుతూ మోదీపై, బీజేపీపై విమర్శలు గుప్పించారు. లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్ వచ్చాక ఒక ముఖ్యమంత్రిని అరెస్టు చేయించడం వెనుక విపక్షాన్ని బెదిరించే, బలహీనపర్చే కుట్ర ఉన్నదని వ్యాఖ్యానించారు. ఇలాంటి పార్టీకి రాబోయే ఎన్నికల్లో ప్రజలు తగు గుణపాఠం చెబుతారన్నారు. కేజ్రీవాల్ అరెస్టుకు గురయ్యారు... మరి ఆ పార్టీ తరపు ఆయన ప్రచారం ఎలా చేయగలరు? ఇదంతా మోదీ ప్రభుత్వ కుట్ర. విపక్షాన్ని బలహీనపర్చి పబ్బం గడుపుకునే యత్నం అని రాజా దుయ్యబట్టారు. పేదరికం, నిరుద్యోగం, అధిక ధరలు వంటి సమస్యలపై ప్రజాగ్రహం భయంతోనే ప్రతిపక్షాన్ని బెదిరించేందుకు కేంద్ర దర్యాప్తు సంస్థలు ముఖ్యంగా ఈడీని మోదీ ప్రభుత్వం వినియోగిస్తోందన్నారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన బ్యాంకు ఖాతాల స్తంభనను రాజా ప్రస్తావించారు. ఇది ఆర్థిక ఉగ్రవాదమని... రాజకీయ ప్రత్యర్థులలో భయాన్ని నింపడం తప్ప మరో ఉద్దేశం లేదన్నారు. నిరంకుశ ప్రభుత్వానికి ప్రజలు తమ ఓటుతో బుద్ధి చెబుతారన్నారు. దక్షిణ రాష్ట్రాల్లోకి బీజేపీని చొప్పించేందుకు ప్రధాని యత్నిస్తున్నారని వ్యాఖ్యానించారు. కర్నాటకలో ఒకప్పుడు అధికారంలో ఉన్న పార్టీ ఇప్పుడు కనుమరుగు అయ్యింది. తెలంగాణలోనూ చతికిల పడింది. తమిళనాడు సామాజిక సంస్కరణలకు, పోరాటాల రాష్ట్రం. ఇక్కడ బీజేపీ హిందూత్వ రాజకీయాలకు స్థానంలేదు' అని రాజా నొక్కిచెప్పారు.

కరువు మండలాల్లో ఉపాధి పనుల కల్పనకు చర్యలు

కలెక్టర్లకు సీఎస్ జవహర్ రెడ్డి ఆదేశం

విశాలాంధ్ర-విజయవాడ: రాష్ట్రంలో ముఖ్యంగా కరువు మండలాల్లో ఎక్కడా తాగునీటి సరఫరా, ఉపాధి హామీ పనుల కల్పనలో ఇబ్బందులు రాకుండా తగు చర్యలు తీసుకో వాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్.జవహర్ రెడ్డి జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. కరువు మండలాల్లో ఉఫాదిహామీ పనులు, తాగునీటి సరఫరా అంశాలపై శుక్రవారం వెలగపూడి రాష్ట్ర సచివాలయం నుంచి ఎన్టీఆర్, ప్రకాశం, కర్నూలు, అనంతపురం, శ్రీ సత్యసాయి, నెల్లూరు, నంద్యాల, అన్నమయ్య, చిత్తూరు జిల్లాల కలెక్టర్లు, పంచాయితీ రాజ్, గ్రామీణా భివృద్ధి, జలవనరులు, విపత్తుల నిర్వహణ శాఖల అధికారులతో సీఎస్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ జూన్ ఆఖరు వరకు కరువు మండలాల్లో తాగునీటి కొరత లేకుండా చూడడం తోపాటు పెద్ద ఎత్తున ఉపాధి హామీ పథకం కింద కూలీలకు పనులు కల్పించాలని ఆదేశించారు. వేసవి ఎండల దృష్ట్యా ఉపాధి హామీ పనులను ఉదయం 5.30 గం.ల నుండి ఉ.10.30 గం.ల వరకూ నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్లను సీఎస్ ఆదేశించారు. 80 శాతం పైగా పనులు పూర్తయిన వివిధ మంచినీటి పథకాలను యుద్ధప్రాతి పదికన పూర్తి చేసి.. అందుబాటులోకి తేవాలని స్పష్టం చేశారు. వీటికి సంబంధించి ఎలాంటి నిధుల కొరత ఉండ బోదన్నారు. అంతే గాక మల్టీ విలేజ్, సింగిల్ విలేజ్ మంచినీటి సరఫరా పథకాలు సక్రమంగా పనిచేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. తాగు నీటిని పొదుపుగా విని యోగించేలా ప్రజల్లో అవగాహన కల్పించాల న్నారు. కరువు మండలాల్లోని భూగర్భ జలాల పరిస్థితులను ఎప్పటికప్పుడు అంచనావేసి అం దుకు అనుగుణంగా తగిన చర్యలు తీసుకోవాలని సీఎస్ కలెక్టర్లుకు స్పష్టం చేశారు. రాష్ట్ర జల వనరులు, పంచాయతీ రాజ్, గ్రామీణా భివృద్ధి శాఖల ముఖ్య కార్యదర్శి శశి భూషణ్ కుమార్ మాట్లాడుతూ ట్యాంకులు ద్వారా మంచినీటి సరఫరా చేసే వాహన్నాలన్ని టినీ జియో ట్యాగింగ్ చేసి నిరంతరం పర్యవేక్షించడం ద్వారా మంచినీటి వృధాను నియంత్రిం చేందుకు చర్యలు తీసుకుం టామని చెప్పారు. ఈ సమావేశంలో పంచాయతీ రాజ్ శాఖ కమిషనర్ కె.కన్నబాబు, విపత్తుల నిర్వహణ సంస్థ డైరెక్టర్ ఆర్.కూర్మనాథ్, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారి కృష్ణారెడ్డి తదితర అధికారులు పాల్గొనగా... వర్చువల్‌గా జలవనరుల శాఖ అధికారి నారాయణ రెడ్డి పాల్గొన్నారు.

విశాఖలో డ్రగ్స్ కలకలంపై

సమగ్ర విచారణ

రామకృష్ణ డిమాండ్

విశాలాంధ్ర-విజయవాడ: విశాఖపట్నం పోర్టులో భారీగా డ్రగ్స్ పట్టు పడటంపై సమగ్ర విచారణ జరిపి... కారకులను కఠినంగా శిక్షించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కే రామకృష్ణ శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. బ్రెజిల్ నుండి విశాఖ పోర్టుకు లక్షల కోట్ల విలువైన డ్రగ్స్ దిగుమతి కావడం తీవ్ర ఆందోళన కలిగించే విషయం అన్నారు. పోర్టులు ప్రైవేటుపరం చేయటమే మాదకద్రవ్యాల అక్రమ రవాణాకు కారణంగా గోచరిస్తోందని పేర్కొన్నారు. కేంద్రంలో నరేంద్రమోదీ ప్రభుత్వం, రాష్ట్రంలో జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వాలు అదానీకి దాసోహ మంటూ పోర్టులను ప్రైవేటుపరం చేయడంతో మాదకద్రవ్యాల అక్రమ రవాణాకు రెక్కలొచ్చా యన్నారు. యువత భవిత, ప్రజల రక్షణను ప్రశ్నా ర్థకం చేసేలా ఏపీలో గంజాయి, డ్రగ్స్ కలకలం రేపుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. గతంలో గుజరాత్‌లోని ముంద్రా పోర్టులో విజయవాడ చిరునామాతో వేల కోట్ల విలువైన హెరాయిన్ దొరకగా, ఇప్పుడు సంధ్యా ఆక్వా ఎక్స్‌పోర్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ పేరుతో విశాఖ పోర్టులో లక్షల కోట్ల విలువైన మాదకద్రవ్యాలు దొరికాయన్నారు. డ్రగ్స్ రాకెట్ వెనుక అధికార వైసీపీ నేతలు, పలువురు అధికారుల హస్తం, ఒత్తిళ్లు ఉన్నట్లు ఆరోపణలు గుప్పుమంటు న్నాయని...ఈ విషయంపై నిగ్గు తేల్చాల్సిన అవసరం ఉందన్నారు. వేలాది కోట్ల రూపాయల ఆస్తులు కలిగిన గంగవరం పోర్టును కేవలం రూ. 628 కోట్లకు అదానీ కంపెనీకి జగన్ ప్రభుత్వం అప్పనంగా అప్పజెప్పిందన్నారు. రూ.23 వేల కోట్ల ప్రజా పెట్టుబడితో అత్యాధునిక టెక్నాలజీ కలిగిన శ్రీ దామోదరం సంజీవయ్య కృష్ణపట్నం థర్మల్ పవర్ స్టేషన్‌ను కూడా మెయింటినెన్స్ పేరుతో అదానీకే కట్ట బెట్టిందని తెలిపారు. పోర్టులను ప్రైవేటుపరం చేయడంవల్ల అవినీతి, లంచగొండితనం, రాజకీయ నేతల, అధికారుల ఒత్తిడి వంటివి నానాటికీ పెరిగి ప్రజల రక్షణ, దేశ భద్రతకు ముప్పువాటిల్లే ప్రమాదం ఉందన్నారు. ఏపీలో గంజాయి, మత్తుపదార్థాల వినియోగం తీవ్రంగా కనిపిస్తున్నప్పటికీ వైసీపీ ప్రభుత్వం, పోలీసులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. ఏపీలో గంజాయి, డ్రగ్స్ కలకలం యువత భవితకు ప్రశ్నార్థకంగా మారాయన్నారు. విశాఖను రాజధానిగా చేస్తానంటూ ప్రగల్భాలు పలుకుతున్న జగన్‌మోహన్‌రెడ్డి పోర్టులో లక్షల కోట్ల విలువైన డ్రగ్స్ పట్టుపడడంపై నోరువిప్పి, ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

జలాశయాలు వెలవెల

న్యూదిల్లీ: వేసవి ముంగిట ప్రధాన జలాశయాలు వెలవెల బోవడం కలవరానికి గురిచేస్తోంది. దీంతో తాగునీటికి తీవ్ర ఇబ్బందులు తలెత్తే పరిస్థితి నెలకొంది. ముఖ్యంగా దక్షిణాది రాష్ట్రాల్లో గత ఏడాదితో పోలిస్తే నీటి నిల్వల శాతం బాగా తగ్గింది. ప్రస్తుతం దేశంలోని 150 ప్రధాన జలాశాయాల్లో ప్రత్యక్ష నిల్వ సామర్థ్యం వాటి మొత్తం సామర్థ్యంలో కేవలం 38శాతం మాత్రమే ఉన్నట్లు అధికారిక గణాంకాలు చెబుతున్నాయి. గత పదేళ్ల కాలపు సగటు కంటే ఇది అత్యంత తక్కువ. బెంగళూరు వంటి నగరాలకు రోజుకు 2,600 మిలియన్ల లీటర్ల (ఎంఎల్‌డి) నీరు అవ సరం కాగా... రోజుకు 500 మిలియన్ లీటర్ల నీటి కొరత ఎదుర్కొంటున్నాయి. కేంద్ర జల కమిషన్ వీక్లీ బులెటిన్ ప్రకారం... గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే ఇతర రాష్ట్రాల కన్న కర్నాటక తక్కువ నీటినిల్వ స్థాయిలను నమోదు చేసింది. ప్రధానంగా బెంగళూరులో 14,000 బోర్‌వెల్‌లు ఉండగా వాటిలో 6,900 ఎండి పోయాయి. చెరువులు ఆక్రమణలకు గురవడమో లేదా ఎండిపోవడమో జరిగింది. నగరానికి 2,600 ఎంఎల్‌డి నీరు అవసరం కాగా... అందులో 1,470 ఎంఎల్‌డి కావేరి నది నుంచి, 650 ఎంఎల్‌డి బోర్‌వెల్‌ల నుండి లభిస్తుందని కర్నాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య తెలిపారు. ఇక గత సంవత్సరంతో పోలిస్తే హిమాచల్ ప్రదేశ్, పంజాబ్, మధ్యప్రదేశ్, త్రిపుర, రాజస్థాన్, బీహార్, మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్, గుజరాత్, చత్తీస్‌గఢ్, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ (రెండు రాష్ట్రాలలో కలిపి రెండు ప్రాజెక్టులు), తమిళనాడుతో సహా అనేక ఇతర రాష్ట్రాలు కూడా జలాశయాల్లో తక్కువ నిల్వ స్థాయిలను నివేదించాయి. అధికారిక డేటా ప్రకారం ఈ 150 జలాశాయాల మొత్తం ప్రత్యక్ష నిల్వ సామర్థ్యం 178.784 బిలియన్ క్యూబిక్ మీటర్లు (బీసీఎం) కాగా... ఇది దేశపు మొత్తం ప్రత్యక్ష నీటి నిల్వ సామర్థ్యం (257.812 బిలియన్ క్యూబిక్ మీటర్లు)లో 69.35 శాతంగా ఉంది. జలాశయాల్లో నీటివనరుల నిల్వపై గురువారం వెల్లడైన సమాచారం మేరకు ఈ రిజర్వాయర్లలో అందుబాటులో ఉన్న ప్రత్యక్ష నిల్వ 67.591 బీసీఎంగా ఉంది. ఇది వాటి మొత్తం ప్రత్యక్ష నిల్వ సామర్థ్యంలో 38 శాతం మాత్రమే. అయితే గత దశాబ్దం కాలపు సగటు 72.396 బీసీఎంతో గత సంవత్సరం ఇదే కాలంలో 80.557 బీసీఎం ప్రత్యక్ష నీటి నిల్వలు అందుబాటులో ఉండటం గమనార్హం.

డ్రగ్స్ అడ్డా విశాఖ

(మొదటిపేజీ తరువాయి)

విచ్చలవిడిగా చిల్లర కొట్టుల్లో సైతం లభిస్తున్నాయి. అందుకు తాజాగా విశాఖ పోర్టులో భారీ డ్రగ్స్ కంటైనర్ లభ్యం కావడమే నిదర్శనం. ఈ డ్రగ్స్ కంటైనర్ వెనుక రాజకీయ నేతల ప్రమేయం ఉందన్న సంగతి తెలిసిందే. పార్టీలు పరస్పర ఆరోపణలు చేసుకోవడం తప్ప డ్రగ్స్ రహిత ఆంధ్ర ప్రదేశ్ ను తీర్చిదిద్దేందుకు ప్రయత్నించకపోవడం బాధాకరం. యువతను మత్తులో ముంచి తమ స్వార్థ ప్రయోజనాలు నెరవేర్చుకోవాలని కొన్ని రాజకీయ పార్టీలు డ్రగ్స్ ను విచ్చలవిడిగా ప్రోత్సహించడాన్ని ప్రతి ఒక్కరూ ఖండించాలి.

కంపెనీ ప్రతినిధులపై కేసు నమోదు

విశాఖపట్నం లాసన్స్‌బే కాలనీలోని సంధ్య ఆక్వా ఎక్స్‌పోర్ట్స్ ప్రైవేటు లిమిటెడ్ కంపెనీ వ్యాపార అవసరాల కోసం 'డ్రై ఈస్ట్'ను ఆర్డర్ చేసింది. అందులో డ్రగ్స్ కలిపి బ్రెజిల్ నుంచి విశాఖపట్నానికి రవాణా చేసినట్టు ఇంటర్‌పోల్ నుంచి సమాచారం రావడంతో సీబీఐ అధికారులు అప్రమత్తమయ్యారు. ఈ నెల 16న విశాఖ పోర్టుకు చేరుకున్న కంటైనర్‌ను గుర్తించి గురువారం రాత్రి స్వాధీనం చేసుకున్నారు. దిల్లీ నుంచి వచ్చిన నిపుణులు సరకు తెప్పించుకున్న ఆక్వా కంపెనీ ప్రతినిధులను పిలిపించి వారి సమక్షంలోనే కంటెయినర్ (నంబర్ ఎస్‌ఈఊఆర్‌యూ 437538) తెరిచారు. అందులో డ్రై ఈస్ట్‌తో పాటు డ్రగ్స్ కూడా ఉండడంతో స్వాధీనం చేసుకున్నారు. దీనిపై ఆక్వా సంస్థ ప్రతినిధులను ప్రశ్నించగా, తాము ఆక్వాకల్చర్ వ్యాపారం చేస్తున్నామని, తొలిసారిగా దీన్ని తెప్పించుకున్నామని అంటున్నారు. సుమారు 25 వేల కిలోల 'డ్రై ఈస్ట్'తో కలిపి ఉన్న కొకైన్‌ను స్వాధీనం చేసుకున్నట్టు సీబీఐ అధికారులు వెల్లడించారు. ఇన్ యాక్టివ్ డ్రై ఈస్ట్‌తో నార్కోటిక్స్ డ్రగ్స్‌ను కలిపినట్టు నిర్ధారించారు. డ్రగ్స్‌తో వచ్చిన కంటైనర్‌ను విశాఖలో ఆక్వా ఎగుమతులు, దిగుమతులు చేపట్టే సంధ్య ఆక్వా ఎక్స్‌పోర్టర్స్ ప్రైవేటు లిమిటెడ్ కంపెనీ పేరిట బుక్ చేసినట్టు సీబీఐ అధికారులు తేల్చారు. ఆ కంపెనీ ప్రతినిధులతోపాటు మరికొందరిపై ఎన్‌డీపీఎస్ యాక్ట్ కింద కేసు నమోదుచేశారు. ఇందులో అంతర్జాతీయ స్థాయి డ్రగ్స్ ముఠా ప్రమేయం ఉన్నట్టు అనుమానిస్తున్నారు. దర్యాప్తులో మిగిలిన వివరాలను రాబట్టాల్సి ఉందని సీబీఐ అధికారులు తెలిపారు.

డ్రగ్స్ కేసు సీబీఐ దర్యాప్తు చేస్తోంది: సీపీ రవిశంకర్

విశాఖ పోర్టులో డ్రగ్స్ కంటెయినర్ పట్టివేతపై విశాఖ నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ ఏ రవిశంకర్ స్పందించారు. ఈ కేసును పూర్తిగా సీబీఐ దర్యాప్తు చేస్తోందని చెప్పారు. శుక్రవారం కమిషనరేట్ లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. సీబీఐ డాగ్ స్క్వాడ్ సహకారం కోరితే ఇచ్చినట్లు తెలిపారు. తమ వల్ల సోదాలు ఆలస్యమయ్యాయని చెప్పడం సరికాదన్నారు. నగరంలో డ్రగ్స్ పై ఉక్కుపాదం మోపుతున్నట్లు చెప్పారు. కంటెయినర్ టెర్మినల్ తమ కమిషనరేట్ పరిధిలోకి రాదన్నారు. కస్టమ్స్ ఎస్పీ పిలిస్తే వెళ్లినట్లు తెలిపారు. సీబీఐ విధి నిర్వహణకు తమవల్ల ఆటంకం కలగలేదన్నారు.

సీనియర్లకు మళ్లీ చుక్కెదురు

(మొదటిపేజీ తరువాయి)

దేవినేని ఉమా పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. అయితే ఉమా సేవలు పార్టీకి పూర్తిస్తాయిలో ఉపయోగించుకుంటామని చంద్రబాబు ఆయనను బుజ్జగించారు. అలాగే విశాఖపట్నంలో గాజువాక నుంచి వరుసగా మూడు సార్లు విజయం సాధించిన మరో సీనియర్ నేత బండారు సత్యనారాయణ మూర్తి, ఆతర్వాత వరుసగా ఓటమి పాలయ్యారు. దీంతో ఆయనను కూడా పార్టీ అధిష్టానం పక్కనబెట్టింది. అలాగే మూడో జాబితాలో సీటు ఖాయమనుకున్న టీడీపీ రాష్ట్ర మాజీ అధ్యక్షులైన కళా వెంకట్రావుకు కూడా నిరాశే ఎదురైంది. కళా వెంకట్రావు టీడీపీ ఆవిర్భావం నుంచి పార్టీలో కొనసాగుతున్న అత్యంత సీనియర్ నేతల్లో ఒకరు. విజయనగరం జిల్లా రాజాం నియోజకవర్గం నుంచి 1983, 85, 89, 2004 ఎన్నికల్లో శాసనసభకు ఎన్నికయ్యారు. ఆ తర్వాత ఆ నియోజకవర్గం ఎస్సీ రిజర్వుడ్ కావడంతో ఎచ్చెర్ల నుంచి 2014లో ఎమ్మెల్యేగా పోటీ చేసి ఐదోసారి విజయం సాధించారు. 2019లో ఓటమి పాలైన వెంకట్రావుకు ఈసారి టికెట్ దక్కలేదు. ఇక ఏ పార్టీలో చేరినా విజయాన్ని సొంతం చేసుకునే గంటా శ్రీనివాసరావు అభ్యర్థిత్వంపై ఇంకా సస్పెన్స్ కొనసాగుతోంది. ప్రస్తుతం తెలుగుదేశం పార్టీ ప్రకటించాల్సి 5 స్థానాల్లో ఆయనకు సీటు ఖాయమని భావిస్తున్నప్పటికీ, ఆయన భీమిలి టికెట్ కోరుతుండగా... చీపురుపల్లి నుంచి పోటీ చేయాలని అధిష్టానం పట్టుబడుతోంది. దీంతో ఈ రెండు సీట్లను పార్టీ అధిష్టానం పెండింగ్‌లో పెట్టింది.

సోమిరెడ్డిపై సానుభూతి ప్రయోగం

ఆయా నియోజకవర్గాల్లో పోటీ చేసే అభ్యర్థుల విజయావకాశాలపై ప్రజాభిప్రాయ సర్వే నివేదిక ఆధారంగా టికెట్లు కేటాయించిన చంద్రబాబు, సర్వేపల్లి నియోజకవర్గంలో మాత్రం సానుభూతి ఓట్లపై ఆధారపడ్డారు. ఈ నియోజకవర్గం నుంచి సీనియర్ టీడీపీ నేత సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి 2004, 2009, 2014,2019 ఎన్నికల్లో వరుసగా ఓటమి పాలయ్యారు. అయినప్పటికీ విచిత్రంగా ఆయన మరోసారి టికెట్ దక్కించుకోవడం విశేషం. ఆయన కేవలం 1994, 99 ఎన్నికల్లో మాత్రమే ఆ నియోజకవర్గం నుంచి శాసనసభ్యునిగా ఎన్నికయ్యారు. అయితే టీడీపీ నిర్వహించిన ప్రజాభిప్రాయ సేకరణలో అక్కడి సిట్టింగ్ శాసనసభ్యుడు కాకాని గోవర్ధనరెడ్డిపై తీవ్ర ప్రజావ్యతిరేక ఉందని, మరోవైపు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డికి గణనీయంగా సానుభూతి పవనాలు వీస్తున్నట్లు నివేదికలు అందడంతో ఆయనకే పార్టీ అధిష్టానం అభ్యర్థిత్వాన్ని ఖరారు చేసినట్లు పార్టీ నేతలు పేర్కొంటున్నారు.

కస్టడీకి కేజ్రీవాల్

(మొదటిపేజీ తరువాయి)

మధ్యాహ్నం మరలా కోర్టులో హాజరుపర్చాలని ఆదేశించింది.

తొలుత వాదనలు వినిపించిన ఈడీ... మద్యం కుంభకోణంలో కేజ్రీవాల్‌ను 'కింగ్‌పిన్' అని ఆరోపించింది. దిల్లీ మద్యం విధానం 2021-22 రూపొందించడానికి 'సౌత్ గ్రూపు' నుంచి రూ.100 కోట్లు డిమాండ్ చేసినట్లు ఈడీ తరపున అదనపు సొలిసిటర్ జనరల్ (ఏఎస్‌జీ) ఎస్వీ రాజు వాదించారు. గోవా అసెంబ్లీ ఎన్నికల్లో వినియోగమైన రూ.45 కోట్లు హవాలా మార్గంలో వచ్చినట్లు తెలిపారు. నిందితులు, సాక్షుల వాంగ్మూలాలను కాల్ డీటెయిల్ రికార్డ్స్ (సీడీఆర్) ద్వారా ధృవీకరించినట్లు వెల్లడించారు. మధ్యహ్నం 2 గంటల సమయంలో భారీ భద్రత నడుమ కేజ్రీవాల్‌ను కోర్టులో ప్రవేశపెట్టారు. 10 రోజుల రిమాండ్‌ను ఈడీ తరపున రాజు కోరారు. ఆప్ ఒక కంపెనీ అని, దీంతో ముడిపడ్డ ప్రతి ఒక్కరు బాధ్యత వహించాల్సిందేనన్నారు. కేజ్రీవాల్ తరపున సీనియర్ న్యాయవాదులు విక్రమ్ చౌధురి, అభిషేక్ మను సింఘ్వీ వాదించారు. ఆయనకు వ్యతిరేకంగా సాక్ష్యాధారాలన్నీ ఉంటే లోక్‌సభ ఎన్నికలు వచ్చేంత వరకు అరెస్టు చేయకుండా ఎందుకు ఆగారని కోర్టులో ఈడీని కేజ్రీవాల్ తరపు న్యాయవాదులు నిలదీశారు. 'సాక్ష్యాధారాలు ఉన్నాయన్నారు. కోడ్ అమల్లో వచ్చేంత వరకు ఎందుకు అరెస్టు చేయలేదు? నిరీక్షణకు కారణమేమిటి? ఎన్నికల్లో పోటీ చేయడం ప్రతి రాజకీయ నాయకుడి హక్కు. ఈడీ తన ముసుగు తొలగించి వారిది ఎవరి పక్షమో తేల్చిచెప్పాలి' అని చౌధుని వాదించారు. ఈ కేసులో కేజ్రీవాల్‌ను అరెస్టు చేయకుండా రక్షణ కల్పించలేమని దిల్లీ హైకోర్టు చెప్పిన కొన్ని గంటలలోనే ఈడీ ఆయనను అదుపులోకి తీసుకుంది. తన అరెస్టును సవాల్ చేస్తూ కేజ్రీవాల్ సుప్రీం కోర్టును ఆశ్రయించారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 32 కింద రిట్ పిటిషన్ దాఖలు చేశారు. అనంతరం దానిని ఉపసంహరించుకున్నారు. ఈడీ తరపున అదనపు సొలిసిటర్ జనరల్ (ఏఎస్‌జీ) ఎస్వీ రాజు వాదనలు వినిపించారు. 'ముఖ్యమంత్రిగా కేజ్రీవాల్ ప్రధాన నిందితుడిగా ఉన్నారు. ఆయన తన అధికారాన్ని దుర్వినియోగించారు. విధాన రూపకల్పనలో ఆయన కీలక పాత్రధారి. నేరంలో సూత్రధారి, గోవా ఎన్నికల ప్రచారంలోనూ ఆయనది ప్రధాన పాత్ర. పార్టీకి ఆయన అధినేత. ఈడీ ఎన్నిసార్లు సమన్లు ఇచ్చినా ఉద్దేశపూర్వకంగా బేఖాతరు చేశారు. విచారణకు సహకరించలేదు. తనిఖీలప్పుడు వాస్తవాలు వెల్లడించలేదు. ఆయనను విచారించి, సమాచారాన్ని సేకరించేందుకు రిమాండ్ కోరుతున్నాం. గోవా ఎన్నికల నిధిని మార్చేందుకు మద్యం విధానాన్ని సవరించారని ఆధారాలు ఉన్నాయి' అని రాజు వాదించారు. ఈడీ రిమాండ్ కోరడంపై కేజ్రీవాల్ తరపు న్యాయవాది సింఘ్వీ అభ్యంతరం వ్యక్తం చేశారు. ఇదంతా ఒక్క పద్ధతి ప్రకారం జరిగింది. అందువల్ల సాక్షుల వాంగ్మూలాలను ఆధారంగా చేసుకొని ఆయనను అరెస్టు చేశారు. కానీ ఇప్పుడు కొత్త పద్ధతి కనిపిస్తోంది. మీ వద్ద ఉన్న సాక్షి తన వాంగ్మూలం ఒకటి లేక రెండులో కేజ్రీవాల్ పేరు ప్రస్తావించలేదు. మీరు అతనిని అరెస్టు చేసి బెయిల్‌నూ నిరాకరిస్తారు. అప్పుడు అతను అప్రూవర్‌గా మారుతాడు. ఆ తర్వాత అనుకోకుండా ఒక రోజు అద్భుత వాంగ్మూలం ఇస్తాడు' అని సింఘ్వీ అన్నారు. కేజ్రీవాల్ నేరం చేసినట్లు ప్రత్యక్ష ఆధారాలేమీ లేవని వాదించారు. అరెస్టు గురైన వారికి క్షమాభిక్ష పెడితే వారు ఎవరో ఒకరి పేరును కచ్చితంగా చెబుతారని సింఘ్వీ నొక్కి చెప్పారు. సిట్టింగ్ ముఖ్యమంత్రి అరెస్టు కావడం ఇదే మొదటిసారి అని అన్నారు. ఇప్పటికే ఈయన పార్టీకి చెందిన నలుగురు సీనియర్లు అరెస్టు అయ్యారు. అంటే ఒక్క ఓటు కూడా నమోదు కాకుండానే ఫలితాలు వెల్లడయ్యాయి. రాజ్యాంగానికి ప్రజాస్వామ్యం ప్రధానం. ఈ పద్ధతి సరైనది కాదు' అని సింఘ్వీ వాదించారు.

బీజేపీ పెద్ద తప్పు చేసింది: ఆప్

కేజ్రీవాల్ అరెస్టుపై ప్రతిపక్షాలు మండిపడ్డాయి. ప్రజాస్వామ్యం ఖూనీ అయ్యిందని దుయ్యబట్టాయి. ప్రతిపక్షాలను బలహీనపర్చేందుకు, వారిని భయపెట్టేందుకు మోదీ ప్రభుత్వం కుట్ర చేసిందని విమర్శించారు. నేరుగా ప్రత్యర్థులను ఎదుర్కొనే ధైర్యం లేక దర్యాప్తు సంస్థల ద్వారా విపక్షాలను అణచివేయాలని మోదీ యత్నిస్తున్నారని సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా వ్యాఖ్యానించారు. దేశంలో అప్రకటిత ఎమర్జెన్సీ ఉన్నదని, తమ నాయకుడిని అరెస్టు చేసి బీజేపీ పెద్ద తప్పు చేసిందని ఆప్ పేర్కొంది. కేజ్రీవాల్ అరెస్టుకు నిరసనగా ఈనెల 26న ప్రధాని నివాసాన్ని ముట్టడిస్తామని ప్రకటించింది. కేజ్రీవాల్ అరెస్టుకు నిరసనగా దేశవ్యాప్తంగా ఆందోళనలు మిన్నంటాయి. అన్ని రాష్ట్రాల్లో ప్రతిపక్ష పార్టీలతో కలిసి ఆప్ నాయకులు, కార్యకర్తలు భారీ ర్యాలీలు, ధర్నాలు, దిష్టిబొమ్మల దహనాలు చేపట్టారు. 'నిరంకుశత్వం కొనసాగబోదు... అరవింద్ నువ్వు పోరాడు... మేము నీ వెంట ఉన్నాం' అన్న నినాదాలను ఆప్ కార్యకర్తలు చేశారు. అయితే నిరసనకారులను ఎక్కడికక్కడ కట్టడి చేసేందుకు పోలీసులు యత్నించారు. లాఠీలు ఝుళిపించారు, జల ఫిరంగులు ప్రయోగించారు. అనేక మంది నాయకులు, కార్యకర్తలు అరెస్టు చేశారు. నాయకులు, కార్యకర్తలను పోలీసులు ఈడ్చుకెళ్లే దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొట్టాయి. పోలీసులు దౌర్జన్యాన్ని విపక్షాలు ఖండించాయి.

కవిత బెయిల్‌కు సుప్రీం తిరస్కృతి

బీఆర్ఎస్ నాయకురాలు కె.కవితకు సుప్రీం కోర్టులో ఎదురు దెబ్బ తగిలింది. మద్యం కేసులో ఆమెకు బెయిల్ ఇచ్చేందుకు సుప్రీం కోర్టు తిరస్కరించింది. కింది కోర్టును ఆశ్రయించాలని సూచించింది. ప్రోటోకాల్‌ను అతిక్రమించలేమని జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ ఎంఎం సందేశ్, జస్టిస్ బేలా ఎం.త్రివేదితో కూడిన త్రిసభ్య ధర్మాసనం స్పష్టంచేసింది. రాజ్యాంగ అంశాలపై ఈడీకి నోటీసులిచ్చింది. ఆరు వారాల్లోగా సమాధానం చెప్పాలని ఆదేశించింది. ఆ తర్వాత రెండు వారాల్లో రిజాయిండర్ దాఖలుకు అవకాశం కల్పించింది. ఈడీ తీరు, తాజా పరిణామాలు నిరాశకు గురిచేస్తున్నాయని కవిత తరపు న్యాయవాది కపిల్ సిబల్ కోర్టుకు తెలిపారు. ఈ కేసులో ఒకసారి సాక్షిగా, మరోసారి నిందితురాలిగా ఆమెను పిలిచారని తెలిపారు. కవితకు వ్యతిరేకంగా బలమైన సాక్ష్యమేమీ లేదని, అప్రూవర్ వాంగ్మూలం ఆధారంగా దర్యాప్తు సాగుతోందన్నారు. దీనిపై ధర్మాసనం స్పందిస్తూ కేసు మెరిట్స్‌లోకి వెళ్లడం లేదని తెలిపింది. బెయిల్ ఇవ్వలేమని, కింది కోర్టును ఆశ్రయించాలని సూచించింది. కేసు విచారణ వేగంగా జరిపించాలని కింది కోర్టును ఆదేశించింది. ఈ పిటిషన్‌లో రాజ్యాంగ ఉల్లంఘన అంశాలను లేవనెత్తినందున దీన్ని విజయ్ మదన్ లాల్ కేసుకు జతచేస్తున్నట్లు వెల్లడించింది.

గృహనిర్బంధంలో కేజ్రీవాల్ కుటుంబం

కేజ్రీవాల్ కుటుంబం గృహ నిర్బంధంలో ఉన్నదని ఆప్ ఎమ్మెల్యేలు, కౌన్సిలర్లు తెలిపారు. కేజ్రీవాల్ నివాసానికి వెళ్లగా వారిని లోపలికి అనుమతించలేదని, ఎవరికి కలవనివ్వలేదని చెప్పారు. లోపల వారు ఎలాంటి పరిస్థితుల్లో ఉన్నారో ఎవరికి తెలియడం లేదు అని ఎమ్మెల్యే దుర్గేశ్ పాఠక్ తెలిపారు. కేజ్రీవాల్ ఇంటికి వెళ్లిన వారిలో ఎమ్మెల్యేలు జర్నైల్ సింగ్, రాజ్ కుమార్ ఆనంద్, దిల్లీ మేయర్ షెల్లీ ఓబరాయ్ తదితరులు ఉన్నారు. 'నిరంకుశత్వం కొనసాగదు... గృహనిర్బంధాన్ని రద్దు చేయాలి' అని నాయకులు నినాదాలిచ్చారు. దిల్లీలో జరిగింది ఎవరూ ఊహించలేదని, తమ నాయకులు అందరినీ గృహ నిర్బంధంలో పెట్టారని ఆప్ చీఫ్ విప్ దిలీప్ పాండే, ఎమ్మెల్యే పాఠక్ తెలిపారు. కేజ్రీవాల్ సాధారణ నాయకుడు కాదని, అరెస్టు తర్వాత చేతులు ముడుచుకొని కూర్చోరని, రెట్టింపు బలంతో వస్తారని నొక్కిచెప్పారు.

ఉత్తరాంధ్ర అభివృద్ధికి పోరాటాలే శరణ్యం

వనరులు పుష్కలంగా ఉన్నా వెనుకబాటుకు పాలకులే కారణం: అప్పలనాయుడు

విశాలాంధ్ర-శ్రీకాకుళం: ఉత్తరాంధ్రలో సహజ వనరులు పుష్కలంగా ఉన్నప్పటికీ ఆ ప్రాంతం అభివృద్ధి చెందలేదంటే పాలకుల నిర్లక్ష్యమే కారణమని ప్రముఖ రచయిత, వైఎస్సార్ లైఫ్ టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు గ్రహీత అట్టాడ అప్పలనాయుడు అన్నారు. 'వాయిస్ ఆఫ్ యంగ్ ఇండియా' అనే నినాదంతో 'ఉత్తరాంధ్ర అభివృద్ధి-యువత పాత్ర' అనే అంశంపై ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో జిల్లా ప్రధాన కార్యదర్శి కె. శ్రీనివాసరావు అధ్యక్షతన శుక్రవారం స్థానిక ఇంద్ర విజ్ఞాన్ భవన్‌లో సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన అప్పలనాయుడు మాట్లాడుతూ ఉత్తరాంధ్ర ప్రాంతంలో సుదీర్ఘ సముద్రతీరంతో పాటు అటవీ ప్రాంతం, 19 ఉపనదులు ఉన్నప్పటికీ అభివృద్ధి చెందకపోవడానికి పాలకుల నిర్లక్ష్య ధోరణే కారణమన్నారు. అనేక ఔషధ మొక్కలు ఉన్నాయని, స్థానికులకు అవగాహన కల్పించి కుటీర పరిశ్రమల ఏర్పాటు చేసి ఉపాధి కల్పించే అవకాశం ఉన్నప్పటికీ పాలకులు ఆ దిశగా ఆలోచన చేయకపోవడం దారుణం అన్నారు. నీటి వనరులు పుష్కలంగా ఉన్నప్పటికీ వ్యవసాయం లాభదాయకంగా లేదంటే దానికి కారణం సాగునీటి ప్రాజెక్టులు పూర్తిస్థాయిలో పూర్తి చేయకపోవడమే కారణమన్నారు. నేటికీ శివారు భూములకు నీరందివ్వలేని దుర్భర పరిస్థితుల్లో పాలకులు ఉన్నారని విమర్శించారు. యువత ఉపాధి కోసం ఇతర ప్రాంతాలకు వలస పోవాల్సిన పరిస్థితులకు కారణం పాలకులేనని ధ్వజమెత్తారు. స్వయం ఉపాధిపై శిక్షణ ఇచ్చి సబ్సిడీపై రుణాలు మంజూరు చేసి పరిశ్రమల ఏర్పాటుకు సహకరిస్తే ఈ ప్రాంతం పారిశ్రామికంగా ఎంతో అభివృద్ధి చెందేదని అన్నారు. ఉత్తరాంధ్ర అభివృద్ధి మండలిని ఏర్పాటు చేసి దానిలో ప్రజాసంఘాలు, విద్యార్థి, యువజన సంఘం నేతల సలహాలు, సూచనలతో ఈ ప్రాంత అభివృద్ధికి పాటు పడాలని కోరారు. బడ్జెట్‌లో ప్రత్యేక నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. పాలకులకు చిత్తశుద్ధి లోపిస్తే మరో ఉద్యమానికి యువత సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.

విద్యా, వైద్యం, ఉపాధి అమలులో చిత్తశుద్ధి లేదు: లెనిన్‌బాబు

ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లెనిన్ బాబు మాట్లాడుతూ విద్యా, వైద్యం, ఉపాధి ప్రజల ప్రాథమిక హక్కులని వీటిని అమలు చేయడంలో పాలకుల్లో చిత్తశుద్ధి లేదన్నారు. ఈ ప్రాంతం వెనుకబాటుకు మంత్రులు, ప్రజాప్రతినిధులు కారణం కాదా అని ప్రశ్నించారు. ఆంధ్ర యూనివర్సిటీ, అంబేద్కర్ యూనివర్సిటీలు నిధుల కొరతతో కొట్టుమిట్టాడుతున్నాయంటే దానికి విద్యారంగంపై పాలకులకు ఉన్న నిర్లక్ష్యమే కారణమన్నారు. కేంద్ర విద్యా సంస్థలను నెలకొల్పి బడ్జెట్లో నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఉత్తరాంధ్రకు మణిహారమైన విశాఖ స్టీల్ ప్లాంట్ ను కేంద్ర ప్రభుత్వం ప్రైవేటుపరం చేయాలని పూనుకోవడం దారుణమని అన్నారు. విశాఖ రైల్వే జోన్ ఏర్పాటులలోనూ నిర్లక్ష్యం చేస్తున్నారని మండిపడ్డారు. మోదీ, షా ద్వయం దేశాన్ని అమ్ముతుంటే అంబానీ, అదానీ కొంటున్నారని అన్నారు. బీజేపీ హయాంలో ప్రజాస్వామ్య దేశంలో పాలన కార్పొరేట్ల చేతుల్లోకి వెళ్లిపోయిందని విమర్శిం చారు. పోలవరం నీటిని ఉత్తరాంధ్రకు తీసుకు వస్తామని, నదులు అనుసంధానం చేస్తామని పాలకులు ఇచ్చిన హామీలు నీరు గార్చారన్నారు. విభజన హామీలు అమలు చేయకుండా రాష్ట్రానికి రావాల్సిన నిధులు కేటాయించకుండా, తాగునీటి ప్రాజెక్టులకు నిధులు ఇవ్వకుండా రాష్ట్రానికి అన్యాయం చేస్తున్న బీజేపీ ప్రభుత్వంపై తిరగబడాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. రాష్ట్రంలో అధికార, ప్రతిపక్ష పార్టీలు బీజేపీ చెంతకు చేరడం దారుణమన్నారు. కమ్యూనిస్టు పార్టీలు తప్ప రాష్ట్రంలోని అన్ని రాజకీయ పార్టీలు మోదీ పంచన చేరి ప్రజలకు తీవ్ర అన్యాయం చేస్తున్నారన్నారు. అధికారంలోకి వస్తే సంవత్సరానికి రెండు కోట్ల ప్రభుత్వ ఉద్యోగాలు కల్పిస్తానన్న మోదీ ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటుపరం చేస్తున్నారే తప్ప ప్రభుత్వ ఉద్యోగాల కల్పన చేయలేదని విమర్శించారు. నల్ల ధనం తెస్తానన్నమాట నీటి రాత గానే మిగిలిపోయిందని అన్నారు. కేంద్ర నిరంకుశ పాలనను గ్రామ గ్రామాన ప్రచారం చేసి బీజేపీ ఓటమికి కృషి చేయాలని పిలుపునిచ్చారు.

సీపీఐ జిల్లా కార్యదర్శి చాపర వెంకటరమణ మాట్లాడుతూ యువత రాజకీయాల్లోకి రావాలని, ప్రజలకు మంచి చేయాలని ఉన్న ప్రతి ఒక్కరూ కమ్యూనిస్టు పార్టీలో చేరి ప్రజాఉద్యమాల్లో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. మతోన్మాదంతో రెచ్చిపోతున్న బీజేపీ ప్రభుత్వానికి చరమగీతం పాడాలని, బీజేపీతో అనుబంధం ఉన్న ప్రతి రాజకీయ పార్టీ అభ్యర్థులను ఎన్నికల్లో ఓడించి ఇండియా కూటమి అభ్యర్థులను గెలిపించాలన్నారు. చట్టసభల్లో కమ్యూనిస్టుల ప్రాతినిధ్యం ఉన్నప్పుడే బడుగు, బలహీన వర్గాలకు మేలు జరుగుతుందన్నారు. సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి లండ వెంకటరావు, ఏఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి మొజ్జాడ యుగంధర్, విజయనగరం జిల్లా ప్రధాన కార్యదర్శి కోట అప్పన్న, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి నాగభూషణరావు, పార్వతీపురం జిల్లా అధ్యక్షుడు గోపి నాయుడు, శ్రీకాకుళం జిల్లా అధ్యక్షుడు వాసు, సీహెచ్ రవి పాల్గొన్నారు.

మామిడి రైతులను ఆదుకోండి: కోటేశ్వరరావు

విశాలాంధ్ర-మైలవరం: మిర్చి, పత్తి పంటలను సర్వనాశనం చేసిన కోడిపేలు (నల్లబంక) సునామిలా ఆవరించి మామిడి తోటలను సైతం తుడిచిపెడుతూ రైతులను కోలుకోలేని దెబ్బతీస్తోందని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సీహెచ్ కోటేశ్వరరావు ఆందోళన వెలిబుచ్చారు. సీపీఐ ఎన్టీఆర్ జిల్లా సహాయ కార్యదర్శి, కౌలురైతు సంఘం జిల్లా అధ్యక్షుడు బుద్ధి రమేశ్ ఆయా మండలాల వ్యవసాయ కార్మిక సంఘ మహిళా నేతలతో కలిసి శుక్రవారం మైలవరం, రెడ్డిగూడెం, జికొండూరు మండల పరిధిలో మామిడి తోటలను పరిశీలించారు. మామిడి రైతులు, కూలీల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కోటేశ్వరరావు మాట్లాడుతూ, శ్రమ జీవులను ప్రభుత్వాలే ఆదుకోవాలని డిమాండ్ చేశారు. మామిడి తోటలను పూత దశలోనే కోడిపేలు ధ్వంసం చేస్తుండడంతో రైతులు గగ్గోలుపెడుతున్నారన్నారు. వేలకు వేలు ఖర్చు చేసి క్రిమిసంహారక మందులు చల్లినా ప్రయోజనం లేదన్నారు. అడపా సుబ్బారావు , ఎస్. కోటేశ్వరరాదచీశీఅవగవు, డి.బుద్దాయి, గురవయ్య, రజని, భారతి, సునీత, దమయంతి పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే తనయుడు కాంగ్రెస్‌లో చేరిక

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: కాంగ్రెస్ పార్టీ పోలవరం నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే బాడిసే దుర్గారావు తనయుడు బాడిసే బొజ్జి శుక్రవారం ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు షర్మిలను కలిశారు. ఆమె సమక్షంలో పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. షర్మిల న్యాయకత్వాన్ని బలోపేతం చేయడంతో పాటు, నియోజకవర్గంలో పార్టీ అభివృద్ధి కోసం అహర్నిశలు శ్రమిస్తానని అన్నారు.

కాంగ్రెస్ మీడియా కన్వీనర్ల నియామకం: రాష్ట్రంలో 26 జిల్లాలకు కాంగ్రెస్ అనుబంధంగా మీడియా కన్వీనర్లను నియమించారు. రాష్ట్ర అధ్యక్షురాలు షర్మిల ఆమోదంతో 26 జిల్లాల కాంగ్రెస్ మీడియా కన్వీనర్ల జాబితాను శుక్రవారం మీడియా సెల్ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ ఎన్.తులసిరెడ్డి తెలిపారు.

ఎన్నికల నిర్వహణపై 3న సమీక్ష

33 శాఖల ఉద్యోగులకు పోస్టల్ బ్యాలెట్‌లు

రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేశ్ కుమార్ మీనా

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: వచ్చే నెల 3వ తేదీన సీజర్ అంశంపై సీఎస్, డీజీపీతో భారత ఎన్నికల సంఘం అధికారులు సమీక్ష నిర్వహించనున్న నేపథ్యంలో ఎన్నికల సీజర్ నిర్వహణా వ్యవస్థ వినియోగాన్ని విస్తృత స్థాయిలో మెరుగుపర్చాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేశ్ కుమార్ మీనా జిల్లా ఎన్నికల అధికారులను ఆదేశించారు. శుక్రవారం రాష్ట్ర సచివాలయం నుంచి అన్ని జిల్లాల ఎన్నికల అధికారులతో ఆయన మీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి రాష్ట్ర వ్యాప్తంగా ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలు తీరును సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ సీజర్ అంశంపై ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెన్సీలను అప్రమత్తం చేయాలని, జిల్లా పరిధుల్లోనే కాకుండా సరిహద్దు ప్రాంతాల్లో కూడా నిఘాను పటిష్టపర్చాలన్నారు. ప్రతి సరిహద్దు చెక్ పోస్టు వద్ద కనీసం ఒక కెమెరాతో స్టాటిక్ సర్వేలెన్స్ బృందాన్ని ఉంచాలన్నారు. భారత ఎన్నికల సంఘం జారీ చేసిన తాజా మార్గదర్శకాల ప్రకారం దాదాపు 33 నిత్యావసర సేవల శాఖల ఉద్యోగులకు పోస్టల్ బ్యాలెట్ సౌకర్యాన్ని కల్పిస్తున్నట్లు చెప్పారు. వీటిలో ముఖ్యంగా పోలీస్, విద్యుత్, రవాణా, పోస్టల్ తదితర శాఖలుంటాయని తెలిపారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే మీడియా ప్రతినిధులతో పాటు ఆయా శాఖల ఉద్యోగులకు కూడా వారి విజ్ఞప్తి మేరకు పోస్టల్ బ్యాలెట్ సౌకర్యాన్ని కల్పించాలని ఆదేశించారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉన్నందున రాజకీయ పార్టీలు నిర్వహించే ఎటువంటి కార్యక్రమాలకైనా ముందుగా అనుమతి తప్పనిసరి అన్నారు. అయితే నేరుగా, ఎన్‌రోల్ పోర్టల్ ద్వారా గానీ అందే దరఖాస్తులను వెంటనే పరిశీలించి సకాలంలో అనుమతులను మంజూరు చేయాలని ఆదేశించారు. శాంతి భద్రతల నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలని, ఎటువంటి దుర్ఘటనలకు తావులేకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఓటర్ల జాబితా నుంచి పేర్లను తొలగింపునకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న ఫార్మ్-7ను, వివరాలను సరిదిద్దేందుకు ఫార్మ్-8ను చట్టబద్ధంగా ఈ నెల 26 లోపు పరిష్కరించాలని ఆదేశించారు. నూతన ఓటర్ల నమోదులో ఎంతో అప్రమత్తంగా ఉండాలని, చివరి నిమిషంలో హడావుడిగా ఓటర్ల నమోదు కార్యక్రమాన్ని చేపట్టవద్దని, క్రమ పద్ధతిలో వ్యక్తిగతంగా దాఖలు చేసిన ఫార్మ్-6ను క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతే నూతన ఓటర్లుగా నమోదు చేయాలని సూచించారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులోకి వచ్చినప్పటి నుంచి ప్రతి రోజూ తొమ్మిది నివేదికలను కేంద్ర ఎన్నికల సంఘానికి పంపాల్సి ఉన్నందున అలక్ష్యం వహించకుండా సకాలంలో నివేదికలను అందజేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో అన్ని జిల్లాల ఎన్నికల అధికారులతో పాటు అదనపు సీఈవోలు పి.కోటేశ్వరరావు, ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్, జాయింట్ సీఈవో వెంకటేశ్వరరావు, డిప్యూటీ సీఈవోలు కె.విశ్వేశ్వరరావు, మల్లిబాబు, సెక్షన్ ఆఫీసర్ శ్రీనివాసరావు పాల్గొన్నారు

4 నుంచి ప్రభుత్వ శాఖా పరీక్షలు : ఏపీపీఎస్సీ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వ శాఖా పరీక్షలు (మే 2024 సెషన్) ఏప్రిల్ 4 నుంచి 24వ తేదీ వరకు ఏపీపీఎస్సీ నిర్వహించనుంది. ఈ మేరకు ఏపీపీఎస్సీ కార్యదర్శి జె.ప్రదీప్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ పరీక్షలకు హాజరయ్యే వారంతా ఈనెల 24వ తేదీలోగా ఆన్‌లైన్‌లో ఫీజు చెల్లించాలి. పూర్తి వివరాలను ఏపీపీఎస్సీ కమిషన్ వెబ్‌సైట్ cse.ap.gov.in లో అందుబాటులో ఉంచారు.

ధాన్యం సొమ్ము చెల్లింపు కోరుతూ...

26న సివిల్ సప్లయ్ ఎండీతో రాయబారం

విశాలాంధ్ర-విజయవాడ: ఆర్బీకేల ద్వారా రైతులు అమ్మిన ధాన్యం సొమ్ము చెల్లింపు కోరుతూ ఈనెల 26న పౌరసరఫరాల శాఖ ఎండీతో రైతులతో కలిసి రాయబారం నిర్వహిస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి.ఈశ్వరయ్య, కేవీవీ ప్రసాద్, కౌలు రైతుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.జమలయ్య శుక్రవారం ఓ సంయుక్త ప్రకటనలో తెలిపారు. ఈ ఏడాది జనవరి నుంచి రైతు భరోసా కేంద్రాల ద్వారా అమ్మిన ధాన్యం సొమ్ము రైతుల ఎకౌంట్‌లో ఇంతవరకు జమకాలేదని పేర్కొన్నారు. దీంతో వారు ఆర్థిక ఇబ్బందులతో సతమతమౌతున్నట్లు చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా సుమారు రూ.850 కోట్లు చెల్లింపులు జరగాల్సి ఉందని, పంటకోత, కుప్ప నూర్పిడి, ఖరీఫ్ సాగుకు పెట్టుబడిగా వడ్డీకి తెచ్చిన సొమ్ములు చెల్లించేందుకు రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. అప్పులపై వడ్డీలు తడిసి భారంగా మారినట్లు రైతులు తమ దృష్టికి తెచ్చారన్నారు. గత రెండు రోజులుగా కృష్ణా, ఎన్టీఆర్, ఏలూరు, పార్వతీపురం, శ్రీకాకుళం తదితర జిల్లాల్లో పర్యటించగా ధాన్యం సొమ్ము అందక రైతులు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న విషయం తమ దృష్టికి వచ్చిందని వారు వివరించారు.

900 ఏళ్ల నాటి శాసనాన్ని కాపాడుకోవాలి: శివనాగిరెడ్డి

విశాలాంధ్ర-హైదరాబాద్/జడ్చర్ల: మహబూబ్ నగర్ జిల్లా జడ్చర్ల మండల కేంద్రానికి కూతవేటు దూరంలోనున్న గంగాపురం శివారు లోని చౌడమ్మ ఆలయ చెరువుకట్టపై 900 ఏళ్ల నాటి కన్నడ శాసనం ఆలనా పాలన లేక నిరాదరణకు గురైందని పురావస్తు పరిశోధకుడు, ప్లీచ్ ఇండియా సీఈవో డాక్టర్ ఈమని శివనాగిరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. వారసత్వ సంపదను పరిరక్షించి భవిష్యత్ తరాలకు అందించాలన్న ఉద్దేశ్యంలో భాగంగా శుక్రవారం ఆయన గంగాపురం చౌడమ్మ ఆలయాన్ని సందర్శించారు. క్రీస్తుశకం 1134, జూన్ 8న కల్యాణ చాళుక్య చక్రవర్తి 'భూలోకమల్ల' మూడో సోమేశ్వరుడు, కల్యాణనగరం నుంచి పాలిస్తుండగా, అతడి కుమారుడైన మూడో తైలాపుని సుంకాధికారులు స్థానిక సోమనాథ దేవుని గంధ, ధూప, అఖండ దీపాల కోసం 'వడ్డరావుళ, హెజ్జుంక' అనే పన్నుల నుంచి వచ్చే ఆదాయాన్ని కానుక ఇచ్చిన వివరాలు ఆ శాసనంలో ఉన్నాయని శివనాగిరెడ్డి చెప్పారు. గతంలో పురావస్తు శాఖ ప్రచురించిన చారిత్రక ప్రాధాన్యత గల ఈ శాసనాన్ని భద్రపరిచి కాపాడుకోవాలని చౌడమ్మ ఆలయ ధర్మకర్తలు కటికల మల్లికార్జున్, గిరి ప్రసాద్, చెన్నయ్య శ్రీను, శంకర్ శ్రీనివాస్, సత్తయ్యలకు ఆయన విజ్ఞప్తి చేశారు. గంగాపురం కేశవప్రసాద్, గంగాపురం గ్రామస్థులు కొందరు ఇందుకు తమ వంతు సహకారం అందిస్తామన్నారని శివనాగిరెడ్డి చెప్పారు.

ఎన్డీయే కూటమిని ఓడించండి

ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు రావులపల్లి

విశాలాంధ్ర-మార్కాపురం: కార్మిక, కర్షక, ప్రజావ్యతిరేక విధానాలు అనుసరిస్తున్న ఎన్డీయే కూటమిని రాబోయే ఎన్నికల్లో ఓడించాలని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు రావులపల్లి రవీంద్ర నాథ్ పిలుపు నిచ్చారు. ఏఐటీయూసీ నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశం శుక్రవారం స్థానిక పూల సుబ్బయ్య శాంతి భవన్‌లో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి అందె నాసరయ్య అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథిగా విచ్చేసిన రావులపల్లి మాట్లాడుతూ దేశ ప్రజలకు విశిష్టమైన సేవలను అందిస్తున్న రైల్వేలు, పౌర విమానయాన, నౌకాశ్రయాలు, ఎల్ఐసీ, హిందుస్థాన్ పెట్రో కెమికల్స్, పోస్టల్, బీఎస్ఎన్ఎల్ తదితర రూ.లక్షల కోట్లు విలువ చేసే జాతి సంపదను కేంద్రంలోని మోదీ ప్రభుత్వం నష్టాల బాట చూపుతూ అంబానీ, అధాని తదితర పారిశ్రామిక దిగ్గజాలకు కారుచౌకగా దోచిపెడుతుందని ఆరోపించారు. ప్రభుత్వ రంగ సంస్థలను ఒక్కొక్కటిగా మూసివేస్తుండడంతో ఆయా పరిశ్రమల్లో పనిచేసే కోట్లాది మంది కార్మికులు ఉపాధి అవకాశాలు కోల్పోయి బజారున పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రజల పోరాట ఫలితంగా ఏర్పాటైన విశాఖ స్టీల్ ప్లాంటును కేంద్రం నిర్వీర్యం చేసేందుకు కుట్ర పన్నుతుందని విమర్శించారు. పార్టీలకు అతీతంగా ప్రభుత్వరంగ సంస్థలను కాపాడుకోవడానికి పెద్ద ఎత్తున పోరాడాలని పిలుపునిచ్చారు. వామపక్ష పార్టీలు భాగస్వామిగా ఉన్న ఇండియా కూటమి అభ్యర్థులను గెలిపించుకోవాలని అన్నారు.ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్తకోట వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, రాష్ట్రంలో సీఎంగా జగన్ అధికారంలోకి వచ్చిన తర్వాత పారిశ్రామిక రంగం పూర్తిగా సంక్షోభంలో కురుకుపోయిందని విమర్శించారు. ఐదేళ్లలో ఏ ఒక్క పరిశ్రమ రాకపోగా ఉన్న పరిశ్రమలు ఇతర రాష్ట్రాలకు తరలి వెళ్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. నాసరయ్య మాట్లాడుతూ రోజురోజుకు పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలతో కార్మికులు, సామాన్య ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నా జగన్ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని అన్నారు. ఇసుక, మద్యం మాఫియా నడుస్తుందని విమర్శించారు. పశ్చిమ ప్రాంత ప్రజల ఆశాజ్యోతి అయిన పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు నిర్మాణ పనులను పూర్తి చేయకుండానే జాతికి అంకితం చేయడం దారుణ మని అన్నారు. ముంపు గ్రామాల బాధితులకు నష్టపరిహారం అందించకుండా జాతికి ఎలా అంకితం చేస్తారని ప్రశ్నించారు. ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి , ఏరియా అధ్యక్షుడు ఏలూరి వెంకటరెడ్డి, సీపీఐ పట్టణ కార్యదర్శి చిత్తారి పెద్దన్న, డి.సుబ్బారావు పాల్గొన్నారు.

నాణ్యమైన ఆహార పదార్థాలతో సంపూర్ణ ఆరోగ్యం

ఎఫ్ఎస్ఎస్ఏఐ సీఈవో కమలవర్ధనరావు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: నాణ్యమైన ఆహార పదార్థాల ద్వారానే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని, దేశ వ్యాప్తంగా ఫుడ్ మాన్యుఫ్యాక్చరింగ్, ఫుడ్ స్టోరేజ్, ట్రాన్స్‌పోర్టేషన్, ఫుడ్ సెల్లింగ్ విధానాల ద్వారా 1.50 కోట్ల మంది ఫుడ్ బిజినెస్ ఆపరేటర్స్ ఫుడ్ సెక్టార్‌లో భాగస్వాములై ఉన్నారని ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎఫ్ఎస్ఎస్ఏఐ) సీఈవో జి.కమల వర్ధనరావు అన్నారు. ఫుడ్ సేఫ్టీ ఎన్‌ఫోర్స్ మెంట్ సిబ్బంది, ఫుడ్ బిజినెస్ ఆపరేటర్లతో శుక్రవారం విజయవాడలోని ఓ హోటల్‌లో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన కమల వర్ధనరావు ... క్షేత్రస్థాయిలో ఫుడ్ సేఫ్టీ అధికారులు, ఫుడ్ సేఫ్టీ ఆపరేటర్లు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకోవడంతో పాటు సలహాలు, సూచనలు స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ, స్థిరమైన ప్రమాణాలను అభివృద్ధి చేయడంతో పాటు, భవిష్యత్ తరాలకు మెరుగైన ఆహార పదార్థాలను అందించడంలో ఎఫ్ఎస్ఎస్ఏఐ కీలకపాత్ర పోషిస్తోందన్నారు. రోజువారీ తీసుకునే ఆహారంలో విటమిన్ సప్లిమెంట్స్ ఉండేలా ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఆహార చట్టాలను ఏకీకృతం చేయడంతో పాటు ఆహార పదార్థాలకు సైన్స్ ఆధారిత ప్రమాణాలను నిర్దేశించడానికి, లభ్యతను నిర్ధారించడం ఎఫ్ఎస్ఎస్ఏఐ ప్రధాన లక్ష్యమన్నారు.

సంపూర్ణ ఆరోగ్యం కోసం ఎలాంటి ఆహార పదార్థాలు తీసుకోవాలో, విక్రయించాలో సూచిస్తూ ఎప్పటికప్పుడు మార్గదర్శకాలు తెలియ జేస్తున్నామని చెప్పారు. సరైన జాగ్రత్తలు తీసుకోకుండా ఆహార పదార్థాలను ప్యాక్ చేయడం వల్ల అనారోగ్య సమస్యలు తలెత్తుతాయని అన్నారు. ఈ మేరకు హోటల్ వ్యాపారులు, వినియోగదారులకు అవగాహన కల్పించాలన్నారు. రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ జె.నివాస్ మాట్లాడుతూ మంచి ఆరోగ్యానికి మంచి అలవాట్లతో పాటు మంచి ఆహార పదార్థాలు చాలా ముఖ్యమని అన్నారు. ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్రివెంటివ్ మెడిసిన్స్ ఇన్‌ఛార్జ్ డైరెక్టర్ ఎస్.పూర్ణ చంద్రరావు, ఫుడ్ సేఫ్టీ ఎన్‌ఫోర్స్ మెంట్ సిబ్బంది, ఫుడ్ బిజినెస్ ఆపరేటర్లు, రైస్ మిల్లర్ అసోసియేషన్, ఏపీ హోటల్స్, మర్చంట్ ఫెడరేషన్, కన్స్యూమర్స్, ఛాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు పాల్గొన్నారు.

విశాఖలో డ్రగ్స్ కలకలం

సూత్రధారి చంద్రబాబే

పురందేశ్వరి, టీడీపీ నేతల కుటుంబ సభ్యుల పాత్రపై విచారించాలి

ఎన్నికల ప్రధాన అధికారికి వైసీపీ ఎమ్మెల్యేలు పేర్ని, మల్లాది ఫిర్యాదు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: విశాఖలో పట్టుపడిన డ్రగ్స్ రాకెట్ వ్యవహారం దేశ వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. దీని వెనుక చంద్రబాబు, లోకేశ్, పురందేశ్వరి, టీడీపీ నేతల కుటుంబ సభ్యుల పాత్ర ఉందని వైసీపీ నేతలు ఆరోపిస్తున్నారు. భారీ డ్రగ్స్ రాకెట్‌లో వీరి పాత్రపై సమగ్ర విచారణ చేపట్టాలని ఏపీ ఎన్నికల ప్రధాన అధికారి (సీఈవో) ముఖేశ్‌కుమార్ మీనాకు వైసీపీ నేతలు ఫిర్యాదు చేశారు. సచివాలయంలోని ఎన్నికల కమిషన్ కార్యాలయంలో శుక్రవారం సీఈవోతో ఎమ్మెల్యేలు పేర్ని నాని, మల్లాది విష్ణు, పార్టీ నేతలు లేళ్ల అప్పిరెడ్డి, మనోహర్‌రెడ్డి, నారాయణమూర్తి భేటీ అయ్యారు. ఎన్నికల్లో అసాంఘిక శక్తులను ప్రోత్సహించడానికి డ్రగ్స్‌ను తెప్పించేందుకు ప్రయత్నించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. చంద్రబాబు అవాస్తవాలతో వైసీపీపై చేసిన ట్వీట్‌పైన చర్యలు తీసుకోవాలని కోరారు. విశాఖ సంఘటనతో దేశం ఉలికిపాటుకు గురైందని, 25 వేల కిలోల మత్తు పదార్థాలను సీబీఐ పట్టుకుందన్నారు. ఆ డ్రగ్స్ లావాదేవీలు జరిపిన సంస్థలు ఎవరివనేది తెలియకుండానే చంద్రబాబు వైసీపీపై విషం చిమ్మాడని, సీబీఐ నోరు విప్పకుండానే చంద్రబాబు బయటకొచ్చాడని వివరించారు. ఆయన వదిన చుట్టాలే డ్రగ్స్ వ్యవహారంలో ఉన్నారని ఆరోపించారు. ఓట్ల కోసం టీడీపీ డ్రగ్స్ పంపిణీ చేయకుండా, అసాంఘిక శక్తులను అడ్డుకోవాలని కోరారు. చంద్రబాబు సతీమణి భువనేశ్వరి ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించారని, ఓటర్లను ప్రలోభాలు పెట్టేందుకుగాను చెక్‌లు పంపిణీ చేశారని, దానిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

డ్రగ్స్ కంటైనర్ చంద్రబాబు బంధువులదే
వైసీపీ ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి

డ్రగ్స్ కంటైనర్ చంద్రబాబు బంధువులదేనని వైసీపీ ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి ఆరోపించారు. సాక్షాత్తూ పురందేశ్వరి కొడుకు ఆ కంపెనీలో భాగస్వామిగా ఉన్నాడని మండిపడ్డారు. తాడేపల్లి క్యాంపు కార్యాలయం వద్ద శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో సజ్జల మాట్లాడుతూ, డ్రగ్స్ కంటైనర్‌పై వాస్తవాలు తెలుసుకోకుండా చంద్రబాబు అండ్ కో ప్రభుత్వంపై ఆరోపణలు చేయడాన్ని ఖండించారు. డ్రగ్స్‌ను సినీ ఫక్కీలో సీబీఐ పట్టుకుందని, ఓ వైపు విచారణ జరుగుతోందన్నారు. నేరుగా పార్టీ అధ్యక్షుడు చంద్రబాబు, జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేశ్ కూడా ట్వీట్‌లు పెట్టడం ఆశ్చర్యంగా ఉందని అన్నారు. ఈ డ్రగ్స్‌ను రప్పించిన కంపెనీలో సాక్షాత్తు పురందేశ్వరి కొడుకు, ఆమె వియ్యంకుడు ఆ కంపెనీలో భాగస్వామిగా ఉన్నారని వివరించారు. వాళ్లు ప్రమోట్ చేసిన కంపెనీ నుంచి తర్వాత వేరయ్యారని తెలిపారు. మేం ఆరోపణ చేస్తే వాళ్లు సంజాయిషీ ఇచ్చుకోకుండా, ఉల్టాగా ప్రభుత్వంపై ఆరోపణలు చేయడం తగదన్నారు.

భారీ డ్రగ్స్ రాకెట్‌పై ప్రభుత్వం స్పందించాలి
సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: విశాఖ పోర్టులో బట్టబయలైన 25 వేల కిలోల భారీ డ్రగ్స్ రాకెట్‌పై రాష్ట్ర ప్రభుత్వం స్పందించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు శుక్రవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. యువత భవిష్యత్ కోసం రాష్ట్ర ప్రభుత్వం విచారణ ప్రక్రియను వేగవంతం చేసి వాస్తవాలు బయట పెట్టాలని, దోషులను కఠినంగా శిక్షించాలని కోరారు. డ్రగ్స్ రాకెట్‌లో భాగస్వాములైన పార్టీల ప్రతినిధుల పేర్లను బయట పెట్టాలన్నారు. వైజాగ్ పోర్టులో దిగుమతి చేసుకున్న సంధ్యా ఆక్వా ఎక్స్‌పోర్ట్స్ ప్రైవేట్ కంపెనీపై కేసులు బుక్ చేసి అరెస్టు చేయాలన్నారు.

బీజేపీ తెలంగాణ నేత కృష్ణప్రసాద్‌కు బాపట్ల ఎంపీ సీటు

టీడీపీ మూడో జాబితాలో ఉండవల్లి శ్రీదేవికి మొండిచేయి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: బీజేపీకి చెందిన తెలంగాణ నేతకు ఏపీలో ఎంపీ సీటు దక్కింది. టీడీపీ శుక్ర వారం విడుదల చేసిన జాబితాలో ఈ ట్విస్ట్ కనిపించింది. బీజేపీ తెలంగాణ అధికార ప్రతినిధిగా ఉన్న తెన్నేటి కృష్ణప్రసాద్‌కు బాపట్ల (ఎస్సీ) ఎంపీ సీటును కేటాయించింది. ఆయన 1986 బ్యాచ్‌కు చెందిన రిటైర్డు ఐపీఎస్ అధికారి. ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్‌లో గుంటూరు, విజయవాడ, విశాఖపట్నంలలో పనిచేశారు. ఆయన కనీసం ఏపీ టీడీపీ కార్యకలాపాల్లో ఎక్కడా కనిపించలేదు. బాపట్ల ఎంపీ సీటుపై అనేక మంది టీడీపీ నేతలు ఆశలు పెట్టుకున్నారు. వైసీపీ నుంచి టీడీపీలోకి వెళ్లిన ఎమ్మెల్యే ఉండవల్లి శ్రీదేవికి బాపట్ల సీటు ఇస్తారన్న ప్రచారముంది. దీంతో బాపట్ల ఎంపీ సీటుపై ఆమె ఆశలు పెట్టుకున్నారు. టీడీపీ 13 ఎంపీలు, 11 ఎమ్మెల్యే అభ్యర్థులతో మూడో జాబితా విడుదల చేసింది. దీనిలో ఉండవల్లి శ్రీదేవికి ఎంపీ లేదా ఎమ్మెల్యేగా ఎక్కడా స్థానం లభించలేదు. టీడీపీ వ్యూహాత్మకంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. ప్రస్తుతం వైసీపీకి చెందిన నందిగామ సురేశ్ బాపట్ల ఎంపీగా కొనసాగుతున్నారు. వైసీపీ అధిష్ఠానం తిరిగి ఆయనకు టికెట్ ఖరారు చేసింది. ఏపీలో ఉన్న టీడీపీ నేతలను వదిలి, తెలంగాణకు చెందిన బీజేపీ నేతను బాపట్ల ఎంపీగా బరిలోకి దించడంపై టీడీపీలోని ఆశావహులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

మీలో ఒకడిగా ఉంటా: విజయసాయిరెడ్డి

విశాలాంధ్ర-జలదంకి: నెల్లూరు జిల్లా ఉదయగిరి నియోజకవర్గ వైసీపీ అభ్యర్థిగా మేకపాటి రాజగోపాల్‌రెడ్డి, నెల్లూరు పార్లమెంటు అభ్యర్థిగా తాను పోటీ చేస్తున్నామని, మే 13న జరిగే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని వేణుంబాక విజయ్‌సాయిరెడ్డి విజ్ఞప్తి చేశారు. జలదంకి మండలం జమ్మలపాలెం పరిధిలోని ఎస్వీఆర్ కల్యాణ మండపంలో శుక్రవారం ఉదయగిరి నియోజకవర్గ వైసీపీ ఆత్మీయ సమావేశం జరిగింది. మీలో ఒకడిగా ఉంటాననీ, నేతలు, కార్యకర్తలు కలసికట్టుగా అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని కోరారు. తొలుత జమ్మలపాలెం నుంచి బ్రాహ్మణ కాక వరకు బైక్ ర్యాలీ జరిగింది. రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్ రావు, పార్టీ జిల్లా అధ్యక్షుడు పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, పాలవల్లి మాలకొండ రెడ్డి, దశరథరామిరెడ్డి, ఇస్కా మదన్మోహన్ రెడ్డి, తిప్పారెడ్డి ఇందిరమ్మ, రావి ప్రసాద్ నాయుడు, బుర్రి శ్రీవేణి, తమ్మినేని సతీష్, బోడిమల్ల కృష్ణారెడ్డి, గండు వెంకారెడ్డి, ప్రసాద్ రెడ్డి, కేతిరెడ్డి రవీంద్రారెడ్డి, గండు కృష్ణారెడ్డి, గోపాల్ రెడ్డి, సురేశేషారెడ్డి, దేవరపల్లి మధుసూదన్ రెడ్డి, వాక మహదేవరెడ్డి, దేవరపల్లి రఘురామిరెడ్డి, చేవూరు శ్రీనివాసులు రెడ్డి, వల్లం రెడ్డి నరసారెడ్డి, ఆలూరి లక్ష్మీనరసారెడ్డి, గుమ్మిడి రమేష్, వట్టికాల బాలయ్య, గుమ్మలంపాటి కళ్యాణ్, కాకాని మహదేవయ్య పాల్గొన్నారు.

సంపాదకీయం

హద్దు మీరిన మోదీ కక్ష సాధింపు

తొమ్మిది సార్లు ఎన్‌ఫోర్స్ మెంట్ డైరెక్టొరేట్ (ఇ.డి.) సమన్లను నిర్లక్ష్యం చేసిన తరవాత గురువారం రాత్రి ఇ.డి. అధికారులు ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌ను అరెస్టు చేశారు. కేజ్రీవాల్‌ను ఎందుకు అరెస్టు చేస్తున్నది ఇ.డి.తెలియజేయలేదు కానీ మద్యం కుంభకోణానికి ఆయనే సూత్రధారి అని మాత్రం వ్యాఖ్యానించింది. ముఖ్యమంత్రి పదవిలో ఉండగా అరెస్టయిన వారిలో కేజ్రీవాల్ మొదటి వారు. ఇంతకు ముందు తమిళనాడు ముఖ్యమంత్రిగా ఉన్న జయలలితను, బీహార్ ముఖ్యమంత్రిగా ఉన్న లాలూ యాదవ్ ను, ఇటీవల జార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సొరేన్‌ను కూడా అరెస్టు చేశారు. కానీ వారు అరెస్టు కాకముందే రాజీనామా చేశారు. కేజ్రీవాల్ మాత్రం చివరి దాకా రాజీనామా చేయలేదు. పదవిలో ఉండగానే అరెస్టయ్యారు. పైగా ఆయన మద్దతుదార్లు ఆయన నిర్బంధంలో ఉంటూనే ముఖ్యమంత్రి బాధ్యతలు నిర్వర్తిస్తారంటున్నారు. జైలులో ఉంటూ ముఖ్యమంత్రి బాధ్యతలు నిర్వర్తించకూడదు అన్న నిబంధన ఏ చట్టంలోనూ లేదని రాజ్యాంగ నిపుణులు ఎస్.కె.శర్మ లాంటివారు అంటున్నారు కానీ అలా నిర్వహించిన పూర్వోదంతాలూ లేవు. పైగా ముఖ్యమంత్రి నిర్బంధంలో ఉన్నారు కనక రాజ్యాంగం ప్రకారం ప్రభుత్వం కొనసాగడం లేదని చెప్పడానికి కేంద్ర ప్రభుత్వానికి జో హుకుందార్లుగా పని చేసే లెఫ్టినెంట్ గవర్నర్ సిద్ధంగానే ఉంటారు. అరెస్టు అవుతానన్న విషయం కేజ్రీవాల్‌కు గురువారం ఉదయమే స్పష్టంగా తెలిసిపోయింది కనక ప్రభుత్వం బర్తరఫ్ అయ్యే పరిస్థితిని నివారించడానికి ప్రభుత్వ బాధ్యతలు మరొకరికి అప్పగించడమే విజ్ఞత అయి ఉండేదేమో. హేమంత్ సొరేన్ అందుకే రాజీనామా చేశారు. తమ మంత్రివర్గాలు బర్తరఫ్ కాకుండా చూసుకోవడం కోసమే లాలూ, జయలలిత, హేమంత్ సొరేన్ అరెస్టు చేయకముందే రాజీనామా చేశారు. కేజ్రీవాల్ మాత్రం రాజీనామా చేయలేదు. అరెస్టును రద్దు చేయించాలని ఆయన సుప్రీంకోర్టుకు విన్నవించినా రాత్రి పొద్దు పోయాక విచారించడానికి సుప్రీంకోర్టు నిరాకరించింది. అదీ కాక ఢిల్లీ మద్యం కేసులోనే అరెస్టయిన తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కూతురు కవితకు కూడా అత్యున్నత న్యాయస్థానం నుంచి ఊరట కలగలేదు కనక కేజ్రీవాల్ అత్యున్నత న్యాయస్థానంలో తన అర్జీ ఉపసంహరించుకున్నారు. ఢిల్లీ మద్యం కుంభకోణం బూచిని చూపి మోదీ కనుసన్నల్లో ఆడించే ఇ.డి. అనేకమంది ప్రతిపక్ష నాయకుల మీద కత్తిగట్టినట్టు ప్రవర్తిస్తోంది. ఢిల్లీ ఉపముఖ్యమంత్రిగా ఉన్న మనీశ్ సిసోడియా 13 నెలలుగా జైలులోనే ఉన్నారు. రాజ్యసభ సభ్యుడు సంజయ్ సింగ్ ఆరు నెలలుగా నిర్బంధంలోనే ఉన్నారు. కేజ్రీవాల్ సన్నిహితుడు విజయ్ నాయర్ కూడా కటకటాలు లెక్కిస్తున్నారు. కేజ్రీవాల్ అరెస్టును అడ్డుకోవడానికి ఆమ్‌ఆద్మీ పార్టీ కార్యకర్తలు, ఎమ్మెల్యేలు గురువారం రాత్రి ఆ రోడ్డును దిగ్బంధించడానికి ప్రయత్నించారు. ఆప్ కార్యకర్తలను, ఢిల్లీ మంత్రి ఆతిశీ లాంటివారిని అదుపులోకి తీసుకున్నారు. కేజ్రీవాల్‌ను అరెస్టు చేయడానికి భద్రతాదళాల వారు యుద్ధానికి సిద్ధమైనట్టు రావడం మరీ విచిత్రం. కేజ్రీవాల్‌ను నిర్బంధించినా ఆయన ఆలోచనలను బంధించలేరని పంజాబ్ ముఖ్యమంత్రి బల్వంత్ మాన్ లాంటి వారు గంభీరమైన ప్రకటనలు గుప్పిస్తున్నా ఇ.డి.వ్యవహార సరళి చూస్తే ఇప్పట్లో కేజ్రీకి స్వేచ్ఛ లభించే అవకాశం చాలా తక్కువ.

కేజ్రీవాల్ ప్రభుత్వంలో మద్యం కుంభకోణం జరిగి ఉండొచ్చు. అయితే ఆ మద్యం విధానాన్ని కేజ్రీవాల్ ప్రభుత్వం ఎప్పుడో రద్దు చేసింది. అయినా ఆ ఉదంతం ఇంకా ఆమ్‌ఆద్మీ పార్టీని వెంటాడుతూనే ఉంది. అన్నింటికన్నా మించి కేంద్ర ప్రభుత్వం అధీనంలో పని చేసే సీబీఐ, ఆదాయపు పన్ను శాఖలో అంతర్భాగమైన ఇ.డి.ని మోదీ ప్రభుత్వం ప్రతిపక్షాలను దెబ్బ తీయడానికి వినియోగించుకుంటోందన్న అభిప్రాయం జనంలో బాగా నాటుకు పోయింది. అందుకే కేజ్రీవాల్ మద్యం విధానాన్ని తప్పు పడుతున్నవారు కనిపించడం లేదు. కవితను అరెస్టు చేసి ప్రశ్నిస్తున్న నేపథ్యంలోనే రెండు రోజుల తరవాత కేజ్రీని అరెస్టు చేయడంలో మద్య విధాన కుంభకోణాన్ని ప్రతిపక్షాలను బలహీన పరచడానికి మోదీ ప్రభుత్వం వినియోగించుకుంటోందన్న భావన మరింత ఎక్కువ కావచ్చు. ఇ.డి.ని మోదీ ప్రభుత్వం ప్రతిపక్షాల మీద దాడికి పదునైన ఆయుధంగా వినియోగిస్తోందన్నది మాత్రం నిర్వివాదాంశం. ఇందులో మోదీ ప్రభుత్వ కక్ష సాధింపు చాలా స్పష్టంగా కనిపిస్తోంది. పైగా ఇ.డి. కేసులు, ద్రవ్య అక్రమ వినియోగ చట్టం (పి.ఎం.ఎల్.ఎ.) లాంటివాటి కింద అరెస్టు అయిన వారు దీర్ఘకాలం నిర్బంధంలో ఉంటారు తప్ప విచారణ ప్రారంభం కాదు. అంటే విచారణ కాకుండానే శిక్ష అనుభవించేట్టు చేసే విధానాన్ని మోదీ ప్రభుత్వం అమలు చేస్తోంది. ఈ సారి 400 సీట్లు సాధిస్తామని మోదీ ఊరూరా తిరిగి టముకు వేయడం ఆయన బలాన్ని కాక బలహీనతను సూచిస్తోంది. ఓటమి భయం బీజేపీని వెంటాడుతోంది. కేంద్ర దర్యాప్తు సంస్థలను కేంద్రం దుర్వినియోగం చేస్తున్న కొద్దీ ప్రతిపక్షాల మధ్య ఐక్యత మరింత పటిష్ఠం అవుతోంది. ప్రతిపక్షాలను కుంగ దీయడానికి తన చేతిలో ఉన్న కేంద్ర దర్యాప్తు సంస్థలు గొప్ప ఆయుధం అని మోదీ భావించవచ్చు కానీ అవే విషనాగులై మోదీ కుర్చీ చుట్టు భయంకర రీతిలో తిరుగుతున్నాయి. పైగా సుప్రీం అభిశంసించిన తరవాత ఎన్నికల బాండ్లకు సంబంధించిన సకల వివరాలు ఎస్.బి.ఐ. ఎన్నికల కమిషన్ కు అందజేసిన రోజుననే కేజ్రీని అరెస్టు చేయడంతో మోదీ ప్రభుత్వ కక్ష సాధింపు చర్య మరింత బలంగా బయట పడింది. సీబీఐ, ఇ.డి.లాంటివి బీజేపీ నేతల మీద వచ్చిన ఆరోపణలను పట్టించుకుని వారి మీద దాడి చేసిన ఉదంతం ఒక్కటి కూడా లేదు. పైగా ఇతర పార్టీలో ఉంటూ ఆరోపణలతో ఊపిరాడని నాయకులు బీజేపీలో చేరిపోగానే అప్పటిదాకా ఉన్న కేసులన్నీ కనుమరుగైపోతున్నాయి. కేజ్రీవాల్ అదే పనిగా ఇ.డి.సమన్లను బేఖాతరు చేయడంతో ఇ.డి. కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందని నిరూపించడంలో కేజ్రీ విజయవంతం అయి ఉండొచ్చు. కానీ కేజ్రీ సమన్ల దాటవేతకన్నా మోదీ సర్కారు ప్రతిపక్షాలను వెంటాడడంలో ఎంత మాత్రం జాప్యం చేయలేదు. ఎన్నికల తేదీలు ప్రకటించిన తరవాత కేంద్రం ఇలా వేటాడుతోందంటే ఎన్నికల నైతిక ప్రవర్తనా నియమావళిని కూడా బేఖాతరు చేయాలని మోదీ ప్రభుత్వం నిర్ణయించుకుందనుకోవాలి. ఢిల్లీలో షీలా దీక్షిత్ నాయకత్వంలో కాంగ్రెస్ పాలన పదిహేనేళ్లు కొనసాగి అంతమైన దగ్గర్నుంచి ఢిల్లీలో కేజ్రీవాల్ తిరుగులేని నాయకుడిగా వెలిగిపోతున్నారు. అది బీజేపీకి ఏ మాత్రం మింగుడు పడడం లేదు. అంతేగాక అవసరమైనప్పుడు బీజేపీ తన గుత్త సొత్తు అనుకుంటున్న హిందుత్వ రాజకీయాలను ఏదో ఓ రూపంలో అనుసరించడానికి కేజ్రీవాల్ ప్రయత్నిస్తూనే ఉన్నారు. బీజేపీ అగ్ర నాయకత్వానికి ఈ రెండు అంశాలూ సుతరామూ మింగుడు పడడం లేదు. ఢిల్లీ శాసనసభ ఎన్నికలలో బీజేపీ సాధించిన ఫలితాలు అవమానకరంగా ఉన్నాయి. దేశ రాజధానిలో తమ ప్రభుత్వం లేదన్న బాధ బీజేపీకి నిరంతరం గుర్తొస్తూనే ఉంది.

భగత్ సింగ్ కేసువిచారణ -కొన్ని వాస్తవాలు!

డి. సోమసుందర్

విప్లవాదర్శాల కోసం పిన్నవయసులోనే ప్రాణాలను తృణప్రాయంగా అర్పించిన భగత్ సింగ్ , శివరామ్ రాజ్ గురు, సుఖదేవ్ థాపర్ , భారతీయులందరికీ అత్యంత ఆరాధ్యనీయులు. మన యువతకు స్ఫూర్తినిచ్చే జాతీయ హీరోలు. లాహోర్ జైలులో 1931 మార్చి 23న ఆ ముగ్గురు విప్లవకారులకు ఉరిశిక్ష అమలు అయింది. అది జరిగి తొమ్మిది దశాబ్దాలు గడిచింది. అయినా వారి అమరత్వాన్ని స్మరించుకోవడాన్ని ఒక పవిత్రకర్తవ్యంగా మనదేశ ప్రజలు భావిస్తున్నారు. కానీ వారిపై నమోదైన కేసుల గురించి, విచారణ గురించి, ఉరిశిక్షకు దారితీసిన పరిస్థితుల గురించి వివరాలు చాలామందికి తెలియదు. ఇటీవల కాలంలో కేసుకు సంబంధించిన అనేక పత్రాలు వెలుగులోకి వచ్చాయి. పాకిస్థాన్ ప్రభుత్వం కూడా భగత్ సింగ్ లేఖలను, రచనలను ఇటీవల లాహోర్ మ్యూజియంలో భద్రపరిచి సందర్శకులకు అందుబాటులోకి తెచ్చింది. అనేక మంది పరిశోధకులు ఆయా పత్రాలను పరిశీలించి కేసుల విచారణ క్రమాన్ని సాధారణ పాఠకులకు అందుబాటులోకి తెచ్చారు.

భగత్ సింగ్ పై రెండుకేసులు నమోదయ్యాయి. ఒకటి న్యూఢిల్లీలోని సెంట్రల్ అసెంబ్లీలో బాంబులు విసిరిన కేసు కాగా బ్రిటిష్ పోలీసు అధికారి జాన్ శాండర్స్‌ను కాల్చిచంపిన కేసు రెండోది. లాలా లజపత్ రాయ్ మృతికి ప్రతీకారంగా విప్లవకారులు లాహోర్‌లో జాన్ శాండర్స్‌ను కాల్చిచంపారు. మొదటి కేసులో విప్లవకారులకు జీవితఖైదు మాత్రమే పడగా రెండో కేసులో ఉరిశిక్ష పడింది. భగత్ సింగ్, ఆయన సహచర విప్లవకారుడు బటుకేశ్వర దత్ 1929 ఏప్రిల్ 8 వ తేదీన న్యూఢిల్లీలోని సెంట్రల్ అసెంబ్లీలో బాంబులు విసిరి, కరపత్రాలు వెదచల్లారు. విప్లవం వర్థిల్లాలి, శ్రామికవర్గం వర్థిల్లాలి అంటూ వారు నినాదాలు చేశారు. ప్రజాభద్రతా చట్టం, కార్మిక వివాదాల చట్టం పేరుతో సెంట్రల్ అసెంబ్లీలో ప్రవేశపెట్టిన ప్రజా వ్యతిరేక నిర్బంధ చట్టాలను నిరసిస్తూ , 31 మంది కార్మిక నాయకుల అరెస్టును ఖండిస్తూ వారా చర్యకు పూనుకున్నారు. ఉద్దేశ పూర్వకంగానే పేలుడు సామర్థ్యం తక్కువ ఉన్న బాంబులను వారు విసిరారు. సెంట్రల్ అసెంబ్లీలో సభ్యులు కూచున్న బెంచీల వైపు కాకుండా, కావాలని ఖాళీ బెంచీల వైపు బాంబులు వేశారు. బాంబుల మోతతో సెంట్రల్ అసెంబ్లీ సభ్యులు, భద్రతా సిబ్బంది చెల్లాచెదురై పరుగులు పెట్టారు. అక్కడి గందరగోళంలో తప్పించుకునే అవకాశం ఉన్నప్పటికీ భగత్ సింగ్, బటుకేశ్వర్ దత్ తప్పించుకోకుండా అక్కడే నిలబడి పోయారు. పోలీసుల దగ్గరికి వెళ్లి స్వయంగా లొంగిపోయారు. తన దగ్గరున్న ఆటోమేటిక్ పిస్టల్ ను భగత్ సింగ్ పోలీసులకు అప్పగించారు. పోలీసులు ఐపీసీ 307, 1888 పేలుడు పదార్థాల చట్టంలోని సెక్షన్ 3 ప్రకారం నేరం చేసినట్లు కేసు పెట్టారు. అవే ఆరోపణలతో ఛార్జ్ షీట్ వేశారు. సెంట్రల్ అసెంబ్లీలో విసిరిన కరపత్రాలలోని చేతిరాత, గతంలో జాన్ శాండర్స్‌ను హత్య చేస్తామని హెచ్చరిస్తూ వేసిన పోస్టర్లలోని చేతిరాత ఒకే విధంగా ఉందని పోలీసులు గమనించారు. భగత్‌సింగ్ అప్పగించిన ఆటోమేటిక్ పిస్టల్‌తోనే శాండర్స్ హత్య జరిగిందని కూడా పోలీసు అధికారులు నిర్ధారణకు వచ్చారు. దాంతో త్వరితగతిన రెండు కేసుల కేసు విచారణ పూర్తి చేయాలని ప్రభుత్వం భావించింది.

1929 మే 7 వ తేదీన సెంట్రల్ అసెంబ్లీ బాంబు కేసు విచారణ ప్రారంభం అయ్యింది. బ్రిటిష్ జడ్జి పీబీ పూల్ విచారణ నిర్వహించారు. రాయ్ బహదూర్ సూర్యనారాయణ ప్రాసిక్యూషన్ తరఫున, జాతీయోద్యమ నాయకుడు, అప్పటి కాంగ్రెస్ అగ్రనాయకుల్లో ఒకరైన అసఫ్ అలీ విప్లవకారుల తరఫున వాదనలు వినిపించారు. నెలరోజుల వ్యవధిలోనే మెజిస్ట్రేట్ కేసును సెషన్స్ కోర్టుకు నివేదించారు. సెషన్స్ కోర్టు జడ్జి లియోనార్డో మిడిల్ టన్ జూన్ మొదటివారంలో విచారణ ప్రారంభించారు. ప్రాసిక్యూషన్ దాదాపు ఆరువందల సాక్ష్యాలను సేకరించింది. కొందరు సహచరులు అప్రూవర్లుగా మారి ప్రాసిక్యూషన్‌కు సహకరించారు. "చక్రవర్తికి వ్యతిరేకంగా ఉద్దేశపూర్వకంగా సాయుధ తిరుగుబాటు చేసినట్లు, ప్రభుత్వ అధికారులను, పాలితులను హత్య చేసేందుకు, గాయపరచడానికి ప్రయత్నించినట్లు" నేరారోపణ చేసింది. అయితే భగత్ సింగ్ ఉద్దేశం వేరు. కోర్టు విచారణ సందర్భంగా తాము చేసే వాదనలు పత్రికల ద్వారా ప్రజల్లోకి వెలతాయని, విప్లవం పట్ల ప్రజల్లో సానుకూలత రావడానికి తమ వాదనలు వినియోగ పడతాయని భగత్ సింగ్ భావించారు. అందుకు తగినట్లుగా ఆయన కోర్టులో ఒక ప్రకటన చేశారు. "తాము పెద్దగా చదువుకోలేదని, మంచి భాషలో విన్నపాలు చేసే భాషా సామర్థ్యం తమకు లేదని, అందువల్ల భాషా దోషాలను బట్టి తమ వాదనలను తప్పుగా అర్థం చేసుకోవద్దని, తమ ఉద్దేశాలను అర్థం చేసుకుని వాటి ఆధారంగా న్యాయం చేయాలని" భగత్ సింగ్ తన ప్రకటనలో పేర్కొన్నారు. "చెవిటి ప్రభుత్వానికి గట్టిగా వినిపించాలనే" ఉద్దేశంతో తాము బాంబులు వేశామని ఎవరినీ చంపడం తమ ఉద్దేశం కాదని" భగత్ సింగ్ ఆ ప్రకటనలో స్పష్టం చేశారు. "తమకు అత్యంత ప్రీతిపాత్రులైన మోతీలాల్ నెహ్రూ సహా అనేకమంది జాతీయోద్యమ నేతలు సెంట్రల్ అసెంబ్లీ సమావేశంలో ఉండగా వారి ప్రాణాలకు హాని తలపెట్టే చర్యలకు ఎలా పూనుకుంటామని" భగత్ సింగ్ తన ప్రకటనలో ప్రశ్నించారు. "తమ చర్యలోని నేరాన్ని కాకుండా ఉద్దేశాన్ని పరిగణనలోనికి తీసుకోవాలని" భగత్ సింగ్ కోరారు.

"బ్రిటిష్ పాలన వద్దని పోరాడటం, స్వాతంత్ర్యం కావాలని కోరుకోవడం, పీడన నుంచి విముక్తి కావాలని కోరుకోవడం నేరం కాదని అందువల్ల తమకు శిక్ష విధించడం న్యాయం కాదని" భగత్ సింగ్ వాదించారు. దీంతో ప్రాసిక్యూషన్ ఏకీభవించలేదు. ప్రాసిక్యూషన్ సాక్షులు ఇద్దరు భగత్ సింగ్ సెంట్రల్ అసెంబ్లీలో పిస్టల్‌తో కాల్పులు జరిపినట్లు ఒక తప్పుడు సాక్ష్యం కూడా చెప్పారు. దాంతో సెషన్స్ జడ్జి ప్రాసిక్యూషన్ వాదనలను ఆమోదిస్తూ భగత్ సింగ్, బటుకేశ్వర్ దత్‌కు యావజ్జీవ కారాగార శిక్ష విధించారు. 1929 జూన్ లో మొదలైన విచారణ 1930 మార్చి నాటికి ముగిసింది. వారిద్దరినీ వేర్వేరు జైళ్లకు తరలించారు!

లాహోర్ కుట్ర కేసు: వారిద్దరూ జైల్లో ఉండగానే 1929 జులై 10 వ తేదీన లాహోర్ జైల్లోనే లాహోర్ కుట్ర కేసు విచారణ మొదలయింది. తాము నేరస్థులన్న నిర్ధారణకు కోర్టు ముందస్తుగానే వచ్చిందని, అందువల్ల విచారణ వల్ల ప్రయోజనం లేదని భగత్ సింగ్ భావించారు. విచారణను బహిష్కరించాలని అనుకున్నారు. దాంతో విచారణా ప్రక్రియకు సహకరించలేదు. జైల్లో నిరవధిక నిరాహారదీక్షకు పూనుకున్నారు. స్వాతంత్ర్య సమరయోధుల జైలు కమిటీ కోరినా భగత్ సింగ్ దీక్ష విరమించలేదు. చివరకు తండ్రి కోరిక మేరకు 1929 అక్టోబర్ 5 వ తేదీన 116 రోజుల దీక్షను భగత్ సింగ్ విరమించారు. 1928 నుంచి విప్లవకారులు ఒక జాతీయస్థాయి విప్లవసంస్థను ఏర్పాటు చేసుకుని ప్రభుత్వాన్ని కూల్చడానికి ప్రయత్నాలు చేసినట్లు ప్రాసిక్యూషన్ పేర్కొన్నది. అందులో భాగంగానే జాన్ శాండర్స్‌ను 1928 డిసెంబర్ 17 న లాహోర్‌లో కాల్చి చంపారని నేరారోపణ చేసింది. భగత్ సింగ్ ఆయన సహచర విప్లవకారుల తరపున అసఫ్ అలీ తదితరులు వాదించారు. "తనకు డిఫెన్స్ అవసరం లేదని కేసును తానే వాదించుకుంటానని, అందుకు న్యాయనిపుణుల సహాయం తీసుకుంటానని" భగత్ సింగ్ చెప్పారు. అసఫ్ అలీ సుఖదేవ్ తరపున డిఫెన్స్ వాదనలు కొనసాగించారు. అయితే కేసు విచారణ నత్త నడకన సాగింది. "కేసు విచారణను వేగవంతం చేయాలని మెజిస్ట్రేట్‌కు ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ "పోలీసు అధికారులు వేసిన పిటిషన్‌ను లాహోర్ హైకోర్టు కొట్టివేసింది. దాంతో 1930 మే 1 వ తేదీన వైస్రాయ్ లార్డ్ ఇర్విన్ ఒక ఆర్డినెన్సును జారీ చేస్తూ కేసువిచారణ కోసం ప్రత్యేక ట్రిబ్యునల్‌ను ఏర్పాటు చేశారు. 1930 మే 5 వ తేదీన ట్రిబ్యునల్‌లో విచారణ ప్రారంభం అయింది. 1930 అక్టోబర్ 7 వ తేదీన ట్రిబ్యునల్ తీర్పు చెప్పింది. కేసులో విప్లవకారుల సహచరులు ఐదుగురు అప్రూవర్లుగా మారారు. ప్రాసిక్యూషన్ ప్రధానంగా అప్రూవర్ల సాక్ష్యాలను రుజువులుగా చూపించి కేసును నిర్మించింది. జాన్ శాండర్స్ హత్య కేసులో భగత్ సింగ్ తదితరుల పాత్ర సందేహానికి అతీతంగా రుజువు అయ్యింది. "దేశంలో విప్లవకారులు 1928 నాటికే ఒక జాతీయస్థాయి విప్లవసంస్థను ఏర్పాటు చేసుకున్నారని, చక్రవర్తికి వ్యతిరేకంగా కుట్రచేసి రాజద్రోహానికి పాల్పడ్డారని, ప్రభుత్వాన్ని కూల్చడానికి ప్రయత్నాలు చేశారని అందులో భాగంగానే జాన్ శాండర్స్‌ను కాల్చి చంపారని" జడ్జి తన మూడు వందల పేజీల తీర్పులో పేర్కొన్నారు. ముగ్గురికి ఉరిశిక్ష విధించి, మిగిలిన వారికి ద్వీపాంతర యావజ్జీవ కఠిన కారాగార శిక్ష విధించారు. శిక్ష విషయంలో గాంధీజీ జోక్యం చేసుకోవాలని చిట్టగాంగ్ ఆయుధాగార దోపిడీ కేసులో విచారణలో ఉన్న ఖైదీలు ఒక విజ్ఞప్తి చేశారు. దానిపై కాంగ్రెస్ ఎనిమిది మంది సభ్యులు గల డిఫెన్స్ బృందాన్ని ఏర్పాటు చేసింది. వారు శిక్ష విధించడాన్ని వ్యతిరేకిస్తూ ప్రివీ కౌన్సిల్ కు అప్పీలు చేశారు. ప్రివీ కౌన్సిల్ ఆ వాదనలను తిరస్కరించింది. నిజానికి అప్పీలు అనవసరమని భగత్ సింగ్ భావించారు. అయితే విచారణ పేరుతో విప్లవభావాలు మరోసారి ప్రజల దృష్టికి వెళతాయని ఆయన భావించినట్లు ఇటీవల వెల్లడైన పత్రాలను బట్టి తేలింది.

గాంధీజీ జోక్యం: లాహోర్ కుట్ర కేసులో శిక్షలు రద్దు చేయాలని, విప్లవకారులను విడుదల చేయాలని కోరుతూ దేశవ్యాప్త ఉద్యమం వెల్లువెత్తింది. గాంధీ - ఇర్విన్ చర్చల్లో దీన్నొక షరతుగా చేర్చాలన్న డిమాండ్ కూడా వచ్చింది. అయితే లక్ష్యాలు, మార్గాలు విషయంలో గాంధీజీకి గల అభిప్రాయాలు, అహింసాయుత పోరాట పద్ధతులకు కాంగ్రెస్‌లో ఉన్న ఆమోదం రీత్యా లాహోర్ కుట్ర కేసును చర్చల అజెండాలో చేర్చడానికి కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ అంగీకరించలేదు.

అదీ కాక ప్రివీ కౌన్సిల్‌లో అప్పీలు తిరస్కారానికి గురయ్యాక రాజకీయ డిమాండ్‌కు ప్రాతిపదిక లేదని కాంగ్రెస్ భావించింది. అయితే ఇటీవల వెలుగులోకి వచ్చిన పత్రాలను బట్టి ఇర్విన్‌తో చర్చల సందర్భంలో గాంధీజీ అధికారిక అజెండాకు సంబంధం లేకుండా వ్యక్తిగత స్థాయిలో భగత్ సింగ్ తదితరుల కేసును ప్రస్తావించారని తేట తెల్లం అయ్యింది. భగత్‌సింగ్ తదితరుల వ్యక్తిగత హింసా మార్గానికి తాను పూర్తి వ్యతిరేకం అయినప్పటికీ గాంధీజీ ఈ సమస్యను లేవనెత్తడానికి మరో కారణం ఉంది. "ఏ ఒక్కరినీ ఉరికంబం ఎక్కించడానికి నా అంతరాత్మ అంగీకరించదు, ప్రాణం ఇచ్చింది భగవంతుడే కాబట్టి దాన్ని ఆయన మాత్రమే తీసుకోగలడు". భగత్ సింగ్ తదితరులకు ఉరిశిక్ష వేసిన సందర్భంలో ఆయన మరింత స్పష్టంగా రాశారు. "భగత్ సింగ్ తదితర విప్లవకారుల సంగతి అటుంచండి, కఠిన నేరస్తులైన హంతకులు, బందిపోట్లు, అయినా సరే వారిని ఉరి తీయడానికి నేను వ్యతిరేకం, చట్టబద్ధంగా అయినాసరే ఉరి తీసే అధికారం మానవ మాత్రులకు లేదు. ప్రాణం పోసేది, తీసేదీ భగవంతుడే" అన్నారు గాంధీజీ. ఇర్విన్‌తో చర్చల సందర్భంగా భగత్ సింగ్ తదితరుల ఉరిశిక్షను వాయిదా వేయించడానికి గాంధీజీ ప్రయత్నించారు. ముందు వాయిదా వేయిస్తే ఆ తర్వాత శిక్ష తగ్గింపునకు ప్రయత్నించాలని గాంధీజీ భావించారని అప్పటి ఉత్తర ప్రత్యుత్తరాలను బట్టి, సహచరుల రాతలను బట్టి , ప్రభుత్వంలో జరిగిన సంభాషణలను బట్టి అర్థం అవుతుంది . గాంధీ - ఇర్విన్ ఉత్తర ప్రత్యుత్తరాలలో, కూడా కనీసం ఐదు సార్లు భగత్ సింగ్ ఉరిశిక్ష అమలు నిలిపి వేయాలని గాంధీజీ కోరినట్లు నమోదై ఉంది. హింసావాదానికి స్వస్తి చెబుతానని భగత్ సింగ్ ఒక హామీలేఖ ఇస్తే దాని ఆధారంగా ఉరిశిక్షను రద్దు చేయించాలని గాంధీజీ భావించారని అసఫ్ అలీ రాశారు. అలాంటి లేఖ తేవడానికి అసఫ్ అలీ, అరుణా అసఫ్ అలీ లాహోర్ వరకూ వెళ్లారు. జైలు అధికారులు భగత్‌సింగ్‌ను కలుసుకోవడానికి వారికి అనుమతి ఇవ్వలేదు. ఈ విషయాలను అసఫ్ అలీ, అరుణా అసఫ్ అలీ కూడా అనంతర కాలంలో ధృవీకరించారు. 1931 మార్చిలో గాంధీజీ తన ప్రయత్నాలను ముమ్మరం చేశారు. కరాచీలో జరిగే కాంగ్రెస్ మహాసభ పూర్తయ్యేవరకూ ఉరిశిక్ష అమలును వాయిదా వేయాలని గాంధీజీ ఇర్విన్‌కు సూచించారు. రద్దు కోసం పట్టుపట్టకుండా వాయిదా కోరుతున్న గాంధీజీ వైఖరితో ఇర్విన్ కొంత మేరకు డోలాయమాన స్థితిలోపడ్డారు. "గాంధీజీ ఒత్తిడికి లొంగి ఉరిశిక్ష వాయిదా వేస్తె తాము మూకుమ్మడిగా రాజీనామా చేస్తామని" పంజాబ్ గవర్నర్ సహా అనేకమంది బ్రిటిష్ సైనిక, పోలీసు ఉన్నతాధికారులు ఇర్విన్‌కు హెచ్చరికలు జారీ చేశారని గార్డియన్ పత్రికా విలేఖరి రాశారు. దాంతో ఇర్విన్ గాంధీజీ విజ్ఞప్తిని తిరస్కరించారు. దానితో మార్చి 24న అమలు చేయాల్సిన ఉరిశిక్ష మార్చి 23 వ తేదీనే అమలు జరిగింది. ఆ తర్వాత జరిగిన కరాచీ కాంగ్రెస్ మహాసభలో గాంధీజీకి గాంధీ గో బ్యాక్ , గాంధీ డౌన్ డౌన్, గాంధీ రాజీ - భగత్ సింగ్ ఉరి లాంటి నినాదాలు ఎదురయ్యాయి.

సీనియర్ పాత్రికేయుడు

గెలుస్తున్నాం... బతకడం లేదు గురువుగారూ...

అతను భూమి గుండ్రంగా లేదని, అందుకే బతుకులు అస్తవ్యస్తంగా ఉన్నాయని కనుగొన్న శాస్త్రవేత్త. అతను జర్నలిస్టులు పెంపుడు జంతువులుగా మారతారని మూడున్నర దశాబ్దాల క్రితమే చెప్పిన జ్యోతిష్యుడు. ఇప్పుడంటే వృక్ష సంపదతో మీ అందం రెట్టింపు అవుతుందని ఊదరగొడుతున్నారు కాని మూడు దశాబ్దాల క్రితమే తన ఆయుర్వేద విద్యతో హెర్బల్ సబ్బులకు నాందీ వాచకం పలికిన డాక్టర్. అతను మెదడులో పెన్నులతో పుట్టిన వాడు.

జానా బెత్తెడు గాలివాన మొక్కలు మహా సౌష్టవంగా కనిపించాయన్న రహస్యాన్ని విప్పినవాడు... దాబాల కొత్తవలస దాబా గదిలో రా.వి.శాస్త్రిని చదివి ఎంత గొప్పగా రాశాడు అని మురిసిపోయిన వాడు. విశాఖ ఆంధ్రా యూనివర్సిటీ లైబ్రరీ ఒక్కో అరలోంచి చేతిలోకి తీసుకున్న పుస్తకాలు చదువుతూ తండ్రులారా ఎంత గొప్పగా రాశారయ్యా అని ఆ రచయితలకు కన్నీళ్లతో కాళ్లు కడిగిన వాడు. బైబిల్ పదో ప్రకటన ఒకటో వాక్యంలో అన్నట్లుగా అతను మేఘమును ధరించిన వాడు. అలా ధరించిన మేఘం నుంచి చినుకు చినుకుగా సాహిత్యం పేరుతో జీవితాలను చూపించిన వాడు.

చక్రవాకం

- ముక్కాముల చక్రధర్

గెలుపు సరేనర్రా... బతకడం ఎలా అని నిలదీసిన వాడు.

అతడే.. ఆ ఒక్కడే మహా రచయిత కే.ఎన్.వై. పతంజలి. వారి జ్ఞానం కంటే ఎదుటి వాడి అజ్ఞానమే అంబానీలకు, ఆదానీలకు పెట్టుబడి అని అదేదో సామెత చెప్పినంత సులువుగా చెప్పింది పతంజలి మాత్రమే. అనేకానేక సీతాకొకచిలుకలు తమ రెక్కలపై రాసుకున్న దెయ్యం ఆత్మకథలను ఒక్కొక్కటిగా రేకలు విచ్చుకున్నట్లుగా విప్పినవాడు. దెయ్యాలను కూడా అమ్మేసే పుస్తక వ్యాపారులకు కేరాఫ్ అడ్రస్ విజయవాడ ఏలూరు రోడ్డేనని స్టాంపు వేసి మరీ చెప్పిన వాడు ఈ ఒక్క పతంజలే. ఆకలేసినప్పుడు బోయినమే ముఖ్యం తప్ప విశ్వాసం కాదని అత్యంత ఎక్కువ విశ్వాసముందని భావించే జీవి వీర బొబ్బిలితో నర మానవుడికి చెప్పించిన వాడు. ఈ ఒక్క వాక్యంలోనే బాబోరే నీ విశ్వాసం నీకు కూడు పెట్టదురా నాయనా అని హితవాక్యం పలికిందీ ఈ పతంజలే. రెండు చెవుల మధ్య ఏమీలేని మానవుల మధ్య తిరుగుతూ "డెస్ట్రోయ్.. దయిద్రవోయ్" అని విసుక్కున్న వాడు కూడా ఈ పతంజలే.

పాత్రలను సృష్టించి లోకం మీదకి విసిరేయకుండా ఆ పాత్రలని ప్రతి మనిషి స్వభావంలోనూ చూపించిన సాహిత్య బ్రహ్మ పతంజలి రాజుగోరే. బహుశా, గురజాడ, పెద్ద గురువుగారు రా.వి.శాస్త్రి తర్వాత వారు సృష్టించిన పాత్రలను వారి వెంటే తిప్పుకున్నది పతంజలే అనిపించింది ఆయనతో కొన్ని సంవత్సరాలు ప్రయాణం చేసిన నాకు. తనకు తెలిసీ తెలియని వైద్యాన్ని అందించేసి ఆనక ఆ మనిషి ప్రాణం మీదకి వచ్చిన తర్వాత ఆదరాబాదరాగా కార్పొరేట్ ఆసుపత్రులకు తరలించే ఆర్‌ఎంపీ డాక్టర్లను ఇప్పుడు ప్రతి పల్లెలోనూ చూస్తున్నాం కదా...! కాని ఉప్పలపాటి ఫకీర్రాజు అనబడే ఓ ఆయుర్వేద ఆర్‌ఎంపీ చేత "నాయనా వైద్యుడిగా చెలామణీ కావడానికి వైద్యమే రానక్కరలేదు. మనం వైద్యం చేస్తే జబ్బులు పూర్తిగా తగ్గిపోకూడదు. అలాగని మనుషులు కూడా పోకూడదు" అంటూ భవిష్యత్ వైద్యోపనిషత్‌ని మూడున్నర దశాబ్దాల క్రితమే చెప్పిన వాడూ ఈ క్రాంతిదర్శి పతంజలే. అప్పన్న సర్దార్ గవర్నర్‌ని కలిసి రేపే సీఎంగా ప్రమాణ స్వీకారం అన్న ఆనందంలో భార్యకు ఫోన్ చేసి "ఏమే రేపటి నుంచి నువ్వు ముఖ్యమంత్రి పెళ్లానివి" అని చెప్పినప్పుడు అవతలి నుంచి ఆ అమాయకురాలు "ఛీ.. బాగోదండీ " అంటూ చెప్పిన సమాధానంలో ఎటకారంతో పాటు ఏనాటి రాజకీయాలకైనా సరిగ్గా తగిలిన బాణమే ఉందనిపిస్తుంది కదా...! ఇంటికి చుట్టం చూపుగా వచ్చిన బంధువుని కట్టేసి, తన్ని మరీ మర్యాదలు చేసిన రాజుల లోగిళ్లని అంతకు మునుపు కానీ, ఆ తర్వాత కానీ మనకి ఎవరైనా చెప్పారా పతంజలి వినా... అగ్రరాజ్యం అధిపతి బుష్‌గారు చెపినట్లుగానే పాకిస్థాన్‌కు షేక్‌హ్యాండ్ ఇస్తామన్న అటల్ బీహారీ వాజ్‌పేయ్‌ని అమెరికా పెద్ద పాలేరుగా కీర్తించింది ఈ ధైర్యశాలి పతంజలే. ఇలాంటి అనేకానేక సంఘటనలకు మనల్నే బాధ్యుల్ని చేస్తూ నీకెటూ ఆత్మగౌరవం లేదని తేల్చేసిన వాడు ఒకే ఒక్క పతంజలి మాత్రమే. వారసత్వ రాజకీయాలతో ప్రజలకు సంబంధం ఏమిటని ప్రశ్నిస్తూనే దొప్పలపూడి సన్యాసినాయుడి గారి మూడో కొడుకు ఎంతో ఎన్టీ రామారావు గారి కుమారుడు కూడా మనకి అంతే అని ఈసడించుకున్న ఏకైక తెగువ ఉన్న జర్నలిస్టు ఈ ఇలాతలంలో ఎవరైనా ఉన్నారా అని అడిగితే నే చెప్పే పేరు కే.ఎన్.వై. పతంజలి. ఎవడి బతుకులు వాడు బతకడం లేదని, పరాయి బతుకుల దారిలో నడుస్తున్నామని గుర్తు చేసిన వాడు. జీవించమంటే గెలవడం కాదని, గెలుపు కోసం పరుగులు తీస్తూ జీవితాన్ని కోల్పోతున్నామని ఎరుక కలిగించేందుకు ప్రయత్నించిన వాడు కూడా ఈ పతంజలే. ఆయన ఎన్ని చెప్పినా.... మనం ఇంకా గెలుపు కోసం తపిస్తూ పరుగులు తీస్తున్నామని, బతకడం లేదని, ఐదేళ్లకోసారి చూపుడు వేలుని మార్కెట్‌లో పెట్టడం వదల్లేదని... ఆ సురాలోకంలో విహరిస్తున్న పతంజలికి చెబుదామనే ఇదంతా....

(మార్చి 29 మహా రచయిత కే.ఎన్.వై. పతంజలి జయంతి)

- సీనియర్ జర్నలిస్టు, 99120 19929

కేజ్రీవాల్ అరెస్టులో బెడిసిన బీజేపీ వ్యూహం

సుశీల్‌కుట్టి

ఢిల్లీ ముఖ్యమంత్రి, ఆప్ నాయకుడు అరవింద్ కేజ్రీవాల్‌ను అత్యంత హైడ్రామా మధ్య గురువారం రాత్రి అరెస్టు చేయడం బీజేపీకి నష్టం జరగవచ్చునని అంచనాలు వస్తున్నాయి. లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న కొద్ది ప్రతిపక్ష నాయకులను ఏదో ఒక సాకు చూపి అరెస్టు చేయించి ఎన్నికల్లో ప్రయోజనం పొందాలని ప్రధాని నరేంద్రమోదీ ప్రయత్నించడం ఇటీవల పెరిగింది. మద్యం కుంభకోణం కేసులో కేజ్రీవాల్ కీలక పాత్ర ఉందని విచారణ కోసం ఏడుసార్లు ఈడీ నోటీసులు ఇచ్చినా హాజరుకాక పోవడంతో కేజ్రీవాల్ ఇంట్లో సోదాలు చేసి అరెస్టు చేశారు. హైకోర్టు కేజ్రీవాల్ ను అరెస్టు చేయకుండా స్టే ఇవ్వడానికి తిరస్కరించింది. దీంతో ఈడీ అధికారులు కేజ్రీవాల్‌ను ఆయన ఇంట్లో అరెస్టు చేశారు. దీనిపై ఆప్ నాయకులు సుప్రీంకోర్టుకు వెళ్లి అనంతరం పిటిషన్ ఉపసంహరించారు. కేజ్రీవాల్ అరెస్టు బెడిసి కొడుతుందనీ, ఎన్నికల్లో తమకు నష్టం కలుగుతుందని బీజేపీ అభిప్రాయపడింది. ఈ నేపథ్యంలో ఆప్ కేసు ఉపసంహరించుకున్నదని పరిశీలకుల భావన. సుప్రీంకోర్టు విచారణకు సిద్ధమవుతున్న సమయంలో కేసు ఉపసంహరించుకున్నట్టు ఆప్ న్యాయవాది అభిషేక్‌మను సింఘ్వి ప్రకటించారు. అరెస్టు సార్వత్రిక ఎన్నికల్లో కేజ్రీవాల్‌కు సానుకూలతను కలిగించవచ్చునని అనుకుంటున్నారు. కోర్టును ఆప్ తప్పుదారి పట్టిస్తోందని సొలిసిటర్-జనరల్ తుషార్ మెహతా వాదించారు. కేసును సుప్రీంకోర్టు కొట్టివేసే వరకు కేజ్రీవాల్‌ను రిమాండ్‌కు హాజరుపరచవద్దని ఈడీకి చెప్పానని తుషార్‌మెహతా వెల్లడించారు. అరెస్టు పట్ల కేజ్రీవాల్ ఏమాత్రం ఆందోళన చెందలేదు. ఇది 'పూర్తిగా న్యాయ సంబంధమైన' అంశమని బీజేపీ వ్యాఖ్యానించగా, "పూర్తిగా రాజకీయ కుట్ర" అని ఆప్ విమర్శించింది. 2019 ఎన్నికలలో బీజేపీ ఢిల్లీలోని ఏడు లోకసభ సీట్లను గెలుచుకున్నది. అయితే ఈసారి ఇండియా కూటమిలో ప్రధాన భాగస్వాములైన కాంగ్రెస్, ఆప్ పొత్తు పెట్టుకొని పోటీ చేయాలని నిర్ణయించుకోవడంతో బీజేపీ ఆందోళనకు లోనైంది.

కేజ్రీవాల్‌పై సానుభూతి:

కేజ్రీవాల్‌ను అరెస్టు చేసి వేధించి ఉన్నట్లయితే ప్రధాని నరేంద్రమోదీపై వ్యతిరేకత పెరిగి ఉండేదని, ఇప్పుడు కేజ్రీవాల్‌పై ఢిల్లీ ఓటర్లు సానుభూతితో ఉన్నారని విశ్లేషిస్తున్నారు. కేవలం సానుభూతి మాత్రమే కాకుండా ఓట్లు కూడా ఆప్‌కి వేస్తారని అంచనా వేస్తున్నారు. సంక్షోభం నుంచి ఆయన బయటపడతారని అనుకుంటున్నారు. ఆప్ తదితర పార్టీలపై వివక్ష చూపుతూ వేధిస్తున్నారని భావిస్తూ బీజేపీకి వ్యతిరేకంగా ఓటు వేయనున్నారు. అయితే ఆప్ పట్ల తీవ్రమైన ఒత్తిడి చేయవచ్చునని భావిస్తున్నారు. ఆప్‌కి ఇప్పుడు నాయకత్వం లోపం ఏర్పడుతుంది. కేజ్రీవాల్‌తో సమానమైన నాయకుడెవరూ పార్టీలో లేరు. యోగేంద్రయాదవ్, కిరణ్‌బేడీ, ప్రశాంత్‌భూషణ్, కుమార్‌విశ్వాస్ లాంటి వాళ్లు ఉన్నప్పటికీ కేజ్రీవాల్‌తో పోల్చలేం. కేజ్రీవాల్ బయటపడి మళ్లీ ఎన్నికల్లో పాల్గొంటే ప్రయోజనం కలుగుతుంది. బహుశా ఆయన సతీమణి ముఖ్యమంత్రిగా బాధ్యతలు తీసుకోవచ్చు అని భావిస్తున్నారు. కేజ్రీవాల్ స్థానంలో అతిషిమర్లేనా, పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్‌మన్ తదితరులు కలిసి ఒక నిర్ణయం తీసుకోవచ్చు. సార్వత్రిక ఎన్నికలు త్వరలో జరగనున్న సమయంలో కేజ్రీవాల్ అరెస్టు ఎదుర్కోవలసింది కాదు. ఈడీ అనేక సార్లు సమన్లు పంపినప్పటికీ హాజరు కాకపోవడంతో పరిస్థితి అరెస్టు దాక వచ్చింది. ఢిల్లీని రాజకీయంగా, ఆర్థికంగా మార్చివేస్తానని చెబుతున్న మోదీ ఆప్‌ని రకరకాలుగా వేటాడవచ్చు. ఇంతవరకు ఏ నిర్ణయం తీసుకోకుండా ఉన్న ఓటర్లు ఇప్పుడు కేజ్రీవాల్‌కు అనుకూలంగా మారతారని కొంతమంది వార్తలు రాశారు. అయితే ఎవరు ముందంజలో ఉంటారో ఊహించడం కష్టమే. పత్రికల వార్తల్లో మాత్రం మోదీదే పైచేయిగా ఉంది. ఢిల్లీ విషయంలో మాత్రం మోదీ పైచేయిగా ఉంటుందని చెప్పటం కష్టం. కాంగ్రెస్ ఆమ్‌ఆద్మీ పార్టీ వైపు దృఢంగా నిలుస్తుంది. ఆప్, బీజేపీ మధ్య గట్టి పోటీ ఉంటుంది. ఫలితాలు కచ్చితంగా బీజేపీకే అనుకూలంగా ఉంటాయని చెప్పడానికి అవకాశం లేదు. తాజా పరిణామం మూలంగా కాంగ్రెస్, ఆప్ కూటమి ఢిల్లీలో పరిస్థితిని పూర్తిగా మార్చివేయవచ్చు.

కాంగ్రెస్‌కు అనుకూలంగా ముస్లింలు అత్యధికంగా ఓటు వేస్తారు. అలాగే ఆప్‌కి కూడా ముస్లింలు ఓటు వేస్తారు. కర్నాటక అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ముస్లింలు అత్యధికంగా ఓటు చేశారు. పాఠశాలలు విరివిగా ఏర్పాటు చేసి చదువును మెరుగ్గా తీర్చిదిద్దటం ప్రతి మొహల్లాలోను వైద్యశాలలు ఏర్పాటు చేయటం ఆప్‌కి ఓట్లు కురిపించే అవకాశం ఉంది. బీజేపీ మాత్రం ఆప్ చేసిందేమీ లేదంటూ ప్రచారం చేస్తోంది. కేజ్రీవాల్ అరెస్టు తర్వాత పరిస్థితులు ఆయనకు అనుకూలంగా మారనున్నాయి. అయితే కేజ్రీవాల్ ఎన్నికల బరిలో లేకపోవటం లోపమే అవుతుంది. తాజాగా పరిస్థితి మారినందున బీజేపీ మరింత వేగంగా ప్రచారం సాగించనున్నది. ఆప్ ఒక ప్రణాళిక ప్రకారం ఎన్నికలలో పాల్గొనవలసి ఉంటుంది. ఒక దశలో కేజ్రీవాల్ తప్పుడు అంచనా వేశారు. ఇప్పుడు ఆప్ కూడా అవినీతికి పాల్పడిందన్న ఆరోపణలు వచ్చాయి. మళ్లీ కేజ్రీవాల్ ముఖ్యమంత్రి స్థానంలో కూర్చుని ఢిల్లీని పాలించే అవకాశం కచ్చితంగా ఉంటుందని ప్రతిపాదించటం సరైనది కాదు. ఏదో విధంగా మోదీ ప్రభుత్వం ఢిల్లీలో ఆప్ ప్రభుత్వాన్ని తుడిచిపెట్టే అవకాశం లేకపోలేదు. ఆప్ నూతన ముఖ్యమంత్రిని ఏర్పాటు చేసి ఢిల్లీని పాలించవలసి ఉంటుంది. కేజ్రీవాల్ తీహార్ జైలు నుంచే పోరాడటం కష్టమే. ప్రతి విషయానికి కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకుంటుంది. విశాలమైన నాయకత్వాన్ని ఆప్ ఏర్పాటు చేసుకునే అవకాశం లభించింది. ఏమాత్రం వివాదాస్పదం కాని నాయకుడిని ప్రస్తుతానికి ముఖ్యమంత్రిగా ఎంపిక చేయాలి. ఢిల్లీ ప్రభుత్వం కూడా కుంభకోణాల్లో ఇరుక్కుపోయిందని మోదీ ప్రచారం చేస్తారు. ఎక్సైజ్ విధానం, ఢిల్లీ జల్ బోర్డు విధానాలు కుంభకోణాలేనని బీజేపీ ప్రచారంలో పెట్టింది. మోదీ ప్రభుత్వం నిరంతరం కేజ్రీవాల్‌ను ఎలా దెబ్బతీయాలి అని ఎదురుచూస్తుంటుంది. జల్ బోర్డు విషయంలో కూడా ఆప్‌కి సమన్లు జారీచేశారు. కేజ్రీవాల్ అవినీతికి ప్రతీక అని కూడ బీజేపీ ప్రచారం చేసేందుకు వ్యూహం పన్నింది. బీజేపీ నుంచి రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలని ఇండియా కూటమి, ఆప్ విస్తృతంగా ప్రచారం చేస్తున్నాయి.

అధికార దుర్వినియోగానికి పరాకాష్ఠ

- బీజేపీ భారీ మూల్యం చెల్లించక తప్పదు
- కేజ్రీవాల్ అరెస్టును ఖండించిన విపక్షాలు

న్యూఢిల్లీ: ఢిల్లీ ముఖ్యమంత్రి, ఆప్ అధినేత అరవింద్ కేజ్రీవాల్ అరెస్టును విపక్షాలు తీవ్రంగా ఖండించాయి. కేంద్రంలోని మోదీ సర్కారు కక్షపూరితంగా వ్యవహరిస్తోందని, రాజకీయ కుట్రలకు పాల్పడుతోందని విమర్శించాయి. విపక్ష నేతల గొంతు నొక్కేందుకు అక్రమ కేసుల్ని బనాయిస్తూ సీబీఐ, ఈడీని ప్రయోగిస్తోందని నిరసించాయి. సార్వత్రిక ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైన తర్వాత ఇలాంటి చర్యలకు దిగడమంటే రాజకీయ కక్షసాధింపు చేయడం ద్వారా విపక్షాలపై ఒత్తిడి తెచ్చే ప్రయత్నమేనని విపక్ష నేతలు విమర్శించారు. ఎన్నికల బాండ్ల వ్యవహారంతో బీజేపీ అవినీతి బయటపడటంతో ప్రజల దృష్టి మరల్చడానికే ఇటువంటి చర్యలకు ప్రధాని మోదీ పూనుకుంటున్నారని వారు దుయ్యబట్టారు.

ఎన్సీపీ(ఎస్పీ) అధినాయకుడు శరద్ పవార్ మాట్లాడుతూ...అధికార దుర్వినియోగానికి బీజేపీ భారీ మూల్యం చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఎమర్జెన్సీ సమయంలో తాము ప్రదర్శించిన విధంగా ఎన్నికల్లో ప్రజలు తమ సమిష్టి శక్తిని ప్రదర్శించడం ద్వారా బీజేపీకి బుద్ధి చెబుతారని తాను విశ్వసిస్తున్నానని పవార్ అన్నారు. మద్యం పాలసీని ఢిల్లీ రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయించిందని... రాష్ట్రానికి సంబంధించిన విధానాలను రూపొందించడం వారి హక్కు అని పవార్ అన్నారు. ఒక విధానంపై ముఖ్యమంత్రిని, ఆయన సహచరులను అరెస్టు చేయడం సరికాదన్నారు. అధికార దుర్వినియోగం ద్వారా ఒక ముఖ్యమంత్రిని అరెస్టు చేసే స్థాయికి ఈరోజు బీజేపీ వెళ్లిందని దుయ్యబట్టారు. ఇండియా కూటమికి చెందిన వ్యక్తిగా కేజ్రీవాల్ అరెస్టును ఖండిస్తున్నానని, ఆయనకు అండగా నిలుస్తానని స్పష్టం చేశారు. కేజ్రీవాల్‌ను అరెస్టు చేయడంపై రాజస్థాన్ మాజీ ముఖ్యమంత్రి, కాంగ్రెస్ సీనియర్ నేత అశోక్ గెహ్లాత్ మోదీ సర్కారుపై మండిపడ్డారు. రాజ్యాంగ పదవుల్లో ఉన్న నేతలను అరెస్టు చేయడం దేశంలోనే తొలిసారి అని గెహ్లాత్ అన్నారు. 'మొదట జార్ఖండ్ ముఖ్యమంత్రి, ఇప్పుడు ఢిల్లీ ముఖ్యమంత్రి అరెస్టు... కేంద్ర దర్యాప్తు సంస్థల దుర్వినియోగానికి పరాకాష్ఠకు నిదర్శనమని చెప్పారు. ఈడీ పని రాజకీయ విధ్వంసానికి పరిమితమైందని, ఇది ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమేనని ధ్వజమెత్తారు. లోక్‌సభ ఎన్నికల్లో రాత్రి పగలు తేడా లేకుండా 400 సీట్లు వస్తాయని సందడి చేస్తున్న బీజేపీకి 200 సీట్లు కూడా వస్తాయన్న విశ్వాసం లేదని... అందుకే ఇలాంటి నియంతృత్వ చర్యలు రోజురోజుకు అధికమవుతున్నాయని ఆయన మండిపడ్డారు. మోదీ సర్కారు కక్షగట్టి ప్రతిపక్ష సీఎంలను అరెస్ట్ చేయడం దారుణమని పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతాబెనర్జీ అన్నారు. కేజ్రీవాల్ అరెస్టును ప్రజాస్వామ్యంపై దాడిగా అభివర్ణించారు. బీజేపీ తో సంబంధాలు ఉన్న కళంకిత నాయకులు ఈడీ కంటికి కనిపించడం లేదని ఎద్దేవా చేశారు. విపక్ష నేతల అరెస్టులపై ఇండియా కూటమి ప్రతినిధులు ఎన్నికల సంఘాన్ని కలిసి ఫిర్యాదు చేయనున్నట్లు మమత ప్రకటించారు. 'ప్రజలచే ఎన్నుకోబడిన ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ అరెస్టును నేను తీవ్రంగా ఖండిస్తున్నాను. ఆయనకు నా మద్దతు, సంఘీభావాన్ని తెలపడానికి నేను వ్యక్తిగతంగా శ్రీమతి సునీతా కేజ్రీవాల్‌తో మాట్లాడాను' అని మమత 'ఎక్స్' వేదికగా వెల్లడించారు. సీబీఐ, ఈడీ దర్యాప్తులను ఎదుర్కొంటున్న వ్యక్తులు ప్రత్యేకించి బీజేపీతో పొత్తుపెట్టుకున్న తర్వాత వారి కార్యకలాపాలను ఎటువంటి ఆటంకాలు లేకుండా కొనసాగించడానికి స్వేచ్ఛనిచ్చినప్పుడు... ప్రజలచే ఎన్నికైన ప్రతిపక్ష ముఖ్యమంత్రులను ఎలా అరెస్టు చేస్తారని ప్రశ్నించారు. ఇది ప్రజాస్వామ్యంపై కఠోరమైన దాడిగా ఆమె పేర్కొన్నారు. కేజ్రీవాల్ అరెస్ట్ ప్రజాస్వామ్యానికి మాయని మచ్చ అని, అధికార బీజేపీ ఓటమి భయానికి నిదర్శనమని నేషనల్ కాన్ఫరెన్స్ ఉపాధ్యక్షుడు, జమ్మూకశ్మీర్ మాజీ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా అన్నారు. తమ పార్టీ కేజ్రీవాల్‌కు, ఆమ్‌ఆద్మీ పార్టీకి అండగా నిలుస్తుందని చెప్పారు. కేజ్రీవాల్ అరెస్టు ఎన్నికలతో ముడిపడి ఉందని స్పష్టం చేశారు. లోక్‌సభ ఎన్నికల తేదీలను ఈసీ ప్రకటించిన కొద్ది రోజుల్లోనే సిట్టింగ్ ముఖ్యమంత్రి, ప్రతిపక్ష కూటమిలోని ఒక ముఖ్యమైన పార్టీ నేతను అరెస్టు చేశారని, కొన్ని వారాల క్రితం, జార్ఖండ్ సిట్టింగ్ సీఎం కూడా ఇదే స్థితిలో ఉన్నారన్నారు. అక్కడి ఉప ముఖ్యమంత్రిని, మరికొందరిని కూడా గత సంవత్సరం ఇలాగే అరెస్టు చేశారని చెప్పారు. 'ఈ ప్రభుత్వం శాశ్వతంగా ఉండదు, ఏదో ఒక సమయంలో అధికారం కోల్పోతుంది. కానీ దేశ ప్రజాస్వామ్య వ్యవస్థలన్నీ నాశనం చేయబడే శాశ్వత వారసత్వాన్ని వదిలివేయడం చాలా దురదృష్టకరం' అన్నారాయన. ఇందిరాగాంధీ హయాంలో ఎమర్జెన్సీ ఉన్నప్పుడు కనీసం న్యాయస్థానాల తలుపులు తడితే న్యాయం జరుగుతుందన్న నమ్మకం ప్రజల్లో ఉండేదని... ఈరోజు దురదృష్టవశాత్తు ఆ పరిస్థితి కూడా లేదన్నారు. గత ఐదు-ఆరేళ్లలో బోలుగా మారిన వ్యవస్థలను, సంస్థలను ప్రక్షాళన చేయడం చాలా కష్టమన్నారు. అరవింద్ కేజ్రీవాల్ అరెస్ట్‌పై ఎస్పీ అధినేత అఖిలేశ్ యాదవ్ స్పందిస్తూ... వారు నాయకులను జైల్లో పెట్టగలరు కానీ వారికి గుణపాఠం నేర్పే ప్రజల్ని కాదన్నారు. సమయం వచ్చినప్పుడు అది వారికి గుణపాఠం నేర్పుతుందన్నారు. అక్రమ కేసులు పెట్టడంలో బీజేపీకి బ్రహ్మాండమైన రికార్డు ఉందని ఆయన అన్నారు. 'ఎన్నికల బాండ్లు బయటకొచ్చాయి కాబట్టి ఉత్తరప్రదేశ్‌లోనే కాదు... ఎక్కడైనా చూడండి, ప్రతిచోటా నకిలీ కేసులు నమోదవుతున్నాయి. ఢిల్లీలో కూడా ఏం జరుగుతుందో చూడండి. తప్పుడు కేసులు పెట్టి జైలుకు పంపి వారి హక్కులను కాలరాయడాన్ని దేశం అంగీకరిస్తుందా' అని అఖిలేశ్ ప్రశ్నించారు. అణచివేతదారుడు ఎన్ని దౌర్జన్యాలు చేసినా చివరికి సత్యమే గెలుస్తుందని ఆయన అన్నారు.

కేజ్రీవాల్‌కు చాలాసార్లు చెప్పా... వినలేదు : అన్నా హజారే

న్యూఢిల్లీ: మద్యం పాలసీ కేసులో ఢిల్లీ ముఖ్యమంత్రి అర్వింద్ కేజ్రీవాల్ అరెస్టుపై ప్రముఖ సామాజిక కార్యకర్త అన్నా హజారే స్పందించారు. మద్యం అంశానికి దూరంగా ఉండాలని గతంలో పలుమార్లు హెచ్చరించానని చెప్పారు. మరింత సంపాదించాలన్న ఉద్దేశంతో ఆయన ఏకంగా ప్రత్యేక విధానాన్నే తీసుకొచ్చారని తెలిపారు. కేజ్రీవాల్ అరెస్టును నిరసిస్తూ, పలు విపక్ష పార్టీలు ఆయనకు మద్దతు ప్రకటిస్తున్న తరుణంలో హజారే వ్యాఖ్యలు చర్చనీయాంశమయ్యాయి. 'కేజ్రీవాల్ గతంలో నాతో కలిసి పని చేశారు. మద్యానికి వ్యతిరేకంగా తన గళం వినిపించారు. అలాంటిది ఇవాళ మద్యం విధానాన్ని తీసుకొచ్చి చిక్కుల్లో పడ్డారు. ఆయన అరెస్టు కావడం చాలా బాధగా ఉంది. కానీ, ఇప్పుడేం చేయగలం. చట్టం ప్రకారం ఏది జరిగినా ఎదురుచెప్పలేం' అని హజారే పేర్కొన్నారు. 2011లో హజారే నేతృత్వంలో అవినీతి వ్యతిరేక ఉద్యమం జరిగింది. ఈ పోరాటం నుంచే ఆమ్ ఆద్మీ పార్టీ ఆవిర్భవించింది. తర్వాత కాలంలో రాజకీయాలకు దూరంగా ఉండాలని భావించిన హజారే... పార్టీ నుంచి వైదొలిగారు. అనేక అంశాల్లో పార్టీపై బహిరంగంగానే విమర్శలు గుప్పించారు. కానీ ఆయనకు కేజ్రీవాల్ ఎలాంటి కౌంటర్లు ఇచ్చేవారు కాదు. ఢిల్లీ మద్యం విధానం గురించి అన్నాహజారే గతంలోనూ తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ఈ మేరకు తన బాధను వివరిస్తూ 2022లో సీఎం కేజ్రీవాల్‌కు లేఖ కూడా రాశారు. 'మీరు ముఖ్యమంత్రిగా బాధ్యలు చేపట్టిన తర్వాత నేను రాస్తున్న మొదటి లేఖ ఇది. మీ ప్రభుత్వం తీసుకొచ్చిన మద్యం విధానం గురించి తెలిసి చాలా బాధనిపించింది. మద్యం వలెనే అధికారం కూడా మత్తునిస్తుంది. మీరు అధికారం మత్తులో ఉన్నట్లు కనిపిస్తోంది' అని ఆ లేఖలో పేర్కొన్నారు. తాజాగా ఆ లేఖ వైరల్ అవుతోంది.

విపరీత చర్యలే వారిని వెంటాడుతున్నాయి: శర్మిష్ఠ ముఖర్జీ



అరవింద్ కేజ్రీవాల్ అరెస్ట్‌పై మాజీ రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ కుమార్తె శర్మిష్ఠ ముఖర్జీ స్పందించారు. గతంలో కేజ్రీవాల్, అన్నా హజారే బృందం ఢిల్లీ మాజీ సీఎం కాంగ్రెస్ నాయకురాలు షీలా దీక్షిత్‌పై బాధ్యతారహితమైన, నిరాధారమైన ఆరోపణలు చేశారని ఆరోపించారు. దీక్షిత్‌కు వ్యతి రేకంగా ట్రంక్ లోడ్ సాక్ష్యాలు ఉన్నాయని తమ వాదనలు వినిపించారు. అయితే అలాంటి సాక్ష్యాలను ప్రజలకు అందించలేదని ఆమె తెలిపారు. గతంలో వారు చేసిన విపరీత చర్యలే వారిని కర్మగా వెంటాడుతోందని వ్యాఖ్యానించారు. దీనికి సంబంధించిన ట్వీట్ నెట్టింట్లో వైరల్ అవుతోంది.

కుప్పకూలిన బ్రిడ్జి... ఒకరి మృతి

శిథిలాల కింద చిక్కుకున్న 30 మంది

పాట్నా: బీహార్‌లోని సుపాల్ జిల్లాలో నిర్మాణంలో ఉన్న ఓ వంతెన కుప్పకూలింది. దీంతో ఒకరు మృతిచెందగా పలువురు తీవ్రంగా గాయపడ్డారు. సుపాల్ జిల్లాలోని మరీచా సమీపంలో భేజా-బకౌర్ మధ్య కోసీ నదిపై భారీ వంతెన నిర్మిస్తున్నారు. బ్రిడ్జిలోని ఒక భాగం శుక్రవారం ఉదయం ఏడు గంటలకు ఒక్కసారిగా కూలిపోయింది. శిథిలాల కింద 30 మందికిపైగా కార్మికులు చిక్కుకుపోయారు. సమాచారం అందుకున్న పోలీసులు, సహాయక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ప్రమాదంలో ఒకరు ప్రాణాలు కోల్పోయారని, తొమ్మిది మంది గాయపడ్డారని సుపాల్ డీఎం కౌశల్ కుమార్ తెలిపారు. క్షతగాత్రులను చికిత్స కోసం సమీపంలోని దవాఖానకు తరలించామని చెప్పారు. ఈ ఘనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. రూ.1,700 కోట్లకుపైగా అంచనా వ్యయంతో కోసి నదిపై భగల్‌పూర్, ఖగారియా జిల్లాలను కలిపేలా ఈ బ్రిడ్జిని నిర్మిస్తున్నారు. దీని నిర్మాణానికి ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ 2014లో శంకుస్థాపన చేశారు. 2019లో పూర్తవ్వాల్సి ఉన్నప్పటికీ ఇంకా పనులు కొనసాగుతూనే ఉన్నాయి.

హిమాచల్‌లో కాంగ్రెస్ సర్కారుపై నీలినీడలు

రాజీనామా చేసి బీజేపీలో చేరిన ముగ్గురు స్వతంత్రులు

సిమ్లా: హిమాచల్‌ప్రదేశ్‌లో కాంగ్రెస్ ప్రభుత్వంపై నీలినీడలు కమ్ముతున్నాయి. ఇప్పటికే కాంగ్రెస్ పార్టీకి చెందిన ఆరుగురు ఎమ్మెల్యేలు రాజ్యసభ ఎన్నికల సందర్భంగా పార్టీ విప్‌ను ధిక్కరించి ఎన్డీఏ అభ్యర్థికి ఓటువేశారు. ప్రతిపక్ష బీజేపీకి అనుకూలంగా వ్యవహరిస్తూ కాంగ్రెస్ సర్కారుపై తిరుగుబాటు చేశారు. దాంతో హిమాచల్ స్పీకర్ ఆ ఆరుగురు ఎమ్మెల్యేలను సస్పెండ్ చేశారు. ఇటీవల షెడ్యూల్ విడుదల చేసిన కేంద్ర ఎన్నికల సంఘం ఆ ఆరు స్థానాలకు ఉప ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు ప్రకటించింది. గత అసెంబ్లీ ఎన్నికల్లో మొత్తం 68 స్థానాలకుగాను 40 స్థానాలు దక్కించుకున్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. మ్యాజిక్ ఫిగర్‌కు కేవలం ఆరు సీట్లు ఎక్కువగా వచ్చాయి. ఈ క్రమంలో బీజేపీ ... కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూల్చే ప్రయత్నం చేసింది. అందులో భాగంగానే ఆరుగురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు తిరుగుబాటు చేసి అనర్హత వేటుకు గురయ్యారు. ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ కి 34 మందితో బొటాబొటీ మెజారిటీ మాత్రమే ఉంది. మరో ఎమ్మెల్యే చేజారినా హిమాచల్‌లో కాంగ్రెస్ సర్కారు కూలినట్టే. ఈ క్రమంలో ఆ రాష్ట్రంలో గెలిచిన ముగ్గురు స్వతంత్ర ఎమ్మెల్యేలతో బీజేపీ రాజీనామాలు చేయించింది. త్వరలో వాళ్లు బీజేపీలో చేరేందుకు సిద్ధమయ్యారు. ఆరుగురు ఎమ్మెల్యేలపై అనర్హత వేటు, ముగ్గురు ఎమ్మెల్యేల రాజీనామాతో ప్రస్తుతం హిమాచల్ ప్రదేశ్‌లో ఎమ్మెల్యేల సంఖ్య 59కి తగ్గింది. ప్రభుత్వ ఏర్పాటుకు 30 మంది మద్దతు అసవరం. ప్రస్తుతం బీజేపీకి 25 మంది ఎమ్మెల్యేలు ఉన్నారు. ఆరు అసెంబ్లీ స్థానాలకు జరగబోయే ఉప ఎన్నికల్లో ఆరుగురు బీజేపీ అభ్యర్థులు గెలిస్తే... సభలో వారి బలం 31కి చేరుతుంది. ప్రభుత్వ ఏర్పాటుకు 33 మంది మద్దతు అవసరమవుతుంది. కాంగ్రెస్ నుంచి మరో నలుగురిని బీజేపీ తనవైపు తిప్పుకుంటే బీజేపీకి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే అవకాశం ఉంటుంది. ఒకవేళ స్పీకర్ గతంలోలాగే వారిపైన కూడా అనర్హత వేటు వేసినా కాంగ్రెస్ బలం 30కి పడిపోతుంది. అప్పుడు 31 మంది ఎమ్మెల్యేల బలం ఉన్న బీజేపీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు అవకాశం ఉంటుంది.

కేజ్రీవాల్‌కు ప్రాణహాని

ఆప్ మంత్రి సౌరభ్ భరద్వాజ్

న్యూఢిల్లీ: ఢిల్లీ మద్యం పాలసీ కేసులో అరెస్టయిన ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్‌కు ప్రాణహాని ఉందంటూ ఆమ్ ఆద్మీ పార్టీ సీనియర్ నేత, కేబినెట్ మంత్రి సౌరభ్ భరద్వాజ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. కేజ్రీవాల్ అరెస్ట్ నేపథ్యంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎలాంటి ఆధారాలు లేకుండా కేజ్రీవాల్‌ను అరెస్ట్ చేసినట్టు చెప్పారు. మద్యం పాలసీ కేసులో అరెస్ట్ అయిన తర్వాత ఓ ఫార్మా కంపెనీ డైరెక్టర్ ఎన్నికల బాండ్ల రూపంలో రూ.25 కోట్లను బీజేపీకి అందించారని ఆరోపించారు. అంతేకాదు ఈడీ అరెస్ట్ చేయడంతో కేజ్రీవాల్ ప్రాణాలకు ముప్పు ఉందన్న అనుమానం వ్యక్తం చేశారు. 'హైదరాబాద్ కేంద్రంగా ఫార్మా కంపెనీ నిర్వహించే ఓ సంస్థ డైరెక్టర్‌ను ఈడీ అరెస్ట్ చేసింది. ఆ ఫార్మా కంపెనీ 2022 నవంబర్‌లో బీజేపీకి రూ.25 కోట్ల ఎన్నికల బాండ్లను చెల్లించిందని' ఆరోపించారు. తమ ఆమ్ ఆద్మీ పార్టీ, కేజ్రీవాల్‌పై అభియోగాలు మోపినట్లుగా సంబంధిత కేసులపై ఎలాంటి ఆధారాలు లేవని తెలిపారు. కేజ్రీవాల్‌ను అరెస్టు చేసిన తీరు అమానవీయమన్న భరద్వాజ్... ఢిల్లీ సీఎం అరెస్ట్ తర్వాత ఆయన కుటుంబ సభ్యులను కలిసేందుకు బంధువులకు, పార్టీ నేతలకు అనుమతి ఇవ్వలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.

సోషల్ మీడియాలో ద్వేషపూరిత పోస్ట్‌లు

బీజేపీ ఎంపీ తేజస్వీసూర్యపై కేసు

బెంగళూరు: సోషల్ మీడియాలో విద్వేషపూరిత పోస్ట్ చేశారన్న ఆరోపణలపై బీజేపీ ఎంపీ తేజస్వీసూర్యపై కేసు నమోదైంది. ఎన్నికల సంఘం (ఈసీ) అధికారులు ఈ విషయం తెలిపారు. బీజేపీ యువమోర్చా అధ్యక్షుడు, బెంగళూరు సౌత్ ఎంపీ తేజస్వీ సూర్య సోషల్ మీడియాలో విద్వేషపూరిత పోస్టు చేస్తున్నారని, మైనారిటీలను లక్ష్యంగా చేసుకుని శత్రుత్వాన్ని వ్యాప్తి చేశారంటూ బృహత్ బెంగళూరు మహానగర పాలికే (బీబీఎంపీ) అధికారులు ఈసీకి ఫిర్యాదు చేశారు. ఈ నెల 19న ఎక్స్‌తోపాటు యూట్యూబ్‌లో ఇలాంటి పోస్టులు చేశారని విమర్శించారు. ఓటర్లను ప్రభావితం చేయడంతోపాటు వర్గాల మధ్య మత సామరస్యానికి భంగం కలిగిస్తున్నారని ఆరోపించారు. కాగా, ఈ ఫిర్యాదు ఆధారంగా ఈసీ చర్యలు చేపట్టింది. ఈ నెల 20న హలసూరు గేట్ పోలీస్ స్టేషన్‌లో ఎంపీ తేజస్వి సూర్యపై పోలీసులు కేసు నమోదు చేశారు. వివిధ వర్గాల మధ్య శత్రుత్వాన్ని ప్రోత్సహించడం, మత విశ్వాసాలను అవమానించడం, హాని కలిగించే చర్యలకు పాల్పడడం వంటి సెక్షన్లు మోపినట్లు అధికారులు తెలిపారు.

పరువు హత్యను సమర్థించిన వీడియో వైరల్

నమక్కల్ అభ్యర్థిని మార్చిన డీఎంకే మిత్రపక్షం

చెన్నై: తమిళనాడులో అధికార డీఎంకే తన మిత్రపక్షానికి కేటాయించిన నమక్కల్ స్థానంలో పోటీ చేసే అభ్యర్థికి చెందిన పాత వీడియో వైరల్ అయింది. ఆ వీడియోలో పరువు హత్యను సమర్థించిన ఆయన కులపరంగా వ్యాఖ్యలు చేశారు. ఈ నేపథ్యంలో ఆ స్థానం నుంచి పోటీ చేసే అభ్యర్థిని ఆ పార్టీ మార్చింది. కొంగునాడు మక్కల్ దేశీయ కచ్చి (కేఎండీకే) కు డీఎంకే కేటాయించిన నమక్కల్ స్థానం అభ్యర్థిగా సూర్యమూర్తిని ఆ పార్టీ ప్రకటించింది. అయితే ఆయన కొంగునాడు మున్నేట్ర కజగం (కేఎంకే) లో ఉన్నప్పుడు వివాదస్పద వ్యాఖ్యలు చేశారు. తన వర్గమైన గౌండర్ కమ్యూనిటీకి చెందిన మహిళలు కులాంతర వివాహం చేసుకుంటే వారిని చంపుతానని హెచ్చరించారు. కాగా, సూర్యమూర్తి పదేళ్ల కిందట చేసిన ఈ వ్యాఖ్యల వీడియో క్లిప్ ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అయింది. దీంతో కేఎండీకే పార్టీ స్పందించింది. నమక్కల్ స్థానం అభ్యర్థిని మార్చింది. నమక్కల్ సౌత్ జిల్లా కార్యదర్శి వీఎస్ మాథేశ్వరన్‌ను ఆ స్థానం నుంచి బరిలోకి దించింది.

ఆగిన ఇన్‌స్పెక్షన్ కోచ్... తోసిన రైల్వే సిబ్బంది

లక్నో: రైల్వే అధికారులు తనిఖీ కోసం వినియోగించే ఇన్‌స్పెక్షన్ కోచ్ సాంకేతిక సమస్యల వల్ల ఆగిపోయింది. దీంతో రైల్వే సిబ్బంది దానిని తోశారు. ఈ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయింది. ఉత్తరప్రదేశ్‌లోని అమేథీలో ఈ సంఘటన జరిగింది. రైల్వే ఉన్నతాధికారులు ఇన్‌స్పెక్షన్ కోచ్‌లో సుల్తాన్‌పూర్ నుంచి లక్నోకు గురువారం బయలుదేరారు. అయితే నిహాల్‌గఢ్ రైల్వే స్టేషన్ సమీపంలో ప్రధాన ట్రాక్‌పై అది ఆగిపోయింది. సాంకేతిక సమస్య వల్ల అక్కడి నుంచి కదలలేదు. దీంతో రైళ్ల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. కాగా, రైల్వే అధికారులు వెంటనే స్పందించారు. సిబ్బందిని అక్కడకు రప్పించారు. మెయిన్ ట్రాక్‌లో నిలిచిన ఇన్‌స్పెక్షన్ కోచ్‌ను లూప్ లైన్ వరకు తోయించారు. అనంతరం సాంకేతిక సమస్యను సరిచేయడంతో అది అక్కడి నుంచి కదిలింది. దీంతో రైల్వే అధికారులు, సిబ్బంది ఊపిరి పీల్చుకున్నారు.

మరోవైపు కొందరు స్థానికులు తమ మొబైల్ ఫోన్లలో రికార్డ్ చేసిన వీడియో క్లిప్స్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి.

మీరూ జైలుకు వెళ్లాల్సి ఉంటుంది

ఢిల్లీ ఆరోగ్య శాఖ మంత్రికి హైకోర్టు హెచ్చరిక

న్యూఢిల్లీ: నగరంలో విస్తరిస్తున్న అక్రమ పాథలాజికల్ ల్యాబ్‌ల విషయంలో ఆరోగ్యశాఖ మంత్రి సౌరభ్ భరద్వాజ్, కార్యదర్శి ఎస్బీ దీపక్ కుమార్‌లపై ఢిల్లీ హైకోర్టు మండిపడింది. వారిని జైలుకు పంపే అవకాశముందని హెచ్చరించింది. క్లినికల్ సంస్థలను నియంత్రించేందుకు చట్టం తీసుకురావడంపై న్యాయపరమైన ఆదేశాలు పాటించనందుకు చేపట్టిన విచారణ సందర్భంగా సౌరభ్ భరద్వాజ్, ఎస్బీ దీపక్ కుమార్‌లపై కోర్టు అసహనం వ్యక్తం చేసింది. 'మీరు ప్రజా సేవకులు. అక్రమ ల్యాబ్‌ల వల్ల ప్రజలు తమ రక్త నమూనాల గురించి తప్పుడు నివేదికలు పొందుతున్నారు. దీనివల్ల వారికి ఏదైనా జరిగితే మీరిద్దరూ జైలుకు వెళ్తారు. ఇందులో ఏ సందేహం లేదు' అని కోర్టు పేర్కొంది. అనధికార ల్యాబ్‌ల నియంత్రణకు వెంటనే న్యాయపరమైన వ్యవస్థను ఏర్పాటు చేయడానికి తన ఛాంబర్లో మంత్రి, కార్యదర్శితో సమావేశం కావాలని స్టాండింగ్ కౌన్సిల్‌ను ఆదేశించింది. రిజిస్ట్రేషన్ అండ్ రెగ్యులేషన్ బిల్లు 2022 పై చర్చ జరుగుతున్నప్పుడు వారు నిబంధనలకు అనుకూలంగా వ్యవహరించ లేదని కోర్టు పేర్కొంది. 2022 నుంచి అక్రమ ల్యాబ్‌ల విషయంలో వాటి నియంత్రణకు ఏర్పాటు చేసిన చట్టాన్ని అమలుచేయలేదని, ఈ జాప్యానికి కారణాలేంటో తెలిపేందుకు విచారణకు హాజరు కావాలని కోర్టు ఇద్దరినీ కోరడంతో వారు విచారణకు హాజరయ్యారు. ఢిల్లీలో కొన్ని అనధికార ల్యాబొరేటరీలు, డయాగ్నస్టిక్ సెంటర్లు అర్హత లేని సాంకేతిక నిపుణులతో నడుస్తున్నాయని, వారు రోగులకు తప్పుడు నివేదికలు ఇస్తున్నారని ఆరోపిస్తూ బెజోన్ కుమార్ మిశ్రా అనే వ్యక్తి 2018లో దాఖలు చేసిన పిటిషన్‌ను హైకోర్టు విచారించింది. ఢిల్లీ-ఎన్సీటీలో, చుట్టుపక్కల ఇలాంటి అక్రమ ల్యాబ్‌లు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తూనే ఉన్నాయని, ఎలాంటి అర్హత లేని రోగనిర్ధారణ ల్యాబ్‌ల సంఖ్య 20 వేల నుంచి 25 వేల మధ్య ఉండొచ్చని, రాజధానిలో ప్రతి వీధిలో అలాంటివి ఉన్నాయని పిటీషనర్ కోర్టుకు తెలిపారు

తమిళనాడులో భారీ వర్షం

చెన్నై: తమిళనాడు రాష్ట్రాన్ని మరోసారి భారీ వర్షం ముంచెత్తింది. రాష్ట్రవ్యాప్తంగా పలు జిల్లాల్లో శుక్రవారం ఉదయం భారీ వర్షం కురిసింది.లోతట్టు ప్రాంతాల్లోకి వర్షపు నీరు చేరడంతో ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ప్రధాన రహదారులు సైతం పూర్తిగా నీట మునగడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. భారీ వర్షానికి తూత్తుకుడి జిల్లా సహా పలు ప్రాంతాలు అతలాకుతలమయ్యాయి. ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షానికి పలు ప్రాంతాల్లో విద్యుత్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది.తమిళనాడు, పుదుచ్చేరి, కేరళలోని కొన్ని ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన ఓ మోస్తరు వర్షాలు పడే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ తెలిపింది. తమిళనాడు, పుదుచ్చేరిలోని ఉత్తర ప్రాంతాల్లో మాత్రం రాబోయే రెండు రోజుల పాటు వర్షాలు పడతాయని అంచనా వేసింది. రాబోయే ఐదు రోజుల పాటు రాయలసీమ, కేరళలో వేడి, తేమతో కూడిన వాతావరణం ఉంటుందని వాతావరణ శాఖ వెల్లడించింది.

కాంగ్రెస్ పిటిషన్ కొట్టివేసిన హైకోర్టు

న్యూఢిల్లీ: తమ పార్టీ ఆదాయపు పన్ను చెల్లింపుపై ఐటీ విభాగం చేపట్టిన పునఃపరిశీలనను కొట్టివేయాలని కోరుతూ కాంగ్రెస్ దాఖలు చేసిన పిటీషన్‌ను ఢిల్లీ హైకోర్టు శుక్రవారం కొట్టేసింది. దీన్ని జస్టిస్ యశ్వంత్ వర్మ, జస్టిస్ పురుషేంద్ర కుమార్ కౌరవ్‌లతో కూడిన బెంచ్ విచారించింది. ఆ పిటీషన్‌ను కొట్టివేస్తున్నట్లు తీర్పు వెలువరించింది. ఈ నెల 20న ఈ కేసులో వాదోపవాదనలు విన్న తర్వాత తీర్పును రిజర్వ్ చేసిన విషయం తెలిసిందే. 2014 నుంచి 2017 సంవత్సరాలకు సంబంధించిన కాంగ్రెస్ ఆదాయంపై ఐటీశాఖ పునఃపరిశీలన చేపట్టింది. దీన్ని ఆపాలని ఆ పార్టీ హైకోర్టును ఆశ్రయించింది. కాంగ్రెస్ పక్షాన పార్టీ సీనియర్ నేత అభిషేక్ మను సింఘ్వీ వాదనలు వినిపించారు. పునః పరిశీలనకు ఉన్న గడువు తీరిపోయిందని... కేవలం ఆరేళ్లు మాత్రమే వెనక్కివెళ్లి అధికారులు పరిశీలించే అవకాశం ఉందని పేర్కొన్నారు. దీనికి ఐటీశాఖ సమాధానం ఇస్తూ... తాము నిబంధనలు ఉల్లంఘించలేదని పేర్కొంది. స్వాధీనం చేసుకొన్న ఆధారాలను బట్టి రూ.520 కోట్ల మేరకు తేడాలు వస్తున్నట్లు పేర్కొంది. ఆ పార్టీ మొత్తం రూ.100 కోట్ల ఆదాయపు పన్ను చెల్లించాలని ఐటీ విభాగం ఇటీవలే నోటీసులు జారీ చేసింది. దీనిపై అప్పిలేట్ ట్రిబ్యునల్‌ను ఆశ్రయించింది. అది కాంగ్రెస్ అభ్యర్థనను తిరస్కరించింది. ఈ ఆదేశాల్లో జోక్యం చేసుకోబోమని ఇటీవలే హైకోర్టు కాంగ్రెస్ పార్టీకి తెలిపింది. ఇక పునః పరిశీలన ఆపే అంశాన్ని నేడు కొట్టివేసింది.

ఎట్టకేలకు మంత్రిగా పొన్ముడి ప్రమాణం

చెన్నై: తమిళనాడుకు చెందిన డీఎంకే నేత పొన్ముడి ఎట్టకేలకు మంత్రిగా ప్రమాణం చేశారు. పొన్ముడిని మంత్రిగా నియమించేందుకు నిరాకరిస్తూ వచ్చిన తమిళనాడు గవర్నర్ ఆర్.ఎన్.రవి సుప్రీం కోర్టు చీవాట్లు పెట్టడంతో దిగొచ్చారు. శుక్రవారం సాయంత్రం ఆయన చేత ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమానికి తమిళనాడు ముఖ్యమంత్రి ఎం.కె.స్టాలిన్ కూడా హాజరయ్యారు. అక్రమాస్తుల కేసులో పొన్ముడికి గతంలో జైలు శిక్ష పడింది. దాంతో ఆయన ఎమ్మెల్యే సభ్యత్వం రద్దయింది. తమిళనాడు హైకోర్టు మూడేళ్ల జైలుశిక్ష విధించింది. హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ పొన్ముడి సుప్రీం కోర్టును ఆశ్రయించడంతో... సర్వోన్నత న్యాయస్థానం ఆయనకు హైకోర్టు విధించిన శిక్షను నిలిపివేస్తూ ఆదేశాలు ఇచ్చింది. దాంతో పొన్ముడి ఎమ్మెల్యేగా కొనసాగుతారని తమిళనాడు స్పీకర్ ప్రకటించారు. ఆ వెంటనే సీఎం స్టాలిన్ పొన్ముడి పేరును మంత్రిగా సిఫారసు చేశారు. అయితే అందుకు గవర్నర్ నిరాకరించారు. దాంతో స్టాలిన్ సుప్రీం కోర్టును ఆశ్రయించారు. స్టాలిన్ పిటిషన్‌పై విచారణ జరిపిన సుప్రీం కోర్టు... గవర్నర్ ఆర్.ఎన్.రవికి గురువారం చీవాట్లు పెట్టింది. తాము ఇచ్చిన తీర్పును ధిక్కరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేసింది. శుక్రవారం సాయంత్రం లోపు పొన్ముడిని మంత్రిగా నియమించడంపై నిర్ణయం తీసుకోవాలని డెడ్‌లైన్ పెట్టింది. దాంతో గవర్నర్ దిగొచ్చారు. పొన్ముడిని మంత్రిగా నియమించేందుకు సమ్మతి తెలిపారు. కోర్టు తీర్పును ధిక్కరించాలనే ఉద్దేశం తనకు లేదని చెప్పారు. గత పరిణామాల ఆధారంగానే తాను పొన్ముడితో మంత్రిగా ప్రమాణం చేయించలేదని వివరణ ఇచ్చారు.

నటి రాధికకు పోటీగా 'కెప్టెన్' తనయుడు

విరుదునగర్‌లో ఆసక్తికర పోరు

చెన్నై: సార్వత్రిక ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా తమిళనాడులోని విరుదునగర్‌లో పోటీ ఆసక్తికరంగా మారింది. శుక్రవారం బీజేపీ విరుదునగర్ అభ్యర్థిగా ప్రముఖ నటి రాధికా శరత్‌కుమార్‌ను ప్రకటించింది. ఆ వెంటనే అన్నాడీఎంకే తన పోటీదారుని వెల్లడించింది. పొత్తులో భాగంగా ఆ స్థానం డీఎండీకేకు వెళ్లింది. ఆ పార్టీ నుంచి విజయ ప్రభాకరన్ పోటీ చేయనున్నారు. ఆయన డీఎండీకే వ్యవస్థాపకుడు, దివంగత నేత విజయకాంత్ కుమారుడు. ఇక పొత్తులో భాగంగా ఆ పార్టీకి ఐదు లోక్‌సభ స్థానాలు దక్కాయి. కాగా, 2006లో రాధిక రాజకీయ ప్రస్థానం మొదలైంది. తన భర్త శరత్‌కుమార్‌తో కలిసి అన్నాడీఎంకేలో చేరారు. పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నారంటూ అదే ఏడాది అగ్రనాయకత్వం వారిని తొలగించింది. 2007లో వారు ఆల్ ఇండియా సమతువ మక్కల్ కట్చి పార్టీని స్థాపించారు. దానికి ఉపాధ్యక్ష హోదాలో ఆమె సేవలు అందించారు. కొద్దిరోజుల క్రితం ఏఐఎస్ఎంకేను బీజేపీలో విలీనం చేసిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో ఆమెకు కాషాయ పార్టీ టికెట్ దక్కింది. ప్రముఖ నటుడు, డీఎండీకే అధ్యక్షుడైన విజయకాంత్ గత ఏడాది డిసెంబరులో మృతి చెందారు. ఆయన తమిళ రాజకీయాల్లో కీలక పాత్ర పోషించారు.

కేజ్రీవాల్ అరెస్టు అప్రజాస్వామికం

- దేశవ్యాప్తంగా ఆప్ ఆందోళనలు
- దిల్లీలో అతిశి, భరద్వాజ్ సహా అనేకమంది అరెస్టు

న్యూదిల్లీ/తిరువనంతపురం/పనాజీ: ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) కన్వీనర్, దిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ అరెస్టు అప్రజాస్వామికమని ఆప్ సహా ప్రతిపక్షాలు విమర్శించాయి. భారత ప్రజాస్వామ్యం, ఫెడరలిజంపై దాడిగా వర్ణించాయి. ప్రతిపక్షమే లేని దేశాన్ని బీజేపీ కోరుకుంటోందని, అందుకే వరుస పెట్టి విపక్ష నేతలను అరెస్టు చేయిస్తోందని ఆరోపించాయి. లోక్‌సభ ఎన్నికలకు ముందు ఒక ముఖ్యమంత్రిని అరెస్టు చేయించడం మోదీ ప్రభుత్వ నిరంకుశత్వానికి పరాకాష్ఠగా ఆప్ నాయకులు అన్నారు. కేజ్రీవాల్ అరెస్టుతో ప్రజాస్వామ్యం ఖూనీ అయిందని, ఒక కేజ్రీవాల్‌ను అరెస్టు చేస్తే కొన్ని లక్షల కేజ్రీవాల్‌లు రోడ్లపైకొచ్చి తమ గళాన్ని వినిపిస్తారని హెచ్చరించారు. మద్యం కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులు గురువారం రాత్రి కేజ్రీవాల్‌ను ఆయన నివాసంలో ప్రశ్నించిన తర్వాత అదుపులోకి తీసుకున్నారు. దీంతో దేశవ్యాప్త ఆందోళనకు ఆప్ పిలుపునిచ్చింది. దీంతో శుక్రవారం దిల్లీతో పాటు పంజాబ్, హర్యానా, కేరళ, గోవా, తమిళనాడు, జమ్మూకశ్మీర్, గుజరాత్ తదితర రాష్ట్రాల్లో ఆందోళనలు, నిరసనలు, ర్యాలీలు, అరెస్టులు జరిగాయి. భారీ బ్యారికేడ్లు ఏర్పాటు చేసి నిరసనకారులను ఎక్కడికక్కడ అడ్డుకునేందుకు పోలీసులు ప్రయత్నించారు. నిరసనకారులపై లాఠీచార్జీలు చేశారు. జల ఫిరంగులు ప్రయోగించారు. దీంతో దిల్లీ, పంజాబ్-హర్యానాలో ఉద్రిక్తత నెలకొంది. దిల్లీలో ఆప్ మంత్రులు అతిశి, సౌరభ్ భరద్వాజ్ అధ్వర్యంలో నిరసన జరిగింది. వారిపై జల ఫిరంగులు, లాఠీలతో పోలీసులు విరుచుకుపడ్డారు. మంత్రులతో పాటు అనేకమంది నిరసనకారులను అరెస్టు చేశారు. ఐటీవో వద్ద మంత్రి అతిశిని ఈడ్చుకెళ్లి బస్సు ఎక్కించిన దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల య్యాయి. బీజేపీ కేంద్ర కార్యాలయానికి వెళ్లే మార్గం (డీడీయూ రోడ్డు) లో పారా మిలటరీని మోహరించారు. ఉదయం 8 నుంచి సాయంత్రం 6 వరకు ఐటీఓ మెట్రో స్టేషన్‌ను పోలీసులు మూసివేశారు. అటు పంజాబ్, హర్యానాలోనూ ఆందోళనలు జరిగాయి. బీజేపీకి, ప్రధాని మోదీకి వ్యతిరేకంగా నినాదాలు అనేక నగరాల్లో మార్మోగాయి. కేజ్రీవాల్‌కు పెరుగుతున్న ఆదరణను జీర్ణించుకోలేక ఆయన అరెస్టుకు కుట్ర చేసిందని ఆప్ నాయకులు ఆరోపించారు. హర్యానాలోని కురక్షేత్రలో ముఖ్యమంత్రి నయాబ్ సింగ్ సైనీ నివాసం వద్ద ధర్నా జరిగింది. ఆయన ఇంటిని ముట్టడికి నిరసనకారులు యత్నించారు. బారికేడ్లు దాటుకొని వెళ్లేందుకు యత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. నిరసనకారులపై లాఠీలు ఝుళిపించారు. జల ఫిరంగులతో దాడి చేశారు. మోహాలీలో జరిగిన జలఫిరంగుల దాడిలో కొందరికి గాయాలయ్యాయి. తారన్ తర్న్ జిల్లాలో పోలీసుల దాడిలో ఆప్ కార్యకర్త సుఖ్‌జిందర్ సింగ్ ఎడమ కన్నుకు గాయమైంది. 'చండీగఢ్‌లోకి ప్రవేశించకుండా పోలీసులు బారికేడ్లు ఏర్పాటు చేయగా, వాటిని దాటేందుకు ప్రయత్నించిన మాపై జల ఫిరంగులతో దాడి చేశారు. దీంతో నా కన్ను దెబ్బతిన్నది. పోలీసుల దాడిలో భౌతిక గాయాలయ్యాయి' అని సింగ్ చప్పారు. మనిషిని జైల్లో పెట్టగలరు కానీ ఆయన ఆలోచనలను కాదని పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ మాన్ అన్నారు. కేజ్రీవాల్‌కు ఆప్ వెన్నుదన్నుగా నిలుస్తుందన్నారు. దిల్లీ, పంజాబ్‌లో చేసిన మంచి పనులను ఇతర రాష్ట్రాలకు వ్యాప్తి చేయకుండా కట్టడి చేసేందుకే బీజేపీ ఆయనను అరెస్టు చేయించిందని పంజాబ్ మంత్రులు అమన్ అరోరా, మాన్, చేతన్ సింగ్ ఆరోపించారు.

గోవాలో ఆప్ రాష్ట్ర అధ్యక్షుడు అమిత్ పాలేకర్, ఎమ్మెల్యేలు వెన్జి వేగస్, క్రజ్ సిల్వాతో పాటు అనేక మంది కార్యకర్తలు కలిసి మార్గో బస్టాండ్ వద్ద మార్చ్ నిర్వహించారు. బీజేపీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దక్షిణ గోవాలోని బీజేపీ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. కేజ్రీవాల్‌ను చూసి బీజేపీ భయపడుతోందని, అందుకే అరెస్టు చేయించిందన్నారు. 'ఈసారి 400కుపైగా స్థానాల్లో గెలవాలన్న కల సాకారం కాబోదని బీజేపీ గ్రహించింది కాబట్టి ప్రతిపక్షం లేకుండా చేయాలని యత్నిస్తోంది, విపక్ష గళాలను నొక్కే చర్యల్లో నిమగ్నమైంది' అని పాలేకర్ వ్యాఖ్యానించారు. బీజేపీ అంతం దగ్గరల్లో ఉన్నదన్నారు. ఆందోళనలను విరమించవద్దని ఆప్ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఘోరంగా ఓటమి పాలు కాకుండా ఉండేందుకు అపవిత్ర కూటములపై బీజేపీ ఆధారపడుతోందని విమర్శించారు. బీజేపీ 'కల్ట్'గా మారిందని, గుడ్డిగా ఒకరి వెనుక ఒకరు వెళుతున్నట్లుగా ఆ పార్టీ నేతల పద్ధతి ఉన్నదని పాలేకర్ ఎద్దేవా చేశారు. కేరళలోనూ కాంగ్రెస, సీపీఎం, ఆప్ వేర్వేరుగా నిరసనలు, ప్రదర్శనలు చేపట్టాయి. కేజ్రీవాల్ అరెస్టు, కాంగ్రెస్ ఎన్నికల నిధి జప్తు భారత ప్రజాస్వామ్యం, ఫెడరలిజంపై దాడిగా ఎంపీ శశిథరూర్ వ్యాఖ్యానించారు. రాజ్‌భవన్‌కు కాంగ్రెస్ శ్రేణులతో కలిసి నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఆప్ కార్యకర్తలు కొచ్చిలో ఈడీ కార్యాలయం వరకు నిరసన ప్రదర్శనను నిర్వహించారు. తిరువనంతపురంలో రాజభవన్ వద్ద ధర్నా చేశారు. కన్నూర్‌లో సీపీఎం అధ్వర్యంలో మోదీ దిష్టిబొమ్మల దహనం జరిగింది. ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి గోవిందన్ మాట్లాడుతూ కేజ్రీవాల్ అరెస్టు మునుపటి ఎమర్జెన్సీ రోజులను గుర్తు చేసిందన్నారు. కేజ్రీవాల్ మరింత శక్తిమంతమైన నాయకుడిగా వస్తారని అన్నారు. కేరళ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (కేపీసీసీ) అధ్యక్షుడు సుధాకరన్ మాట్లాడుతూ ఈడీ, సీబీఐ, ఐటీ శాఖలను రాజకీయ ప్రత్యర్థులపై దాడులకు, అసమ్మతి గళాల అణచివేతకు బీజేపీ దుర్వినియోగిస్తోందని విమర్శించారు.

బీజేపీవి మురికి రాజకీయాలు

ప్రజల దృష్టి మళ్లించేందుకే కేజ్రీవాల్ అరెస్టు: సీపీఐ

న్యూదిల్లీ: దిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ అరెస్టును భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) తీవ్రంగా ఖండించింది. అధిక ధరలు, నిరుద్యోగం, అసమానతలు వంటి ప్రధాన సమస్యల నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకు ఇలాంటి ఎత్తులు-జిత్తులు అని సీపీఐ జాతీయ కార్యదర్శివర్గం శుక్రవారం ఒక ప్రకటనలో విమర్శించింది. బీజేపీ మేకపోతు గాంభీర్యాన్ని ప్రదర్శిస్తోందని, వాస్తవానికి ప్రజలను ఎదుర్కొనేందుకు భయపడుతోందని వ్యాఖ్యానించింది. బీజేపీని గద్దె దించడం ద్వారా ఈ పార్టీ మురికి రాజకీయాలకు రాబోయే ఎన్నికల్లో ప్రజలు తగిన బుద్ధి చెబుతారని పేర్కొంది. లోక్‌సభ ఎన్నికల గురించి బీజేపీ ప్రగల్భాలు పలుకుతోంది తప్ప 400 సీట్లు గెలుస్తామన్న మాటలలోని డొల్లతనం తెలుసు కాబట్టే అత్యంత అప్రజాస్వామిక పద్ధతిలో ప్రతిపక్షాన్ని లక్ష్యంగా చేసుకుంటోందని విమర్శించింది. విపక్షాలను బెదిరించేందుకు దర్యాప్తు సంస్థలను వినియోగిస్తుండటాన్ని బట్టి బీజేపీ 'ఎన్నికల' తాపత్రయం అర్థమవుతోందని సీపీఐ వ్యాఖ్యానించింది.' మొన్న జార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్... ఇప్పుడు అరవింద్ కేజ్రీవాల్ అరెస్టుతో ప్రతిపక్షాన్ని బలహీనపర్చాలని యత్నిస్తోంది. విపక్ష నేతలే లక్ష్యంగా బీజేపీ చర్యలు బహిర్గతమయ్యాయి. ఈ పార్టీకి తమ ఓటు ద్వారా ప్రజలే గుణపాఠం నేర్పుతారు' అని సీపీఐ జాతీయ కార్యదర్శివర్గం పేర్కొంది.

బీజేపీకి అసమ్మతి భయం:సీపీఎం

ఎన్నికలు ప్రకటించిన తర్వాత ఒకరి తర్వాత ఒకరిగా ముఖ్యమంత్రులను అరెస్టు చేయించడం ఆమోదయోగ్యం కాదంటూ కేజ్రీవాల్ అరెస్టును సీపీఎం వేరొక ప్రకటనలో ఖండించింది. ప్రజల్లో పెరుగుతున్న అసమ్మతిని చూసి బీజేపీ బెదిరిపోతోందని పొలిట్ బ్యూరో వ్యాఖ్యానించింది. సొంత అవినీతి, ఎన్నికల బాండ్ల గుట్టురట్టు వంటివి ఆ పార్టీని భయపెడుతున్నాయని పేర్కొంది. భారత ప్రజాస్వామ్యం, రాజ్యాంగ పరిరక్షణకు రాబోయే ఎన్నికల్లో బీజేపీని ఓడించాలని సంకల్పించిన ప్రతిపక్ష నేతలే లక్ష్యంగా వ్యవహరిస్తోందని దుయ్యబట్టింది. పార్టీ ఫిరా యించి బీజేపీలో చేరిన వారిపై ఎలాంటి మరకలు ఉండవని వ్యాఖ్యానించింది. విపక్షాన్ని బలహీనపర్చే ఏ అవకాశాన్ని బీజేపీ వదలడంలేదని పేర్కొంది.

'పాలిటెక్నిక్'లో ఈవై గ్రీన్ స్కిల్స్ పాస్‌పోర్ట్ ప్రోగ్రామ్

దిల్లీ లెర్నింగ్ లింక్స్ ఫౌండేషన్‌తో సాంకేతిక విద్యాశాఖ ఎంవోయూ

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: స్థిరత్వం, ఉపాధి సాఫల్యత, వ్యవస్థాపక రంగాల్లో పాలిటెక్నిక్ విద్యార్థులను బలోపేతం చేయడమే లక్ష్యంగా "ఈవై గ్రీన్ స్కిల్స్ పాస్‌పోర్ట్ ప్రోగ్రామ్"ను అమలు చేయనున్నామని సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ చదలవాడ నాగరాణి తెలిపారు. సాంకేతిక విద్యాశాఖ, లెర్నింగ్ లింక్స్ ఫౌండేషన్-దిల్లీ మధ్య శుక్రవారం ఈ మేరకు అవగాహనా ఒప్పందం జరిగింది. సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ చదలవాడ నాగరాణి, లెర్నింగ్ లింక్స్ ఫౌండేషన్ సీనియర్ జనరల్ మేనేజర్ వందనా చౌదరి పరస్పరం ఒప్పంద పత్రాలను మార్చుకున్నారు. గ్రీన్ ఎకానమీ రంగంలో విజయం సాధించడానికి అవసరమైన విజ్ఞానం, నైపుణ్యాలతో విద్యార్థులను సన్నద్ధం చేయటానికి ఇది ఉపకరిస్తుందని నాగరాణి పేర్కొన్నారు. పాలిటెక్నిక్ రెండవ, చివరి సంవత్సరం విద్యార్థులకు ఈవై గ్రీన్ స్కిల్స్ పాస్‌పోర్ట్ ప్రోగ్రామ్ ఉచితంగా అందిస్తామన్నారు. కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీలో భాగంగా సహకరించేందుకు సంస్థ ముందుకు వచ్చిందన్నారు. 11 గంటల వ్యవధి కలిగిన ఈ కోర్సును పూర్తి చేసిన తర్వాత ఎర్నెస్ట్, యంగ్ (ఈవై), మైక్రోసాఫ్ట్ సంయుక్త ధృవీకరణ శిక్షణా పత్రాన్ని అందుకుంటారన్నారు. విద్యార్థులకు మెరుగైన ఉద్యోగ, శిక్షణ అవకాశాలు, సుస్థిరమైన పద్ధతులతో కూడిన వ్యవస్థాపక నాయకత్వంపై మార్గనిర్దేశం చేసేందుకు ఈ కోర్సు ఉపయోగపడుతుందన్నారు. తొలుత విశాఖపట్నం ప్రాంతంలోని పాలిటెక్నిక్ కళాశాలల్లో అమలు చేసి, తర్వాత రాష్ట్రవ్యాప్తంగా విస్తరించనున్నామని నాగరాణి వివరించారు. సాంకేతిక విద్యాశాఖ ఉపసంచాలకులు (ట్రైనింగ్, ఉపాధి) డాక్టర్ ఎంఏవీ రామకృష్ణ, లెర్నింగ్ లింక్స్ ఫౌండేషన్ ప్రోగ్రామ్ మేనేజర్ ప్రదీప్ కుమార్ పాల్గొన్నారు.

మోదీ కుట్రలను తిప్పికొట్టండి

కేజ్రీవాల్ అరెస్టుపై ఇండియా కూటమి నిరసన

విశాలాంధ్ర-విజయవాడ: ప్రజాతీర్పును హైజాక్ చేసే కుట్రలో భాగంగా కేంద్రంలో నరేంద్ర మోదీ ప్రభుత్వం దిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌ను అరెస్ట్ చేసిందని, దీన్ని దేశంలోని ప్రజాస్వామ్యవాదులంతా తీవ్రంగా ఖండించాలని, మోదీ కుట్రలను తిప్పికొట్టాలని ఇండియా కూటమి నాయకులు కోరారు. ఇండియా కూటమి పార్టీలు శుక్రవారం విజయవాడలోని ధర్నా చౌక్‌లో కేజ్రీవాల్ అరెస్ట్‌కు వ్యతిరేకంగా నిరసన కార్యక్రమాన్ని నిర్వహించాయి. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ, ఈ తరహా కుట్రలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. అవినీతి కుంభకోణాల్లో మునిగిపోయిన కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రతిపక్షాలపై అవినీతి ముద్ర వేస్తూ జైళ్లకు పంపడం ఏమిటని ప్రశ్నించారు. ఈ ఐదేళ్ల కాలంలో ఈడీ, సీబీఐ బనాయించిన కేసుల్లో 95 శాతం ప్రతిపక్ష పార్టీ నేతలపైనే ఉన్నాయంటే నరేంద్రమోదీ ప్రభుత్వం ఎంతగా కక్షపూరిత రాజకీయాలకు బరితెగిస్తోందో అర్థమవుతోందన్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి మద్యం కుంభకోణంపై కేంద్ర హోం మంత్రికి ఫిర్యాదు చేసినా ఎందుకు స్పందించలేదని ప్రశ్నించారు. విశాఖ డ్రగ్స్‌పై సమాచారం వచ్చినా చర్యలకు ఆరు రోజుల సమయం ఎందుకు పట్టిందో ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు. ఎలక్టోరల్ బాండ్స్ అవినీతి కేసుల్లో బీజేపీ కూరుకుపోయినా కేంద్ర దర్యాప్తు సంస్థలు స్పందించడం లేదన్నారు. ప్రతిపక్షాలపైకి మాత్రం ఎలాంటి ఆధారాలు లేకున్నా ఫిర్యాదులు రాగానే అరెస్ట్‌లు చేస్తున్నాయని విమర్శించారు.

సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యురాలు అక్కినేని వనజ మాట్లాడుతూ, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అవినీతిలో పూర్తిగా కూరుకుపోయిందన్నారు. ఎలక్టోరల్ బాండ్స్ పేరుతో బీజేపీ దేశంలో దందాకు పాల్పడుతోందని విమర్శించారు. ఫ్యూచర్ గేమింగ్ కంపెనీకి చెందిన అమిత్‌షాను ఎందుకు అరెస్ట్ చేయలేదని ప్రశ్నించారు. కేంద్ర దర్యాప్తు సంస్థలన్నీ ప్రతిపక్షాలను టార్గెట్ కావడం సరైంది కాదన్నారు. పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ సుంకర పద్మశ్రీ మాట్లాడుతూ ప్రజల్లో వస్తున్న వ్యతిరేకతను దారి మళ్లించేందుకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఎన్నికలకు ముందు ప్రతిపక్షాలను లక్ష్యంగా చేసుకొందన్నారు. రాహుల్‌గాంధీ జోడో యాత్ర తర్వాత ఇండియా వేదిక అంటే మోదీకి భయం పట్టుకుందన్నారు. అందుకే కాంగ్రెస్‌పార్టీ ఆర్థిక కార్యకలాపాలను స్థంబింపజేయడంతో పాటు భయభ్రాంతులకు గురిచేసేందుకు ఇండియా వేదిక నాయకులను అక్రమ కేసుల్లో అరెస్ట్ చేసి జైళ్లలో పెడుతోందన్నారు. అమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర కన్వీనర్ రమేశ్ మాట్లాడుతూ దేశంలో ప్రతిపక్షాలను లక్ష్యంగా చేసుకొని మోదీ ప్రభుత్వం కేంద్ర దర్యాప్తు సంస్థలన్నింటిని దుర్వినియోగపరుస్తుందని విమర్శించారు. పేద ప్రజలకు కార్పొరేట్ విద్య అందించిన మనీశ్ సిసోడియాను ఏడాది కాలంగా జైలులో ఉంచిన ప్రభుత్వం ఇప్పుడు కేజ్రీవాల్ అక్రమంగా అరెస్ట్ చేసిందన్నారు. సంయుక్త కిసాన్ మోర్చా రాష్ట్ర కన్వీనర్ వడ్డే శోభనాద్రీశ్వరరావు, సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సీహెచ్ బాబురావు, సీపీఐ విజయవాడ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు, సహాయ కార్యదర్శి నక్కా వీరభద్రరావు, సీపీఎం నాయకులు దోనేపూడి కాశీనాథ్, సత్యబాబు, కాంగ్రెస్ నాయకులు నరహరిశెట్టి నరసింహారావు పాల్గొన్నారు.

తొలుత విజయవాడ ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో అక్కినేని వనజ మాట్లాడుతూ దేశం లో రాజ్యాంగాన్ని రక్షించాల్సిన అధికారులు ప్రతిపక్ష పార్టీలపైనే దాడులు చేయడం చూస్తుంటే ప్రజాస్వామ్యాన్ని రక్షించాల్సిన అధికారులు దగ్గరుండి మరీ అధికార పార్టీ నియంతృత్వ విధానాలకు మద్దతు ఇస్తున్నట్లుగా ఉందన్నారు. నిజంగా బీజేపీకి 400 సీట్లు వస్తే ఎందుకు ఇంత భయం అన్న సందేహాన్ని వ్యక్తం చేశారు. కాంగ్రెస్ అధికార ప్రతినిధి నేతి మహేశ్వర రావు మాట్లాడతూ, కేజ్రీవాల్‌పై ఆరోపణ... ఎన్నికల కోసం నిధులు తీసుకొన్నారని మరి అదే బీజేపీ రూ. ఐదువేల కోట్లకు పైగా నిధులు అడ్డదారిన సేకరించిన విధానంపై ఈడీ చర్యలు ఉండవా అని ప్రశ్నించారు. జి.ఫణిరాజ్, కందుల పరమేశ్ పాల్గొన్నారు.

లెఫ్ట్ అభ్యర్థి నామినేషన్ రద్దు

జేఎన్‌యూలో పోలింగ్ : చివరి నిమిషంలో ఉత్తర్వులు ఏఐఎస్‌ఎఫ్ ఖండన

న్యూదిల్లీ: జేఎన్‌యూఎస్‌యూ ఎన్నికలు శుక్రవారం జరిగాయి. చివరి నిమిషంలో వామపక్షాల అభ్యర్థి స్వాతి సింగ్ నామినేషన్ రద్దు అయ్యింది. ఈమె జేఎన్‌యూఎస్‌యూ ప్రధాన కార్యదర్శి స్థానం కోసం పోటీ చేయాలనుకున్నారు. నామినేషన్ల దాఖలు, పరిశీలన సమయంలో ఎలాంటి సమస్య రానప్పుడు పోలింగ్‌కు ముందు నామినేషన్ రద్దు చేయడాన్ని స్వాతి సింగ్ ప్రశ్నించారు. అర్ధరాత్రి 2 గంటలకు ఈ ఉత్తర్వులు జారీ అయ్యాయని, తనకు ఉదయం విషయం తెలిసిందని వెల్లడించారు. చివరి నిమిషంలో నామినేషన్ రద్దు కావడంతో కోర్టును ఆశ్రయించే అవకాశం లేకపోయిందని స్వాతి తెలిపారు. కాగా, స్వాతి సింగ్ నామినేషన్ రద్దు చేయడాన్ని అఖిలభారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్‌ఎఫ్) జాతీయ సమితి శుక్రవారం ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించింది. ప్రజాస్వామ్యాన్ని తుంగలో తొక్కేస్తున్నారని విమర్శించింది. చివరి నిమిషంలో నామినేషన్ రద్దు చేయడం ఆక్షేపణీయమని పేర్కొంది. ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధంగా క్యాంపస్ ఎన్నికలు నిర్వహిస్తున్నారా అని ప్రశ్నించింది. లోక్‌సభ ఎన్నికలకు ముందు జేఎన్‌యూఎస్‌యూ ఎన్నికలు జరగనుండటంతో వీటికి ప్రాధాన్యత ఉంటుందని, వామపక్షాల అభ్యర్థి గెలిస్తే సమాజానికి రాజకీయ సందేశం వెళుతుందని బీజేపీ ప్రభుత్వానికి తెలుసని ఏఐఎస్‌ఎఫ్ ప్రధాన కార్యదర్శి దినేశ్ శ్రీరంగరాజ్ అన్నారు. ప్రజాస్వామ్యం, వామపక్షాల గెలుపును అడ్డుకునేందుక ఆర్‌ఎస్‌ఎస్- బీజేపీ ఎంత వరకైనా వెళ్లగలవని స్వాతి సింగ్ నామినేషన్ రద్దు ద్వారా స్పష్టమైందని పేర్కొన్నారు. పోలింగ్‌కు ఏడు గంటల ముందు నామినేషన్ రద్దు చేయడాన్ని బట్టి ప్రజాస్వామ్య వ్యతిరేక శక్తుల ఆదేశాల ప్రకారం యంత్రాంగం, ఎన్నికల సంఘం వ్యవహరిస్తున్నట్లు రుజువైందని దినేశ్ నొక్కిచెప్పారు. నామినేషన్ రద్దు వెనుక ఎలాంటి కారణంగానీ లాజిక్‌గానీ లేదన్నారు. ప్రారంభ దశ నుంచే ఎన్నికలను దిగ జారుస్తున్నారని విమర్శించారు. ఏబీవీపీని జేఎన్ యూ విద్యార్థులు ఓడిస్తారని ఆర్‌ఎస్‌ఎస్ అండగల యంత్రాంగానికి తెలుసన్నారు. స్వేచ్ఛ, పారదర్శక ఎన్నికలు, ప్రజాస్వామ్యం ఖూనీ కావడాన్ని దేశం సాక్షిగా నిలుస్తోందని వాఖ్యానించారు. ఏఐఎస్‌ఎఫ్ జాతీయ సమితి దీనిని తీవ్రంగా ఖండిస్తోందని, స్వాతి సింగ్‌కు సంఘీభావాన్ని ప్రకటించారు.

భూటాన్ పౌర పురస్కారం 'డ్రూక్ గ్యాల్పో' అందుకున్న మోదీ

న్యూదిల్లీ: ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి భూటాన్ దేశ అత్యున్నత పౌర పురస్కారం 'డ్యూక్ గ్యాల్పో'ను ప్రదానం చేశారు. భూటాన్‌లో రెండు రోజుల అధికార పర్యటన కోసం శుక్రవారం వెళ్లిన మోదీ... భూటాన్ రాజు జిగ్మే ఖేసర్ నాంగ్యేల్ వాంగ్‌చుక్‌ను కలుసుకున్నారు. ఈ సందర్భంగా వాంగ్‌చుక్ చేతుల మీదుగా మోదీ ఈ అత్యున్నత పౌర పురస్కారం అందుకున్నారు. రెండు దేశాల సంబంధాలను బలోపేతం చేయడం, కోవిడ్ సమయంలో తొలి విడతలోనే 5,00,000 టీకాలను అందజేయడం వంటి చర్యలు తీసుకున్నందుకు మోదీకి ఈ అవార్డును ప్రదానం చేశారు. భూటాన్ దేశపు అత్యున్నత పౌర పురస్కారం అందుకున్న తొలి విదేశీ ప్రధాని నరేంద్ర మోదీ కావడం విశేషం. ఈ సందర్భంగా మోదీ మాట్లాడుతూ రెండు దేశాల మధ్య అనాదిగా సత్సంబంధాలు కొనసాగుతున్నాయన్నారు. తాను 2014లో ప్రధానిగా బాధ్యతలు తీసుకున్న తర్వాత భూటాన్ పర్యటించినప్పుడు సొంతదేశంలోనే ఉన్న అనుభూతి కలిగిందన్నారు. పదేళ్ల క్రితం తనకు భూటాన్‌లో లభించిన సాదర స్వాగతం ఎన్నటికీ మరువలేనని చెప్పారు. 'విదేశీ గడ్డపై ఒక అవార్డు తీసుకున్నప్పుడు రెండు దేశాలు సరైన మార్గంలో పయనిస్తున్నాయనే స్పష్టమైన సంకేతాలను ఇస్తుంది. ఈ పురస్కారం ప్రతి ఒక్క భారతీయునికి చెందుతుంది. 140 కోట్ల భారతీయులకు ఈ అవార్డును అంకితం చేస్తున్నాను' అని తెలిపారు.



ప్రభుత్వ అధికారులపై చర్యలు తీసుకోండి

ఎన్నికల ప్రధానాధికారికి టీడీపీ నేతల ఫిర్యాదు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్రంలో అధికార పార్టీకి తొత్తులుగా పని చేస్తున్న కొందరు ప్రభుత్వ అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఎన్నికల ప్రధాన అధికారి ముకేశ్ కుమార్ మీనాను శుక్రవారం తెలుగుదేశం పొలిట్ బ్యూరో సభ్యులు వర్ల రామయ్య, బోండా ఉమామహేశ్వరరావు కలిసి ఫిర్యాదు చేశారు. ఎన్నికల అఫిడవిట్‌లో అభ్యర్థులపై ఉన్న కేసు వివరాలు జత చేయాల్సి ఉండగా రాష్ట్ర డీజీపీకి లేఖ రాసినా ఎస్పీని కోరండని నిర్లక్ష్య సమాధానం చెప్పారని, జిల్లా ఎస్పీలకు లేఖలు రాసినా కేసు వివరాలు వారు తెలియపరచడం లేదని ఎన్నికల ప్రధాన అధికారికి వివరించారు. అనంతరం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అమలులోకి వచ్చిన తర్వాత అవినీతి, అధికార దుర్వినియోగం, దోపిడీలు తగ్గాల్సింది పోయి అందుకు భిన్నంగా రాష్ట్రంలో పరిస్థితులు ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఎన్నికల కోడ్ అయితే మాకేంటి, మమ్మల్ని ఎవరు ఆపగలరు, నిరోధించగలరనే రీతిలో జగన్ రెడ్డి ప్రభుత్వం నడుస్తుందని, ఖనిజ సంపదను వైసీపీ ప్రభుత్వం దోచుకుంటూ ఎన్నికల్లో ఆ డబ్బును వాడుకోవాలని చూస్తుందని వారు దుయ్యబట్టారు. ఇవన్నీ ఆధారాలతో సహా సీఈఓ ముకేష్ కుమార్ మీనాకు చూపించి ఫిర్యాదు చేశామని వారు వివరించారు. జిల్లా కలెక్టర్, ఎస్పీల వద్ద నుంచి రిపోర్ట్ తీసుకొని తగు చర్యలు తీసుకుంటామని సీఈఓ హామీ ఇచ్చారని తెలిపారు.

బెంగాల్ మంత్రి నివాసంలో ఈడీ సోదాలు

కోల్‌కతా: పశ్చిమ బెంగాల్ మంత్రి చంద్రనాథ్ సిన్హా నివాసంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) బృందం శుక్రవారం సోదాలు నిర్వహించింది. స్కూల్ రిక్రూట్‌మెంట్ స్కామ్ ఆరోపణలపై దర్యాప్తులో భాగంగా బీర్‌భూమ్ జిల్లా బోల్‌పూర్‌లోని మంత్రి నివాసంలో ఈడీ సోదాలు జరిపినట్లు తెలిసింది. ఈడీ అధికారులు... కేంద్ర బలగాలతో కలిసి ఉదయం 9.15 గంటలకు సిన్హా నివాసానికి చేరుకుని సోదాలు ప్రారంభించారు. మమతా బెనర్జీ ప్రభుత్వంలో టెక్స్‌టైల్స్ మంత్రిగా పనిచేస్తున్న సిన్హా 90 కి.మీ దూరంలో ఉన్న మురారైలోని తన పూర్వీకుల ఇంటిలో ఉన్నందున సోదాల సమయంలో అక్కడ లేరు. 'స్కూల్ రిక్రూట్‌మెంట్ స్కామ్‌లో జరిగిన అవకతవకలపై దర్యాప్తుకు సంబంధించి తనిఖీలు చేపట్టాం. మంత్రి తన నివాసంలో లేరని, మేము అతని కుటుంబంతో మాట్లాడుతున్నాం' అని ఒక అధికారి తెలిపారు. గతంలో పశువులు, బొగ్గు అక్రమ రవాణా కేసుల్లో సిన్హాకు సీబీఐ సమన్లు జారీ చేసింది. కాగా కోల్‌కతాలోని లేక్ టౌన్, చెట్లా , బల్లిగంజ్‌తో సహా కొంతమంది వ్యాపారవేత్తల ఇళ్లపై కూడా ఈడీ దాడులు నిర్వహించింది. ఇతర దేశాలకు అక్రమంగా నిధులను బదిలీ చేయడంలో వారు సహాయం చేస్తున్నట్లు అనుమానిస్తున్నారు. 'మేము వారితో మాట్లాడుతున్నాము మరియు కొన్ని పత్రాలను పరిశీలిస్తున్నాము' అని ఈడీ అధికారి తెలిపారు.

బెంగాల్ సీఎస్‌కు నోటీసు జారీకి హైకోర్టు ఆదేశం

మాజీ మంత్రి పార్థ ఛటర్జీతో సహా అనేకమంది వ్యక్తులు అరెస్టయిన పాఠశాల ఉద్యోగాల కుంభకోణంలో కొంతమంది నిందితుల ప్రాసిక్యూషన్ కోసం అనుమతి మంజూరుకు జాప్యం జరగడంపై పశ్చిమ బెంగాల్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి నోటీసు జారీ చేయాలని కలకత్తా హైకోర్టు శుక్రవారం ఆదేశించింది. ఈ కేసులో నిందితులుగా ఉన్న మాజీ ప్రభుత్వోద్యోగుల బెయిల్ విన్నపాలను విన్న కోర్టు... ఈ అంశంపై స్వతంత్రంగా నిర్ణయం తీసుకోవాలని ప్రతిపాదిస్తున్న నివేదికను సమర్పించాలని ప్రధాన కార్యదర్శిని ఆదేశించింది. నిందితుల ప్రాసిక్యూషన్‌కు అనుమతి మంజూరుపై నిర్ణయం తీసుకోవడంలో జాప్యం 'తీవ్ర విచారకరం' అని వ్యాఖ్యానించిన జస్టిస్ జోయ్మాల్యా బాగ్చి నేతృత్వంలోని డివిజన్ బెంచ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శికి నోటీసు జారీ చేయాలని ఆదేశించింది. పాఠశాల ఉద్యోగాల కుంభకోణంపై హైకోర్టు ఆదేశించిన దర్యాప్తునకు సంబంధించి సీబీఐ అరెస్టు చేసినవారి బెయిల్ దరఖాస్తులు మళ్లీ విచారణకు రానుండగా, ఏప్రిల్ 3న నివేదిక సమర్పించాలని ప్రధాన కార్యదర్శిని కోర్టు ఆదేశించింది. రాష్ట్ర మాజీ విద్యాశాఖ మంత్రి పార్థ ఛటర్జీ, పశ్చిమ బెంగాల్ స్కూల్ సర్వీస్ కమిషన్ మాజీ కార్యదర్శి అశోక్ సాహా, పశ్చిమ బెంగాల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ మాజీ ప్రెసిడెంట్ కళ్యాణ్‌మోయ్ గంగూలీ, ఎస్ఎస్‌సి మాజీ చైర్మన్ సుబిరెస్ భట్టాచార్య బెయిల్ పిటిషన్లను కోర్టు సంయుక్తంగా విచారించింది. బెయిల్ పిటిషన్ విచారణ సందర్భంగా, పిటిషనర్ల తరపు న్యాయవాదులు తమ క్లయింట్లు సంవత్సరం పాటు కస్టడీలో ఉన్నారని, విచారణలు ముగిశాయని స్పష్టం చేశారు. సంబంధిత అధికారుల నుంచి అనుమతులు లేకపోవడంతో ప్రాసిక్యూషన్ నిలిచిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో కోర్టు ఆదేశాలకు ప్రతిస్పందిస్తూ, మాజీ మంత్రి పార్థ ఛటర్జీని ప్రాసిక్యూట్ చేసేందుకు పశ్చిమ బెంగాల్ గవర్నర్ అనుమతి ఇచ్చారని సీబీఐ డైరెక్టర్ తరఫున అదనపు సొలిసిటర్ జనరల్ అశోక్ చక్రవర్తి కోర్టుకు తెలిపారు. అయితే, పదేపదే అభ్యర్థనలు చేసినప్పటికీ, అశోక్ సాహా, సుబీరేష్ భట్టాచార్య, కళ్యాణ్‌మోయ్ గంగూలీ వంటి ఇతర మాజీ ప్రభుత్వోద్యోగులను ప్రాసిక్యూట్ చేయడానికి అనుమతి మంజూరు చేయడంపై రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఇంకా నిర్ణయం తీసుకోలేదని ఆయన కోర్టుకు నివేదించారు.

నీట్ రద్దు, మహిళలకు నెలకు రూ.3 వేల నగదు

ఏఐఏడీఎంకే మేనిఫెస్టో విడుదల

చెన్నై: రాబోయే లోక్‌సభ ఎన్నికలకు ఏఐఏడీఎంకే మేనిఫెస్టోను తమిళనాడు మాజీ సీఎం కే పళనిస్వామి శుక్రవారం విడుదల చేశారు. రాష్ట్రాల గవర్నర్ల నియామకంలో సీఎంలను సంప్రదించాలని కేంద్రాన్ని కోరతామని మేనిఫెస్టోలో ఏఐఏడీఎంకే పేర్కొంది. నీట్ పరీక్ష రద్దు చేస్తామని, కర్ణాటకకు చెందిన మేకేదాటు బహుళార్థ సాధక ప్రాజెక్టును ఆపేందుకు కేంద్రంపై ఒత్తిడి తెస్తామని పార్టీ హామీ ఇచ్చింది. ప్రతి కుటుంబంలో మహిళకు నెలకు రూ.3000 నగదు అందచేస్తామని హామీ ఇచ్చింది. కావేరి-గుండర్-వైగై, గోదావరి-కావేరి నదుల అనుసంధాన ప్రాజెక్టులను పునరుద్ధరిస్తామని తెలిపింది. చెన్నైలో సుప్రీంకోర్టు బెంచ్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చింది.భారత్‌లో శరణార్థులుగా నివసిస్తున్న శ్రీలంక తమిళులకు ద్వంద పౌరసత్వం కల్పిస్తామని వాగ్దానం చేసింది.తమిళనాడు సీఎం, డీఎంకే చీఫ్ ఎంకే స్టాలిన్ ఇటీవల ప్రకటించిన ఎన్నికల మేనిఫెస్టోలోనూ దాదాపు ఇవే హామీలు గుప్పించారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2024-26, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.